జనవరి
2019

153

సంపుటి : 13 సంచిక : 9 వెల రు. 10 /-

ఈ సంచికలో........

సమాఖ్య వ్యవస్థపై బిజెపి దాడి
కుల వ్యవస్థ - పాశ్చాత్య చరిత్రకారుల అధ్యయనాలు
అడుగు ముందుకు పడకుండానే రెండడుగులు వెనక్కి
వ్యవసాయ సంక్షోభాన్ని పెంచే నీతి ఆయోగ్ వ్యూహపత్రం
హంతకుల స్వేచ్ఛాధామం గుజరాత్
సామ్రాజ్యవాద దాడికి సాకు ఉగ్రవాదం
పోషకాహార లోపంతో కుంగుతున్న 'బాల భారతం'
శబరిమల పేరుతో బిజెపి రాజకీయాలు
హెగెల్‌ను దాటి ముందుకు సాగిన మార్క్స్
ఉద్యమకారిణికి వేధింపులు
సైన్స్ ఉద్యమకారుడు అమిత్‌సేన్ గుప్తా

నివాళి

## సైన్స్ ఉద్యమకారుడు

# అమిత్‌సేన్ గుప్తా



అటు సైన్స్, ఆరోగ్య ఉద్యమాల్లో పాల్గొన్న ప్రముఖ ఉద్యమకారుడు కామ్రేడ్ అమిత్ సేన్‌గుప్తా(60) ఇక లేరు. ఈయన నవంబర్ 28న ఓ విషాద ఘటనలో మృతిచెందాడు. గోవా తీరంలోని ఓ ప్రాంతంలో ఈత కొడు తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. గుప్తా భార్య పేరు త్రిప్తా నారంగ్. ఈమె పలు అంత ర్జాతీయ ప్రముఖ మీడియా సంస్థల్లో పని చేస్తుంది. కుమారుడు అరిజిత్ సేన్ గుప్తా, శివ్‌నాదర్ యూని వర్సిటీలో బిఎస్సీ మాథ మాటిక్స్ చేస్తున్నాడు.

అమిత్‌సేన్ గుప్తా ఢిల్లీలోని మౌలానా ఆజాద్ మెడికల్ కాలేజ్ నుంచి మెడిఃసిన్‌లో పట్టా పొందారు. సైన్స్ ఉద్యమ వ్యాప్తి కోసం జరిగిన అనేక ఉద్యమాల్లో అమిత్‌సేన్ ప్రముఖ పాత్ర పోషించాడు. వీటిల్లో దేశంలో ప్రముఖం గా పీపుల్స్ సైన్స్ ఉద్యమం (పిఎస్ఎం), గ్లోబల్ హెల్త్ మూవ్‌మెంట్ ఉన్నాయి. వివేక ధృక్పథం, కష్టపడే తత్వం అతనికి గుర్తింపు తెచ్చాయి.

ఢిల్లీ సైన్స్ ఫోరం(డిఎస్ఎఫ్)ను స్థాపించిన వారిలో సేన్ కూడా ఒకరు. ఈ సంస్థ ద్వారా 'స్వీయ ఆధారిత' అనే అంశంపై దేశవ్యాప్తంగా అనేక సెమినార్లు నిర్వహించారు. ఈ సంస్థ ప్రారంభించిన కొన్ని సంవత్సరాల్లోనే దీనికి అనుబంధంగా సెంటర్ ఫర్ టెక్నాలజీ అండ్ డెవలప్‌మెంట్ (సిటిడి)ను స్థాపించారు. గ్రామీణ పరిశ్రమలకు, జీవనోపాధిని అందించేందుకు అవసరమైన టెక్నాలజీని ఈ సంస్థ ద్వారా ప్రజలకు అందించేవారు.

1984 సమయంలో జరిగిన భోపాల్ గ్యాస్ ఘటన తరువాత ప్రజలు రాబోయే కాలంలో ఏ విధమైన ఆరోగ్య సమస్యలు ఎదు ర్కొనబోతున్నారన్నవిషయాలను అమిత్‌సేన్‌గుప్తా వెల్లడించారు. 1970 పేటెంట్ హక్కుల చట్టాన్ని రూపొందించటం, దాని ఫలితంగా అనేక రకాలైన జీవితావసర మందుల ధరలు తగ్గటం లో ఆయన చేసిన కృషి అత్యంత ప్రాధాన్యత కలిగినది. ఇందులో ఆయన ప్రధాన పాత్ర నిర్వహించాడు.

కామ్రేడ్ అమిత్ ఔషదాల పేటెంట్ హక్కుల కోసం దాదాపు మూడు దశాబ్దాలు పోరాడారు. అనేక మందుల తయారీ కంపెనీలు, వాటికి సంబంధించిన రాజకీయ నిర్ణయాలపై ఆయన చేసిన పోరాటాలు తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ఔషదాల పేటెంట్స్ కోసం ప్రస్తుతం ఇండియాలో జరుగుతున్న పోరాటాలకు సేన్ ఉద్యమం నాంది పలికింది.

అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం 1911లో తీసుకొచ్చిన పేటెంట్ చట్టాన్ని వారికి అనుకూ లంగా రూపొందించుకుంది. స్వాతంత్ర్యం వచ్చిన దాదాపు రెండు దశాబ్ధాల అనంతరం ఈ కొత్త చట్టాన్ని పార్లమెంట్ ఆమోదించింది. ఈ చట్టం ప్రకారం ఆహార పదార్థాలు, అటామిక్ శక్తిపై ఎవరికీ ఎటువంటి హక్కులు లేవు. అదే విధంగా ఔషద ఉత్పత్తిపై కూడా ఎటువంటి హక్కులు లేవు. కేవలం తయారీ విధానంపై మాత్రమే హక్కులు ఉండేలా ఈ చట్టం రూపొందించారు.

1911 చట్టం ప్రకారం వీలు కాని అనేక మందుల తయారీ హక్కులను 1970 చట్టం ద్వారా భారతీయ పరిశ్రమలకు కల్పించ బడ్డాయి. దీని భారతీ యులకు అనేక మందుల ధరలు అందుబాటులోకి వచ్చాయి. ఫార్మస్యూ టికల్ మార్కెట్‌లో ఏకచత్రాధిపత్యం ప్రదర్శిస్తున్న అమెరికా కంపెనీల నుంచి భారతీ యులకు ఈ చట్టం పెద్ద ఉపశమనాన్ని కలిగించింది.

ఈ నేపథ్యంలో ఆమెరికా కంపెనీలు కుట్రపూరిత ప్రయత్నాలను ఆరంభించాయి. పేటెంట్ హక్కులను కాపీ కొడుతున్నారనే అభియోగాలను భారతీయ పరిశ్రమలపై మోపి చర్యలు తీసుకోవాలని అమెరికా ప్రభుత్వాన్ని కోరాయి. దీనికి అనుగుణంగా యుఎస్ ప్రభుత్వం కూడా అడుగులు వేసింది. సూపర్ 301, స్పెషల్ 301చట్టాలను ప్రయోగించింది. దీంతో అమెరికా చట్టాలను ఇండియా పేటెంట్ చట్టం ఎదుర్కొవాల్సి వచ్చింది. ఈ విషయంలో ఇండియా ఏమాత్రం వెనక్కు తగ్గలేదు. అనంతర కాలంలో 1980 సమయానికి వచ్చే సరికి ఔషద ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించింది. 1982 సంవత్సరంలో లిస్బన్‌లో జరిగిన యునైటెడ్ నేషన్స్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కాన్ఫరెన్స్ కూడా ఇండియా చర్యలను ప్రశంసించింది. భారత్ నుండి ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలకు మందుల ఉత్పత్తికి కావలసిన సాంకే తిక పరిజ్ఞానం బదిలీకి అవకాశాలుంటా యని చెప్పింది. పోటీకి తట్టుకోలేని విదేశీ మందుల ఉత్పత్తి కంపెనీలు భారత్ నుండి తమ కార్యకలా పాలను ఉపసంహరించుకోసాగాయి.

అనంతరం 1990లో ప్రవేశపెట్టిన నయా ఉధార విధానాల వలన పరిస్థితులన్నీ ఒక్కసారిగా మారిపోయాయి. 1994లో ప్రణబ్ ముఖర్జీ వాణిజ్యశాఖ మంత్రిగా ఉన్నారు. అదే సమయంలో మర్రాకేశ్‌లో జనరల్ అగ్రిమెంట్ ఆన్ టారిఫ్ అండ్ ట్రేడ్ (జిఎటిటి) కాన్ఫరెన్స్ జరిగింది. ఈ నేపథ్యంలో ముఖర్జీ పార్లమెంట్‌ను సంప్రదించకుండా జనరల్ ఎగ్రిమెంట్ ఆన్ టారిఫ్స్ అండ్ ట్రేడ్‌ను వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యుటిఒ)గా మార్చటానికి, మందులకు ప్రొడక్ట్ పేటెంట్ ఇవ్వటానికి అంగీకరించాడు. ఈ సవరణకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడ గట్టటంలో అమిత్‌సేన్‌గుప్తా దశాబ్దకాలం పాటు ప్రధాన పోరాటం నిర్వహించటంతో పేటెంట్ యాక్ట్ 1970కి సవరణ చేయటం ప్రభుత్వానికి కష్టంగా మారింది. ఈ ఘనత కామ్రేడ్ అమిత్‌సేన్ గుప్తాకు దక్కుతుంది.

1970 చట్టానికి సంబందించి సెక్షన్ 3డికి లెఫ్ట్ పార్టీలు ప్రవేశపెట్టిన సవరణ బిల్లు 2005లోకి యుపిఎ ప్రభుత్వ హయాంలో ఆమోదం పొందింది. తెలిసిన విషయాన్ని కొంచంగా మాత్రమే హెచ్చించేవి, గతంలోని మందుల కన్నా అధిక ప్రయోజనం కలిగించని వాటిని నూతన పరిశోధనగా భావించరాదు. వినియోగంలో ఉన్న మందుల్లో కొత్త ప్రయోగం చేసిన తరువాత అవి అనుకున్న విధంగా ఫలితం ఇవ్వకుంటే అది ప్రయోగం కిందకు రాదు అని దీని సారాంశం. ఎంఎన్‌సి కంపెనీ లు వేసిన యాంటీ కాన్సర్ డ్రగ్ కేసైన 'గ్లీవెక్'లో సుప్రీంకోర్టు కూడా ఇదే విధమైన తీర్పునిచ్చింది. దీంతో పాటు మేదో సంబంధమైన హక్కుల (ట్రిప్స్) విషయంలో వాణిజ్య విషయాలకు సంబంధించి ప్రవేశపెట్టిన 'తప్పనిసరి లైసెన్స్' నిబంధన వలన ఔషదాల రేట్లు కూడా తగ్గు ముఖం పట్టాయి. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఒక మందును రూపొందించిన కంపెనీ అంగీ

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. సైన్స్ ఉద్యమకారుడు అమిత్‌సేన్ గుప్తా
....................................... 2
2. సమాఖ్య వ్యవస్థపై బిజెపి దాడి
థామస్ ఐజాక్........................ 4
3. కుల వ్యవస్థ-పాశ్చాత్య చరిత్రకారుల అధ్యయనాలు
ఎంవిఎస్ శర్మ...................... 7
4. అడుగు ముందుకు పడకుండానే రెండడుగులు వెనక్కి
ఎస్ వెంకట్రావు .................. 10
5. వ్యవసాయ సంక్షోభాన్ని పెంచే నీతి ఆయోగ్ వ్యూహపత్రం
ఎ కోటిరెడ్డి ........................ 15
6. హంతకుల స్వేచ్ఛాధామం గుజరాత్
ఆలీ అహమ్మద్ ..................... 19
7. సామ్రాజ్యవాద దాడికి సాకు ఉగ్రవాదం
జాన్ పిల్జెర్ ........................ 22
8. పోషకాహార లోపంతో కుంగుతున్న 'బాల భారతం'
సన్నీజోన్, భీమేశ్వరరెడ్డి, అగర్వాల్ .... 26
9. శబరిమల పేరుతో బిజెపి రాజకీయాలు
డిబి రూపేష్...................... 28
10. హెగెల్‌ను దాటి ముందుకు సాగిన మార్క్స్
ఎం శివరామకృష్ణన్............. 32
11. ఉద్యమకారిణికి వేధింపులు
అనుపమ కటకం .................. 34



**సంపాదకుడు:**

**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**

**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**



**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు:**బి.వి.రాఘవులు**
సంపాదకుడు : **ఎస్. వెంకట్రావు**
**ముద్రణ:** ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**ఫోన్: ఎడిటర్ : 9490099333**
**మేనేజర్ : కె.హరికిషోర్: 9490098977**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# కొత్తగాలులు

ప్రపంచంలో నియంతలు ఎక్కడైనా అభేద్యమైన వాళ్లుగా కనిపిస్తారు. వారు నిర్మించిన నిరంకుశ యంత్రాంగం, వారు సృష్టించుకున్న ప్రచార పటాటోపం వారిని మహాబలవంతులుగా చూపిస్తుంది. కానీ ప్రజా ఉద్యమాల ధాటికి పునాదులు కదిలిపోయినప్పుడు వారి సామ్రాజ్యాలు పేకమేడల్లా కూలిపోతాయి. 1943 వరకు దుర్భేద్యమైనదిగా కనిపించిన హిట్లర్ యంత్రాంగం సోవియట్ ఎర్రసేన ధాటికి రెండేళ్లలో నేలమట్టమైంది. ఫాసిజాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన ముస్సోలినీ ప్రజల చేతిలో కుక్కచావు చచ్చాడు. రెండో ప్రపంచ యుద్ధానికి ముందు ప్రపంచ వ్యాపితంగా తలెత్తిన ఫాసిస్టు శక్తులు యుద్ధం తరువాత చేతులెత్తేశాయి.

పెట్టుబడిదారీ నియంతృత్వపు బహిరంగ, హింసాత్మక రూపమే ఫాసిజం. పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయినప్పుడు ప్రభుత్వాలు రకరకాల నియంతృత్వ రూపాలను ధరిస్తాయి. మతతత్వం, జాత్యహంకారం, సైనిక నియంతృత్వం, ఎమర్జెన్సీ పాలన... ఇవన్నీ పెట్టుబడిదారీ వ్యవస్థ తాను సంక్షోభం నుండి బటయపడటానికి ఎన్నుకున్న నియంతృత్వ రూపాలు. ఈ నియంతృత్వ పరిపాలనలను ఎదిరించి, నిలువరించి, పటాపంచలు చేయగల సామర్థ్యం ప్రజా ఉద్యమాలకు మాత్రమే ఉంది.

2014లో మన దేశంలో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ఉక్కుమనిషిలాగా కనిపించారు. ఆయన ప్రభుత్వం దుర్భేద్యమైనదిగా గోచరించింది. మోడీ నాయకత్వంలోని బిజెపి-ఆర్ఎస్ఎస్ మతతత్వ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను నాశనం చేసి నియంతృత్వ యంత్రాంగాన్ని నిర్మించడానికి ప్రయత్నించింది. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు మెజారిటీ రాష్ట్రాలను చేజిక్కించుకుంది. మోడీ పాలనకు తిరుగులేదని పాలకవర్గ యంత్రాంగం ప్రచారం చేసింది.

కానీ 2018 నుండి 2019లోకి ప్రవేశిస్తున్న నేటి తరుణంలో పరిస్థితి మారిపోయింది. గత ఏడాది జరిగిన మొత్తం ఎన్నికల్లో నాలుగు పెద్ద రాష్ట్రాలు కర్నాటక, మధ్యప్రదేశ్, రాజస్తాన్, చత్తీష్‌ఘడ్‌లలో బిజెపి ఓడిపోయింది. ఒకటి రెండు పార్లమెంటు స్థానాలు ఉండే మూడు ఈశాన్య రాష్ట్రాల్లో మాత్రమే అది గెలవగలిగింది. దాంతో మోడీ చరిష్మాపై సొంతపార్టీ లోనే అనుమానాలు తలెత్తాయి. మోడీ ప్రభుత్వ నియంతృత్వ రథానికి 2018 బ్రేకులు వేసింది.

దీనికి కారణం దేశ వ్యాపితంగా జరిగిన ప్రజా ఉద్యమాలే. ప్రభుత్వ విధానాలతో తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన రైతాంగం ఎఐకెఎస్ పతాకం నీడలో ఉత్తరాది రాష్ట్రాలను ఉద్యమాలతో ఊపేసింది. లాంగ్ మార్చ్‌లు, రైతాంగ సమ్మెలు మోడీ ప్రభుత్వ పునాదులను కదిలించాయి. కార్మిక వర్గ సమ్మెలు, పడావులతో పరిస్థితిలో మార్పు వచ్చింది. సామాజిక వర్గాల ప్రతిఘటన వీటికి తోడైంది. 2019లోకి దేశం ఆశావహంగా పయనిస్తోంది.

బెంగాల్, త్రిపుర ఓటములతో కమ్యూనిస్టుల పనైపోయిందన్న వారికి కూడా కళ్లు తెరిపించే ఘటనలు జరిగాయి. శబరిమలై తీర్పునుపయోగించుకుని కేరళలో కూడా వామపక్ష ప్రభుత్వాన్ని చిక్కుల్లో పెడదామనుకున్న కాషాయ నేతలకు 2019 మొదటి రోజునే ప్రపంచ రికార్డు సృష్టించిన కేరళ మహిళా కుడ్యం చెంపచెళ్లు మనిపించింది. బెంగాల్‌లో తిరిగి పుంజుకుంటున్న ప్రజా ఉద్యమం, రాజస్థాన్ ఎన్నికల్లో ఎర్రజెండా సాధించిన మహత్తర విజయాలు కమ్యూనిస్టుల ప్రాధాన్యత పెరుగుతోందని చెబుతున్నాయి. ఆంధ్ర ప్రదేశ్‌లో నాలుగేళ్లు మోడీకి ఊడిగం చేసిన చంద్రబాబు నాయుడు ఫిబ్రవరి 8న రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీలు ఇచ్చిన బంద్‌పిలుపుకు వచ్చిన స్పందన చూసి ప్లేటు ఫిరాయించారు. అందువల్ల మోడీ రాత మార్చింది కాంగ్రెస్‌గానీ, ఇతర బూర్జువా పార్టీలు గానీ కాదనీ ప్రజలలో నివురుకప్పిన నిప్పులా రాజుకుంటున్న ప్రజాతంత్ర చైతన్యమేనని గమనించాలి. అది ప్రజా ఉద్యమాల రూపంలో కాని, ఎన్నికలలో ఇచ్చేతీర్పు రూపంలో కాని వ్యక్తమై భ్రష్టుపట్టిన పాలకవర్గ విధానాలకు ఒక ప్రత్యామ్నాయాన్ని ఆవిష్కరించే దిశగా ముందుకు సాగటం తధ్యం.


**చందా వివరాలు**


విడిపత్రిక: **రూ.10**, సంవత్సర చందా:**రూ.100**, పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

ఈ మాసం ముఖ్యాంశం

# సమాఖ్య వ్యవస్థపై బిజెపి దాడి



రచయిత
కేరళ ఆర్థికమంత్రి

**థామస్ ఐజాక్**

**మా**కినేని బసవపున్నయ్య 104వ జయంతి సందర్భంగా విజయవాడలోని ఎంబివికెలో జరిగిన సభలో కేరళ ఆర్థికమంత్రి థామస్ ఐజాక్ చేసిన ప్రసంగంలోని ముఖ్యాంశాల్ని మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం.

– సంపాదకులు

**భా**రతదేశంస్వాతంత్రోద్యమం భిన్నత్వం లో ఏకత్వం అనే ప్రాతిపదికన నడిచింది. స్వాతం త్ర్యోద్యమంలో ఈ విధానాన్ని అమలు చేశారు. స్వాతంత్ర్యం అనంతరం రాజ్యాంగాన్ని రూపొం దించిన వారు దీన్ని గుర్తించలేదు. పాకిస్తాన్ విడిపోయే సమయంలో ఉన్న పరిస్థితులను దృష్టి లో పెట్టుకుని అప్పట్లో ఫెడరల్ విధానానికి అనుగుణంగా పూర్తిగా అధికారాలు ఇస్తే సమస్య లు వస్తాయనే ఉ ద్దేశంతో కేంద్రానికి అధిక అధికారాలు కల్పిం చారు. దీంతో రాజ్యాంగం పూర్తి ఫెడరల్‌గా కాకుండా పాక్షికమైన ఫెడరల్ వ్యవస్థగా మారింది. ఈ విషయాన్ని అప్పట్లో పలువురు గుర్తించారు. 'భారతదేశ రాజకీయ వ్యవస్థ పూర్తి సమాఖ్య కాదని, పాక్షికమైన పద్ధతుల్లో ఉందని' సిపిఎం అగ్రనేత ఈఎంఎస్ నంబూద్రిపాద్ స్పష్టం చేశారు. దీనివల్ల ఎక్కువ అధికారాలు కేంద్రం చేతుల్లోనే ఉన్నాయి. చట్టపరమైన, పరిపాలనాపరమైన, ఆర్థికపరమైన విధానాలను ఒకసారి పరిశీలిస్తే ఈ అంశాలలో రాష్ట్రాలపై అధికారం చెలాయించే హక్కు కేంద్రానికుంది. పరిపాలనా పరమైన విధానాల్లో రాష్ట్రంలో కీలకమైన గవర్నర్‌ను కేంద్రం నియమించటం ద్వారాఅధికారాలను గుప్పెట్లో పెట్టుకొంటున్నది. ఇదే అమెరికాలో అయితే గవర్నర్‌ను ప్రజలు ఎన్నుకుంటారు. ఇక్కడ మాత్రం గవర్నర్‌తో కేంద్రం తనకు కావాల్సిన విధంగా చేయిస్తోంది.

**రాష్ట్రాల ఆర్థిక అధికారాల అపహరణ**

ఆర్థికపరమైన అంశాలను పరిశీలిస్తే రాష్ట్రాలకు వచ్చే పన్నుల్లో 60 శాతం వాటాను రాష్ట్రాలు వాడుకుని, 40 శాతం కేంద్రానికి ఇస్తాయి. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత 40 శాతం రాష్ట్రాలకు ఇస్తూ 60 శాతం కేంద్రం తీసుకుంటోంది. ఇది రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేయడమే అవుతుంది. ఫలితంగా రాష్ట్రాలు కేంద్రంపై ఆధారపడాల్సి వస్తోంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పరిస్థితులను మనం పరిశీలిస్తే క్రమంగా రాష్ట్రాల హక్కులు, అధికారాలు తగ్గిపోతున్నాయి. గత దశాబ్ద కాలాన్ని పరిశీలిస్తే భారతదేశంలో కేంద్రం అధికారాలు పెరుగుతూ రాష్ట్రాల అధికారాలు కోతపడుతున్నాయి. చట్టపరమైన అధికారాలను పరిశీలిస్తే విద్య, వైద్యం తదితర అంశాలు ఉమ్మడిజాబితాలో ఉన్నప్పటికీ, చట్టాలు చేసే అధికారం కేంద్రం చేతుల్లోనే ఉన్నది. వాణిజ్య చట్టాలకు సంబంధించి అనేక హక్కులను కేంద్రం తన చేతుల్లోనే ఉంచుకుంది. వీటిపై పరిపాలనాపరమైన హక్కులను కేంద్రం లాక్కుంటోంది. 1956లో రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేయడం మొదలుపెట్టినప్పటి నుండి ఇటీవల కాశ్మీర్ ప్రభుత్వాన్ని రద్దుచేసే వరకూ కేంద్రం అనుసరిస్తున్న పద్ధతులను మనం చూస్తున్నాము. 1950–51లో రాష్ట్రాల ఖర్చులు, ఆదాయానికి మధ్య వ్యత్యాసం రెండు శాతం ఉండేది. 1980 నాటికి ఆ నిష్పత్తి నాలుగు శాతానికి చేరింది. ప్రస్తుతం ఆరుశాతానికి చేరుకుంటోంది. అంటే రాష్ట్రాల ఆదాయాలు తగ్గుతూ వస్తున్నాయి. అవన్నీ కూడా నెమ్మదిగా కేంద్రం చేతుల్లోకి వెళుతున్నాయి. అంటే సాపేక్షంగా కేంద్రం బలం పెరుగుతూ రాష్ట్రాల బలం క్రమంగా తగ్గుతూ వస్తోంది. దేశంలో రాష్ట్రాలకు ఉన్న పాక్షిక ఫెడరల్ అధికారాలూ క్రమంగా క్షీణిస్తున్నాయి. మొత్తం అధికారాలన్నింటినీ కేంద్రం తన చేతుల్లో కేంద్రీ కరించుకొంటున్నది. 'ఫెడరల్ అనే పదాన్ని రాజ్యాంగం నుండి తీసేయాలని, స్వయం ప్రతి పత్తి, పాక్షిక స్వయం ప్రతిపత్తి అనే పదాలను తొలగించాలని, ఒకేదేశం, ఒకే చట్టం ఉండాల ని, భిన్నత్వం స్థానంలో ఏకత్వం తీసుకు రావాలనే గోల్వాల్కర్ సిద్ధాంతాన్ని దేశంలో అమలు చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. ఇంతకుముందున్న ప్రభుత్వాలు కూడా ఫెడరల్ హక్కులను నీరుగార్చినవే. బిజెపి మాత్రం ఓ ఆకు ఎక్కువే చదివింది. చట్టపరంగా ఫెడరల్ వ్యవస్థ లేకుండా చేసేందుకు అవసరమైన ప్రయత్నాలన్నీ చేస్తోంది. ఏకీకృత పాలనవైపుగా సాగుతోంది.

ఆర్థిక అంశాల్లో బిజెపి ప్రభుత్వం అత్యంత నియంతృత్వంగా వ్యవహరిస్తోంది. రాష్ట్రాల అప్పు రెవెన్యూ ఆదాయానికంటే మూడు శాతం మించకూడదని ఆదేశాలిచ్చారు. అంటే అవసరా నికి అప్పులు చేయకూడదు. రాష్ట్రాలు అప్పులు చేయకూడదు అని చెప్పడం ఎంతవరకు కరెక్టు? ఒకవేళ అప్పు చేయాలనుకుంటే ఆస్తులను పోగే సుకోవటం కోసం చేసుకోవచ్చని చెబుతోంది. అంటే ఆస్తుల నుండి భవిష్యత్‌లో ఆదాయం వస్తుంది గనుక దానికి మినహాయింపు ఇచ్చారు. ఈ నిర్ణయంపై చర్చలు జరుగుతున్న సమ యంలో అనేక ఆసక్తికరమైన విషయాలు వెలుగు లోకి వచ్చాయి. ఒక అంగన్‌వాడీ మహిళకు నెలకు వేతనం కింద ఆరువేల రూపాయల ఆదాయం వస్తోంది. ఇతరత్రా పనులు చేసు కుంటే మరో వెయ్యి మొత్తం ఏడువేలు సంపాది స్తోంది. నెలఖర్చులు ఎంతని అడిగితే ఏడువేల వుతున్నాయని తెలిపింది. సరిపోతుంది కదా అంటే అప్పులు చేయాల్సిందేనని తెలిపింది. ఎందుకని అడిగితే మా అబ్బాయి, అమ్మాయి చదువుకుంటున్నారు. వారికి నెలకు మూడువేలు పంపించాల్సి ఉంది దానికోసం అప్పుచేయాలని చెప్పింది. అది భారం కదా అని ప్రశ్నిస్తే వారు చదుకుంటున్నారు. వారికి పెట్టుబడి పెడు

తున్నాను. తరువాత వారు ఉద్యోగాలు సంపాదించుకుంటే నేను చేసిన అప్పులు తీరిపోతాయి. దీన్ని నేను అప్పు అనుకోవడం లేదు. పెట్టుబడి మాత్రమే పెడుతున్నాను అని చెప్పింది. అప్పు చేసినా అది తిరిగి వస్తుందని పేర్కొంది. ఒక అంగన్‌వాడీ మహిళకు ఉన్న ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి ఎందుకు ఉండటం లేదు? సదుపాయాల కోసం అప్పులు తీసుకోవచ్చు. దానివల్ల గ్రామీణ ప్రాంతాల్లో సదుపాయాలు పెరిగి ఆదాయాలు పెరుగుతాయి. మెరుగైన రోడ్ల వ్యవస్థ ఉంటే ఉత్పత్తులకు మార్కెట్ కూడా వస్తుంది. ఈ తరహా ఆలోచన ఎందుకు చేయడం లేదనేది నా ప్రశ్న.

“ఒక అంగన్‌వాడీ మహిళకు ఉన్న ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి ఎందుకు ఉండటం లేదు? సదుపాయాల కోసం అప్పులు తీసుకోవచ్చు. దానివల్ల గ్రామీణ ప్రాంతాల్లో సదుపాయాలు పెరిగి ఆదాయాలు పెరుగుతాయి. మెరుగైన రోడ్ల వ్యవస్థ ఉంటే ఉత్పత్తులకు మార్కెట్ కూడా వస్తుంది. ఈ తరహా ఆలోచన ఎందుకు చేయడం లేదనేది నా ప్రశ్న.”

### కేంద్ర విధానాలతో కేరళకు నిధుల కొరత

మేం కేరళలో అన్ని పాఠశాలలను డిజిటలైజ్ చేయాలను కుంటున్నాము. అక్కడ బోర్డులు వంటివి తీసేసి పూర్తిగా డిజిటల్ తరహాలోవిద్యాబోధన చేయాలనుకుంటున్నాము. ఇలా చేయాలంటే అప్పు చేయాల్సిందే. దీనివల్ల విద్యావ్యవస్థ అభివృద్ధి చెందుతుంది. నిపుణులు తయారవుతారు. ఆదాయం పెరిగి ఆర్థికంగా మెరుగవుతాము. రోడ్లు వేయాలనుకుంటున్నాము. ఇవి కూడా ఆర్థికంగా రాష్ట్రాలు అభివృద్ధి చెందేందుకు ఉపయోగపడతాయి. విద్య, వైద్యం మీద ఖర్చు పెట్టడం కోసం అప్పు తీసుకుంటే దాన్ని అప్పుగా పరిగణించలేము. కేవలం పెట్టుబడిగా మాత్రమే పరిగణిస్తాము. దాన్ని ఖర్చుగానూ చూడలేము. ఎందుకంటే పెట్టిన ఖర్చు తిరిగి వస్తుంది. విద్య, వైద్య రంగాల్లో కేరళలో చేస్తున్న కృషి వల్ల అక్కడి ప్రజల సగటు జీవన కాలం 78 సంవత్సరాలపైనే ఉంది. సగటు భారతీయుడి జీవన కాలం కంటే కేరళ ప్రజల జీవనకాలం 15 సంవత్సరాలు ఎక్కువ. కేరళలో శిశు మరణాలూ తక్కువగానే ఉన్నాయి. ఇలాంటి అవసరాలు వచ్చినప్పుడు కేంద్రం తీరు రాష్ట్రాలను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. రెవెన్యూ ఆదాయాన్ని మించి అదనంగా మూడుశాతం కన్నా ఎక్కువ అప్పు ఉండకూడదు అంటే ఆయా రాష్ట్రాలను తీవ్రంగా ఇబ్బంది పెట్టడమే అవుతుంది. అయితే బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత అప్పును 1.7 శాతానికి తగ్గించాలని చూస్తోంది. ప్రాథమిక సదుపాయాల మీద ఖర్చు చేయడాన్ని అడ్డుకుంటోంది. అదే సమయంలో కేంద్రం మాత్రం రెవెన్యూ ఆదాయం కంటే నాలుగు శాతం అదనంగా అప్పు తీసుకుంటోంది. అక్కడ మాత్రం చట్టాన్ని ఉల్లంఘిస్తూ రాష్ట్రాలపై మాత్రం కర్ర పెత్తనం చేస్తోంది. ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌గా ఉన్న ఎం.కె.సింగ్ అయితే రాష్ట్రాల అప్పు శాతాన్ని ఇంకా తగ్గించాలని చూస్తున్నారు. రాష్ట్రాల హక్కులను హరించే చర్యలకు దిగుతున్నారు. గతంలో రాష్ట్రాలు అమ్మకం పన్ను వసూలు చేసుకునేవి. అవి ఎంతైనా చేసుకునే అధికారం, హక్కు ఆయా రాష్ట్రాలకుంది. రాష్ట్రాలకు ఇది ఒక ఆదాయ వనరుగా ఉండేది. దీనిలో కేంద్రానికివ్వాల్సిన వాటా ఇచ్చేసేవారు. దానిస్థానంలో వ్యాట్ తీసుకొచ్చారు. అన్ని రాష్ట్రాల్లోనూ దీన్ని అమలు చేయాలని అనుకున్నా ఆయా రాష్ట్రాల్లో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా దాని శాతాన్ని నిర్ణయించారు. ప్రస్తుతం జిఎస్‌టి తీసుకొచ్చారు. దీనిపై చర్చ జరిగిన సమయంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు జిఎస్‌టిలో 60 శాతం రాష్ట్ర ప్రభుత్వాలకు, 40 శాతం కేంద్ర ప్రభుత్వానికి ఉండాలని సూచించాయి. ట్యాక్స్ విధించే సమయంలో రాష్ట్రాలకు వెసులుబాటు ఉండాలని కోరాయి. చిన్న పరిశ్రమలను జిఎస్‌టి నుండి మినహాయించాలని రాష్ట్ర ప్రభుత్వాల తరుపున హాజరైన ప్రతినిధులు సూచించారు. కేరళ, గతంలో త్రిపురలలో ఉన్న వామపక్ష ప్రభుత్వాలు వీటిని అమలు చేసి చూపించాయి.



వరద ముంపులో కేరళ

బిజెపి పాలిత రాష్ట్రాల్లో వీటిని 50:50 పద్ధతిలో అమలు చేస్తున్నాయి. కేంద్రం కూడా ఇదే పద్ధతి అనుసరించింది. దీనివల్ల ముంచుకొచ్చిన అతి పెద్ద ప్రమాదం ఏమిటంటే రాష్ట్రాలకు పన్నులు వేసుకునే అధికారం లేకుండా పోయింది. దీనివల్ల విపత్తుల సమయంలో ఏదైనా పరిహారం చెల్లించాలన్నా నిధులు లేని పరిస్థితి ఏర్పడింది. ఇటీవల కేరళలో వరదలు వచ్చిన సమయంలో రైతులకు మినహాయింపులు ఇవ్వాలనుకున్నా, రుణమాఫీ చేయాలనుకున్నా చేయలేని పరిస్థితిని కేంద్రం సృష్టించింది. రాష్ట్రం చేతులు కట్టేసినట్లయింది. వీటన్నిటికీ అవసరమైన డబ్బులు కావాలని, జిఎస్‌టిపై తమకు అధికారం ఇస్తే సమస్యను కొంతవరకు పరిష్కరించుకోవచ్చని చెప్పినా కేంద్రం ఇవ్వలేదు. కేంద్రం ఆంక్షలతో తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న మాకు కొంతమంది దాతలు సాయం చేసి ఆదుకున్నారు. సుమారు రూ.3000 కోట్లు విరాళాల రూపంలో వచ్చాయి. అదే సమయంలో యుఏఈ ప్రభుత్వం రూ.700 కోట్లు సాయం చేస్తానని ప్రకటించింది. దీన్ని కేంద్రం అడ్డుకుంది. మరోవైపు రూ.31 వేల కోట్ల నష్టం వాటిల్లిందని తేలింది.

**"14వ ఆర్థిక సంఘం విధానాలు కేంద్ర ఆదాయాలకు ఎలా గండికొడుతున్నాయో చర్చించాలని, కేంద్రం ఆర్థికశక్తిని ఎలా పెంచాలో చూడాలని, అప్పులు తీసుకోకుండా చేయడంపై దృష్టి పెట్టాలని నిబంధనలు విధించారు. ముఖ్యంగా సంక్షేమ పథకాల అమలును నిలిపేయడం ఎలా అనే అంశంపై చర్చించాలని నిబంధనల్లో పేర్కొన్నారు."**



కేరళలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల ఆర్థికమంత్రుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఈ నష్టాన్ని తక్షణమే పూడ్చాల్సిన అవసరం ఉందని చెప్పినా కేంద్రం కనికరించలేదు. విరాళాల పైనా ఆంక్షలు విధించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వం కూడా విరాళమిచ్చింది. జిఎస్‌టి వచ్చిన తరువాత అధికారాలన్నీ కేంద్రం చేతుల్లోకి వెళ్లిపోవడంతో ఆర్థికంగా తీవ్ర సమస్యలు వచ్చిపడ్డాయి. చిన్న పరిశ్రమలు చితికిపోయాయి. నీతి అయోగ్‌ను కేంద్రం తన చేతుల్లోకి తీసు కుంది. ఫైనాన్స్ కమిషన్లు వచ్చినా వాటిల్లో రాష్ట్రాలకు వచ్చే వాటాలపై ఆంక్షలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం ఇచ్చే గ్రాంట్లకు కోత పెట్టింది. 15వ ఫైనాన్స్ కమిషన్ పెట్టిన టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ చాలా దారుణంగా ఉన్నాయి. 14వ ఆర్థిక సంఘం విధానాలు కేంద్ర ఆదాయాలకు ఎలా గండికొడుతున్నాయో చర్చించాలని, కేంద్రం ఆర్థికశక్తిని ఎలా పెంచాలో చూడాలని, అప్పులు తీసుకోకుండా చేయడంపై దృష్టి పెట్టాలని నిబంధనలు విధించారు. ముఖ్యంగా సంక్షేమ పథకాలను అమలును నిలిపేయడం ఎలా అనే అంశంపై చర్చించాలని నిబంధనల్లో పేర్కొన్నారు. ప్రజల సంక్షేమాన్ని వదిలేసి కేంద్రం చేతిలో ఆర్థిక అధికారాలను కేంద్రీకరించటం పైనే దృష్టి పెడుతున్నది. ఫెడరల్ వ్యవస్థలో ఇది అత్యంత ప్రమాదకరమైన ధోరణి. సంక్షేమ పథకాల్లో కొన్ని రాష్ట్రాలు అనుసరించిన పద్దతుల్లో కొన్ని ప్రజలకు అనుకూలంగా ఉన్నాయి. కేరళ, తమిళనాడు ప్రవేశపెట్టిన పథకాల అనం తరం దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి హామీని అనంతరం అందరికీ అమలు చేశారు. ఇటు వంటి పథకాలన్నిటిపైనా కేంద్రం షరతులు విధిస్తోంది. దీనికి వ్యతిరేకంగా ఆర్థికమంత్రులందరూ సమావేశమై కేంద్రం తీరుపై చర్చిస్తున్నారు. తొలుత నలుగురు మంత్రులతో మొదలైన సమావేశాల్లో ప్రస్తుతం పది రాష్ట్రాలకు చెందిన మంత్రులు వచ్చి చేరారు. త్వరలో ఢిల్లీలో జరిగే సమావేశానికి ఎంతమంది మంత్రులు వచ్చి చేరతారో చూడాలి. మరోవైపు కేంద్రం ఫైనాన్స్ కమిషన్ అధికారాలను నిర్వీర్యం చేస్తోంది.

ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్‌ను నియమించే సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించలేదు. ఒకరకంగా చెప్పాలంటే రాజ్యాం గ వ్యవస్థలన్నిటినీ సర్వనాశనం చేస్తోంది. స్థానిక సంస్థల అధికారాలను తగ్గిస్తోంది. ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి నీతిఅయోగ్‌ను పెట్టారు. గతంలో ఉన్న ప్రణాళికా సంఘంలో కొంత మంది నిపుణులు కూర్చుని ఏ రాష్ట్రానికి ఎంత మొత్తం నిధులు కావాలి అనే అంశాన్ని చర్చించే వారు. దీన్ని కూడా ఆర్థికశాఖ తన చేతుల్లోకి తీసుకుంది. నీతి అయోగ్ ఏమి చేస్తుందో ఎవరికీ తెలియదు. ఏక్తా ప్రభుత్వం ఉండాలని గోల్వాల్కర్ ఏదైతే చెప్పారో బిజెపి అదే చేసుకుపోతోంది. దీన్ని ప్రతిఘటించాల్సిన అవసరం ఉంది. దీనికోసం సిపిఎం ఖచ్చితంగా పోరాటం చేస్తుంది. ఫెడరల్ సూత్రాల అమలు కోసం నిలబడుతుంది. గతంలో కొన్ని కమిటీలు వచ్చినా వాటిల్లో ఊగిసలాటల వల్ల నిలబడలేదు. కానీ సిపిఎం ఒక్కటే నికరంగా నిలబడి ఆందోళనలు చేస్తోంది. అప్పట్లో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య, అశోక్ మిత్రా రూపొందించిన పత్రాలను చూస్తే ఇదే అర్థమవుతుంది. పార్టీ భవిష్యత్‌లో కూడా ఫెడరల్ వ్యవస్థ అమలు కోసం తన వంతు కృషి చేస్తోంది. ఈ సమావేశంలో ప్రసంగించేందుకు అవకాశం ఇచ్చినందుకు కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు. నమస్కారం.

**(థామస్ ఐజాక్ (ప్రసంగానికి వ్యాసరూపం ఇచ్చినవారు వి. సురేష్)**

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

# కుల వ్యవస్థ - పాశ్చాత్య చరిత్రకారుల అధ్యయనాలు



రచయిత
ప్రజాశక్తి సంపాదకులు

ఎంవిఎస్ శర్మ

డర్ఖహోమ్, మాక్స్‌ముల్లర్, రిస్లే, సెనార్ట్, బౌగ్లీ, వెబర్ వంటి పాశ్చాత్య చరిత్రకారులు ప్రాచీన భారత దేశ చరిత్రను అధ్యయనం చేయడంలో ప్రశంసనీయమైన కృషి చేశారు. వారు వచ్చిన నిర్ధారణలు కొంతమేరకు మనకు ఉపయోగకరంగా ఉంటాయి. భారతీయ సమాజపు ప్రత్యేక లక్షణం కులం. కనుక వీరంతా దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. కులాన్ని అధ్యయనం చెయ్యాలంటే మతం, జాతి దానిలోని కీలక భాగాలు గనుక వాటినీ అధ్యయనం చెయ్యాలి. (RACE) అనే పదం, సంస్కృతంలో వాడిన వంశం, కులం, జాతి, గోత్రం, జన, వర్ణం అనేపదాలతో సమానార్థం కలిగి వున్నట్టు కొందరు అనువాదకులు భావించారు. ఈ దేశంలో ఆ పదాలకున్న ప్రత్యేక అర్థాలు వేరు. ఇవేవీ RACEకి సమానార్థం కలిగిలేవు. కుల వ్యవస్థను ప్రధానంగా వివిధ జాతుల మధ్య విభజనగా ముందు పరిగణించారు. ఆ విభజనను పరిరక్షించడానికి వేర్వేరు కులాల మధ్య వివాహాలను నిషేధించినట్లు చెప్పారు.

సంస్కృతంలో కులం అనేదానిని ఎక్కువ సందర్భాలలో వర్ణం లేదా జాతి అన్న పదాలతో ప్రస్తావించారు. జాతి అనేది పుట్టుకకు సంబంధించిన పదం. వర్ణం అనేది నాలుగు తరహాలను (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర) వివరించడానికి ఉపయోగించారు. వర్ణం అనేదానిని కొందరు పరిశోధకులు శరీరపు చర్మం రంగుగా వివరించ పూనుకున్నారు.

రుగ్వేదంలో ఆర్యవర్ణం, దాసవర్ణం, అన్న రెండు ప్రస్తావనలు ఉన్నాయి. దాసులు పొట్టిగా, నల్లగా ఉంటారని వర్ణించారు. ఆర్యుల గురించి వర్ణన స్పష్టంగా లేదు.

మాక్స్‌ముల్లర్ ఆర్ఎసిఇ అనేది ఒక్కటే కులవ్యవస్థను రూపొందించడానికి ప్రాతిపదికగా సరిపోదని అన్నాడు. (1) ఆధిపత్యం సాధించడం, రాజ్య అధికారం ఏర్పడడం, (2) వృత్తి జీవిక (Conquest and political formation, professional and occupational groups) అనే రెండు అదనపు ప్రాతిపదికలను ఆయన ప్రతిపాదించాడు. ఆల్ఫ్రెడ్ లైయాల్ అదనంగా మతంలో ఏర్పడ్డ శాఖలు కూడా కులాలుగా రూపొందడానికి తోడయ్యాయని భావించాడు. తెగలు ఒక్కొక్కటిగా కులాలుగా మార్పు చెందాయని నెస్‌ఫీల్డ్ భావించాడు. లోహ యుగానికి ముందు నుండే కొనసాగుతున్న వృత్తుల వారు వారి కంటే పెద్ద కులాలుగా పరిగణించబడ్డారని ఆయన అన్నారు.

– రిస్లే వాదన ప్రకారం ఆర్యులు, దాసుల మధ్య సంపర్కం వల్ల పుట్టిన వారంతా తక్కువ కులాల వారిగా పరిగణింపబడ్డారు. నిజానికి ఇతను చెప్పింది బ్రాహ్మణవాదులు ధర్మశాస్త్రాలు చెప్పినవే. తమ పవిత్రత కలుషితం కాకుండా నిలుపుకున్న ఆర్యులు అగ్రవర్ణాలుగాను. స్థానిక తెగల ప్రజలు తక్కువ కులాలుగాను వర్గీకరించబడ్డారని రిస్లే ప్రతిపాదించారు.

అయితే ఈ 'ఆర్య జాతి – స్థానిక తెగలు' విభజన ప్రాతిపదికను, వృత్తి ఆధారంగానే కుల విభజన జరిగిందన్న వాదనను సెనార్ట్ అంగీకరించలేదు. ఒకే వృత్తిలో ఉన్న వారి మధ్య (ఉదాహరణకి–వ్యవసాయం) సైతం కులాల విభజన జరగడం బట్టి సెనార్ట్ తన వాదనను రూపొందించాడు. కుటుంబం ప్రాతిపదికను కూడా పరిగణించాలని వాదించాడు. గ్రీక్, రోమన్ ప్రజలను సైతం 'ఇతరులను', పరాయి ప్రాంతాల వారిని తమ కుటుంబాలలో కలవనీయకుండా నిషేధాలు అమలు జరిగిన వైనాన్ని ఈయన ప్రస్తావించారు. అనేక కారణాలు కుల వ్యవస్థ ఏర్పాటుకు దారితీసి ఉండాలని భావించాడు.

తొలిదశలో ఆర్యులకు, స్థానికులకు నడుమ జరిగిన ఘర్షణ వలన ఆర్యులు తమను తాము ఒక ప్రత్యేకమైన సమూహంగా భావించి స్థానికులతో కలిసి పోకుండా విడిగా వ్యవహరించి ఉండాలి. అయితే కాలక్రమంలో ఆర్యులు, స్థానికులు కలిసిపోయారు. ఆయా సగోత్రీక కుటుంబాలు ఒక్కోకులంగా రూపొందడంతో బాటు చేసిన వృత్తులు బట్టి కూడా కులాలు ఏర్పడి ఉండాలి. మతపరమైన క్రతువుల నిర్వహణ విస్తృతమవుతూ దానితో పాటు కుల విభజన వ్యవస్థీకరించబడి ఉండాలి. 'సంకరం' జరగకూడదన్న నిబంధనలు కుల విభజన కొనసాగడానికి, అగ్రవర్ణాలు 'శారీరక శ్రమ'కు దూరంగా వుండి పెత్తనం కొనసాగించ డానికి తోడ్పడ్డాయి. ఈ కుల విభజనను చెరిపి వేసి అందరిని ఐక్యం చేయగల రాజకీయ శక్తులు రూపొందలేదు. దాని ఫలితంగా ఈ విభజన రానురానూ బలపడుతూ, విస్తరిస్తూ వచ్చింది –ఇది సెనార్ట్ వాదన. "కులాల హద్దుల్ని చెరిపివేయగల రాజకీయ శక్తి ఏర్పడలేదు". అంటే అర్థం ఏమిటి? గ్రామం ఒక పాలనాపరమైన యూనిట్‌గా ఉండటం. ఏ గ్రామానికి ఆ గ్రామం కొన్ని కులాలతో, ఆచారాలతోఉంటూ ఆ గ్రామ దైనందిన వ్యవహారాలలో వెలుపల నుంచి పాలనాపరమైన జోక్యం లేకపోవడమే. (ఇటువంటి గ్రామీణ వ్యవస్థను మాక్స్‌ముల్లర్ ఒక గొప్ప ఆదర్శవంతమైన వ్యవస్థగా వర్ణిస్తే మార్క్స్ దానికి భిన్నంగా ఇటువంటి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వలనే భారతదేశం పురోగతి స్తంభించి పోయిందని విమర్శించాడు).

మత క్రతువుల నిర్వహణలో అనుసరించిన విధి విధానాలు కూడా కుల వ్యవస్థ రూపొందే క్రమంపై ప్రభావాన్ని చూపాయి అని బౌగ్లీ భావించాడు. యజ్ఞంలో 'బలి' అనే తంతును నిర్వహించే వ్యక్తి పవిత్రుడిగా పరిగణించబడతాడు. మానవుల ప్రపంచం నుండి దేవతల ప్రపంచంలో అతడు అడుగు పెట్టినట్టు లెక్క. అటువంటి 'పవిత్ర వ్యక్తి' ఇతరుల నుండి 'దానం'గా ఏదైనా స్వీకరించడం అంటే దానం ఇచ్చిన వ్యక్తి దేవతలకు కానుక ఇచ్చినట్టు లెక్క. దేవతలు ఆ కానుకతో సంతృప్తి చెంది 'దాత' కోరికను

> **"బ్రాహ్మణుల ఆధిపత్యం మొదట్లో అంతగా లేదని, బ్రాహ్మణులకు, క్షత్రియులకు నడుమ ఆధిపత్య పోరు సాగిందని, అయితే బ్రాహ్మణులకు చేజిక్కిన మతాధిపత్యం నిరాటంకంగా కొనసాగడం, క్షత్రియులకు చేజిక్కిన రాజకీయ ఆధిపత్యం నిరంతరం సవాళ్లను ఎదుర్కొవ డమూ జరిగినందున క్రమంగా కులవ్యవస్థలో బ్రాహ్మణులది పైచేయి అయిందని బౌగ్లీ సూచించారు."**

నెరవేర్చుతారు. –ఈ మత విశ్వాసం 'పవిత్రమైన' బ్రాహ్మణ కులం ఏర్పడటానికి, సమాజ ఆమోదం పొందడానికి దోహదం చేసింది.

సహజంగానే దానం ఇవ్వగలిగిన సంపద కలిగి ఉండేవారు కొద్ది మందే ఉంటారు. యజ్ఞం వంటి 'పవిత్ర' కార్యంలో అలాంటి వారికి ప్రవేశం ఉండాలి. దానం ఇచ్చే స్తోమత లేని వారంతా ఈ తంతుకి దూరంగా ఉండాలి. అందుకే బ్రాహ్మణులు నిర్వహించే యజ్ఞంలో క్షత్రియులకు ప్రవేశార్హత ఉంది. తక్కువ వారంతా దూరంగానే ఉంచబడతారు. ఈ వాదన బట్టి ' కులం' కేవలం పని విభజనను బట్టి మాత్రమే కాక, మత ఆచారాలను బట్టి కూడా ఏర్పడిందని భావించాలి. ఆ మతాచారాలకు సమాజంలో ఆమోదం లభించి ఉండాలి. లేకపోతే అది మనగలిగే అవకాశాలు ఉండవు కదా. అయితే బ్రాహ్మణులే ఈ కులవ్యవస్థకు మూలకర్తలు అన్న అభిప్రాయాన్ని బౌగ్లీ అంగీకరించలేదు. మత విశ్వాసం ఒక్కటే సమాజాన్ని శాసించలేదని అతడు అన్నాడు. అలాగే 'వృత్తిని బట్టి కులాలు' అన్న సూత్రం కూడా సరైనది కాదని అతను భావించాడు. ఒకే వృత్తిని వేర్వేరు కులాల వారు చేయడం, ఒకే కులం వారు అనేక వృత్తులు చేయడం జరుగుతోందని, అందువలన కులం, వృత్తి ఒకటేనని సూత్రీకరించలేమని బౌగ్లీ చెప్పాడు.

సెనార్ట్ కులానికి మూలం 'వర్ణం'లో వెతికితే, బౌగ్లీ కులానికి మూలాన్ని 'జాతి'లో వెతికే ప్రయత్నం చేశాడు. కొన్ని కుటుంబాలు (రక్తసంబంధీకుల గుంపులు) కలిసి ఉండటం, వారిలో వారికి మాత్రమే వివాహాలు జరగాలన్న నియమాన్ని పాటించడం పరిపాటి. ఈ క్రమమే కులంగా దేనికది గట్టిపడిందని అతను వాదించాడు. ఈ పద్ధతి ఆదిమ తెగలలో సైతం ఉంది. కనుక 'కులం' రూపొందడం అనేది ఆర్యుల రాకతోనే మొదలైందని సూత్రీకరించడం అనవసరం. స్థానిక తెగల్లో సైతం వుండిన



మాక్స్ ముల్లర్

వివాహ కట్టుబాట్లు కులం ఏర్పడడానికి మూలంగా ఉన్నాయని బౌగ్లీ భావించాడు.

బ్రాహ్మణుల ఆధిపత్యం మొదట్లో అంతగా లేదని, బ్రాహ్మణులకు, క్షత్రియులకు నడుమ ఆధిపత్య పోరు సాగిందని, అయితే బ్రాహ్మణులకు చేజిక్కిన మతాధిపత్యం నిరాటంకంగా కొనసాగడం, క్షత్రియులకు చేజిక్కిన రాజకీయ ఆధిపత్యం నిరంతరం సవాళ్లను ఎదుర్కొవడమూ జరిగినందున క్రమంగా కులవ్యవస్థలో బ్రాహ్మణులది పైచేయి అయిందని బౌగ్లీ సూచించారు. వివాహ కట్టుబాట్లను జాగ్రత్తగా నిలబెట్టుకొని తద్వారా తాము ఆర్యుల వారసులమని బ్రాహ్మణులు చెప్పుకోగలిగారు. రాజకీయ అధికారం నిలుపు కొనే క్రమంలో క్షత్రియులు అనేక 'రాజీలు' చేసుకోవాల్సి వచ్చింది. అందువలన వారి వివాహ కట్టుబాట్లు బ్రాహ్మణుల మాదిరి కట్టుదిట్టంగా నిలబడ లేదు. అయితే బ్రాహ్మణులు, ఆర్యులు ఒకటేననుకుంటే పొరపాటు. స్థానిక జాతుల నుండి కూడా మత క్రతువులు నిర్వహించే వారి నుండి బ్రాహ్మణుల కులంలో భాగం అయిన వారు ఉన్నారు.

అందువలన మత సంబంధ క్రతువులు, రక్త సంబంధీకుల మధ్య వివాహం కట్టుబాట్లు అన్నీ కలగలిసి కులవ్యవస్థ రూపకల్పనకు తోడ్పడ్డాయని బౌగ్లీ చెప్పాడు. కులం అనే భావన హిందువులకో, ఆర్యులకో మాత్రమే పరిమితమైనది కాదని, ఆదిమ తెగల కట్టుబాట్లలో సామాజిక ఆచరణలో కులం రూపొందడానికి ప్రాతిపదిక ఉందని బౌగ్లీ వివరించాడు.

అనేక కులాలకు చెందిన వారైనా, వారంతా ఒకే మతం క్రిందకు వస్తారన్నది వాస్తవం. కానీ ఆ మతం ఈ కులవిభజనను బలహీనపరచలేకపోయింది. పైగా ఆయా కులాల ప్రత్యేకతలను తన మతాచారాల్లో ఒక భాగంగా ఇముడ్చుకుంది. బౌద్ధం ఇందుకు మినహాయింపు. బహుశా కులాన్ని ఏ మాత్ర మూ పరిగణనలోకి తీసుకోకుండా దానిని తిరస్కరించినందువల్లనే బౌద్ధం భారతదేశంలో తొందరగా కనుమరుగైందేమో. ఇది బౌగ్లీ అభిప్రాయం.

ప్రాచీన భారతంలో న్యాయం ధర్మ శాస్త్రాల మీద ఆధారపడి నడిచింది. ఈ ధర్మ శాస్త్రాలను రాజకీయ అధికారం చేపట్టినవారెవరైనప్పటికీ, గౌరవిస్తూ వచ్చారే తప్ప సవాలు చేయలేదు. ఈ ధర్మ శాస్త్రాలు 'అందరికీ సమ న్యాయం' అనే సూత్రాన్ని ఏ మాత్రమూ పాటించలేదు సరికదా తీవ్రమైన వివక్షను, అణచివేతను, క్రూరమైన శిక్షలను ప్రతిపాదించాయి. కుల వ్యవస్థలోని దొంతరలను సమర్థించాయి. నేరస్తుడి కులం ఎంత తక్కువ స్థాయిలో ఉంటే శిక్ష అంత తీవ్ర స్థాయిలో ఉండేలా నిర్దేశించాయి.

ఇంకోపక్క ఏదైనా వృత్తికి సంబంధించిన నైపుణ్యం వంశపారపర్యంగా ఆ కులానికే పరిమితం అయింది. దానికి తోడు ఆయా కులాల కూటమి గ్రామ ఆర్థిక వ్యవస్థతో పెనవేసుకుపోయింది. దీని వలన పెద్ద స్థాయిలో చేతి వృత్తులు అభివృద్ధి చెందడానికి గానీ, భారీ వ్యాపారానికి తగినంత స్థాయిలో ఉత్పత్తి చేసే సామర్థ్యం పెరగడానికి గానీ వీలులేకుండా పోయింది. వృత్తుల పెద్దలు కులం హద్దుల్ని దాటి ఇతరులను తమతో కలుపుకునే సాహసం చేయలేకపోయారు. అందువలన ఆర్థికాభివృద్ధి వేగంగా సాగడానికి ఆటంకంగా కులవ్యవస్థ తయారైంది.

వెబర్ సూత్రీకరణల ప్రకారం కులవ్యవస్థ విస్తరణ మూడు సాధనాల ద్వారా జరిగింది. మొదటిది : ఒక సమూహం ఇంకొక సమూహాన్ని ఓడించి లంగదీసుకోవడం. గెలిచిన సమూహానికి భూమిపై హక్కులు సంక్రమించేవి. ఓడిన సమూహం తన హక్కులు పోగొట్టుకుని లంగి ఉండేది. హక్కులు కలిగిన వారు పెద్ద కులంగానూ, పోగొట్టుకున్న వారు చిన్న కులంగానూ ఉండేవారు. (అయితే ఓడిన సమూహంలోని

వారందరినీ ఒకే కులంగా పరిగణించడం జరిగేది కాదు. అందులో కొందరినీ వేర్వేరు పెద్ద కులాల్లో కలుపుకునే సందర్భాలు కూడా ఉండేవి. ఈ అంశాన్ని వెబర్ విస్మరించాడు- రొమిల్లా థాపర్). రెండవది : తెగలు కులాలుగా రూపాంతరం చెందడం. వ్యవసాయ సమాజం విస్తరిస్తున్న కొద్దీ ఆయా తెగలు ఈ నూతన సమాజంలో కలిసిపోతూ ఉండేవి. అయితే ఈ కలిసిపోవడం ఒకే తీరుగా జరగలేదు. తెగల్లో నాయకత్వ స్థానాల్లో వున్న కుటుంబాలు నూతన వ్యవసాయ సమాజంలో క్షత్రియులు వంటి పెద్ద కులపు హోదాను పొందగలిగేవి. ఇంకా భూమిపై హక్కును సుస్థిర పరచుకోని సంచార తెగలు, ఆహార సేకరణకే పరిమితమైన తెగలు తక్కువ స్థాయి కులాల్లోకి చేరేవి. ఎక్కువగా వీరు రైతు కులాల్లో చేరేవారు. ఈ కులాల నుండి తిరిగి విడిపడి ఉప కులాలు చాలా ఏర్పడ్డాయి. వేరే ప్రాంతానికి వలస పోయినా, కొత్త పద్ధతుల్లో పూజలు, వ్రతాలు వంటివి చేపట్టినా, మతంలో కొత్త శాఖలు పుట్టుకొచ్చినా కొత్త ఉపకులాలు ఏర్పడ్డాయి. ఆర్థికంగా పై స్థాయిలో ఉన్నవారు పెద్ద కులాల్లోకి చేరగలిగితే, దిగువ స్థాయిలోని వారు చిన్న కులాల్లోకి నెట్టబడ్డారు. వైవాహిక సంబంధాలను నిరాకరించడం, సహపంక్తి భోజనాలకు రానివ్వకపోవడం వంటి చర్యలు కొత్తకులాల ఏర్పాటుకు దారితీశాయి.

భూమిపై హక్కు సంపాదించడం గణాలు, తెగలలో విభజనకు దారితీసి వేర్వేరు కులాల ఏర్పాటుకు దోహదం చేసిందని పలు ఆధారాలున్నా, వెబర్ వాటిని పట్టించుకోకుండా కులవ్యవస్థ ఏర్పాటు ప్రధానంగా రక్తసంబంధం, వైవాహిక సంబంధం, తెగ -ఈ మూడింటి ప్రాతిపదికన జరిగిందని ప్రతిపాదించాడు. మత క్రతువులను వంశపారంపర్యంగా నిర్వహించే హక్కు, మాన్యాలను అనుభవించే హక్కు పై మూడింటికి తోడైందని భావించాడు. కులవ్యవస్థ మనుష్యుల మధ్య దూరాన్ని పెంచిందే తప్ప వారి మధ్య సమన్వయాన్ని సాధించలేకపోయిందని వెబర్ చేసిన వ్యాఖ్య ముఖ్యమైనది.

ఇంతటి అసమానతలను, అణచివేతను తెచ్చిపెట్టిన కులవ్యవస్థ పట్ల వ్యతిరేకత ఎందుకు తగినంతగా పెరగలేదు? ఆత్మకి చావు లేదని, పునర్జన్మ ఉంటుందని, ఈ లోకం మిధ్య అని, క్షణ భంగురం అని చెప్పినా తాత్విక సిద్ధాంతాల ప్రభావం ప్రజలను ఒకే విధమైన నిర్లిప్తతలోకి, ఉదాసీనతలోకి నెట్టిందని, ఫలితంగా భారత దేశంలో సామాజిక మార్పులు అవసరమైనంత వేగంగా సంభవించలేదని వెబర్ వ్యాఖ్యానించాడు. వ్యక్తి యొక్క ముక్తి గురించిన ఆలోచనే ప్రధానమైపోయిందని అన్నారు.

"భూమిపై హక్కు సంపాదించడం గణాలు, తెగలలో విభజనకు దారితీసి వేర్వేరు కులాల ఏర్పాటుకు దోహదం చేసిందని పలు ఆధారాలున్నా, వెబర్ వాటిని పట్టించుకోకుండా కులవ్యవస్థ ఏర్పాటు ప్రధానంగా రక్తసంబంధం, వైవాహిక సంబంధం, తెగ -ఈ మూడింటి ప్రాతిపదికన జరిగిందని ప్రతిపాదించాడు. మత క్రతువులను వంశపారం పర్యంగా నిర్వహించే హక్కు మాన్యాలను అనుభవించే హక్కుపై మూడింటికి తోడైందని భావించాడు."



కులవృత్తిలో నిమగ్నమై కుండలు చేస్తున్న కుమ్మరి వృత్తిదారులు

హిందూమతానికి ప్రత్యామ్నాయంగా వచ్చిన బౌద్ధం సైతం కోర్కెలను జయించి సర్వ సంగ పరిత్యాగులుగా ఉండాలని, 'నిర్వాణం' పై దృష్టి సారించాలని ప్రబోధించడంతో కుల వ్యవస్థను బద్దలు కొట్టగలిగే శక్తిని సంతరించుకోలేకపోయిందని వెబర్ వ్యాఖ్యానించాడు.

బౌగ్లీ, వెబర్, సెనార్ట్ తదితర చరిత్ర కారుల అభిప్రాయాలు, వారి అధ్యయనం ముఖ్యమైనవి. అదే సమయంలో వారి అధ్యయనానికి కొన్ని పరిమితులు ఉన్నాయి.

1. వారు ప్రధానంగా ప్రాచీన గ్రంథాలు, తాళపత్రాలు అధ్యయనం చేశారు. ఇవే వారికి దొరికిన ఆధారాలు. ఇవి బ్రాహ్మణుల చేత రచించబడినవి. కనుక ఎన్నో వివరాలు అందించగలిగినప్పటికీ పాక్షిక దృష్టితోటి రూపొందించినవి.

2. వేదకాలం నుండి దాదాపు పన్నెండో శతాబ్దం వరకు భారతీయ సమాజంలో పునాది స్థాయిలో (గ్రామీణ స్థాయిలో)ఎటువంటి మార్పులు చోటుచేసుకోలేదన్న కోణంనుండే వారు తమ అధ్యయనాన్ని సాగించారు. ఇదివాస్తవం కాదు.

3.హిందూ, బౌద్ధం, జైన మతాల ప్రభావాన్ని అధ్యయనం చేసినపుడు ఆయా మతాలలో చోటు చేసుకున్న మార్పులను, వాటి ప్రభావాన్ని వీరు పరిగణనలోకి తీసుకోలేదు. హిందూ మతంలో భక్తి ఉద్యమం నిర్వహించిన పాత్రగాని బౌద్ధంలో తొలినాటి సర్వసంగపరిత్యాగం నుండి మలిదశలో రాజుల ప్రోద్బలంతో పెద్దమొత్తంలో ఆస్తులను కూడబెట్టుకున్న నాటివరకు జరిగిన మార్పులు కాని వారు ప్రాధాన్యతనిచ్చి పరిశీలించలేదు.

4. యూరప్‌లో ఏర్పడిన "హేతుబద్ధమైన" (?) పెట్టుబడిదారీ వ్యవస్థ వంటిది భారతదేశంలో ఎందుకు ఏర్పడలేదు? అన్న కోణం నుండి అధ్యయనం చేశారే తప్ప భారతదేశంలో సంభవించిన మార్పులను మొత్తం ఒక సమగ్ర దృష్టితో చూడలేదు.

5. వారంతా అధ్యయనం చేసినది ఒక శతాబ్దం క్రితం. అనంతర కాలంలో చరిత్ర పరిశోధకులు కొత్తగా ఎన్నో వాస్తవాలు వెలుగులోకి తెచ్చారు. ముఖ్యంగా ద్రవిడ, దక్షిణ ప్రాంతంలోనూ, ఈశాన్యంలోనూ వెలుగులోకి వస్తున్న అంశాలు చాలా ఉన్నాయి. ఏదిఏమైనా కులవ్యవస్థ రూపొంది విస్తరించడానికి ఒకటి గాక పలు కారణాలు ఉన్నాయని, పలు దశలలో ఈ వ్యవస్థ విస్తరణ జరిగిందని వారి అధ్యయనం మనకు తెలుపుతోంది. ❋

పర్యావరణం

# అడుగు ముందుకు పడకుండానే రెండడుగులు వెనక్కి


రచయిత
మార్క్సిస్టు పత్రిక సంపాదకులు

**ఎస్ వెంకట్రావు**

పోలెండ్ బొగ్గు రాజధానిగా పేరు గాంచిన కటొవైస్ నగరంలో ఈ నెల 2 నుండి 15 వరకు జరిగిన ఐక్యరాజ్య సమితి వాతావరణ చర్చలు ఒక్క అడుగు కూడా ముందుకు పడకముందే రెండడుగులు వెనక్కు వేసిన చందంగా ముగిసాయి. 2015లో ప్రపంచ దేశాల మధ్య కుదిరిన పారిస్ ఒప్పందం నియమ నిబంధనలను రూపొందించడం కటొవైస్ వాతావరణ చర్చల ముఖ్య ఉద్దేశం. ప్రపంచంలో అత్యధిక కాలుష్యానికి కారణమవుతున్న అమెరికా.. పారిస్ ఒప్పందం నుండి వైదొలగుతున్నట్లు ప్రకటించిన తరువాత ఇంక వాతావరణ చర్చలకు, నియమనిబంధనల రూపకల్పనకూ అర్థం లేదని పలువురు విమర్శకులు పేర్కొంటుండగా అసలు లేనిదాని కన్నా ఏదో ఒక అంగీకారం కుదరడం మేలు కదా అని మరి కొందరు పేర్కొంటున్నారు. మరోవైపు పోలెండ్‌లో 23,000 మంది ప్రతినిధులు పాల్గొంటున్న కటొవైస్ సమావేశాల ప్రారంభానికి కొద్ది రోజుల ముందు విడుదలైన 'ప్రపంచ కార్బన్ ప్రాజెక్ట్' నివేదిక.. కార్బన్ ఉద్గారాల నుండి భూగోళానికి ప్రమాదం త్వరగానూ, తీవ్రంగానూ రాబోతోందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో పారిస్ ఒప్పందం నియమ నిబంధనల రూపకల్పనలో కటొవైస్ సమావేశాలు సాధించిన మంచి చెడు గురించి పరిశీలించడం అవసరం.

**పారిస్ ఒప్పందం**

మానవ కార్యకలాపాల మూలంగా వాతావరణంలోకి వెలువడుతున్న గ్రీన్ హౌస్ ఉద్గారాల వల్ల భూగోళం ప్రమాదకరంగా వేడెక్కకుండా చూడడం పారిస్ వాతావరణ ఒప్పందం ప్రధాన లక్ష్యం. నాలుగు శతాబ్దాల క్రితం ప్రారంభమైన పారిశ్రామిక విప్లవం వల్ల వాతావరణంలోకి విడుదలవుతున్న ఉద్గారాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. పరిశ్రమలు, మోటారు వాహనాల్లో ఇంధనాలు మండించడం, ఇతర కార్యకలాపాల వల్ల వాతావరణంలో నీటి ఆవిరి, కార్బన్ డై-ఆక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్‌లు క్రమంగా పెరిగిపోతున్నాయి. సూర్యుని నుండి వచ్చే వేడిని తిరిగి బయటకు పంపకుండా ఈ వాయువులు వాతావరణంలోనే పట్టి ఉంచుతాయి. దాని వల్ల భూగోళం క్రమంగా వేడెక్కుతోంది. పారిశ్రామిక విప్లవం నాటికి భూగోళం సగటు ఉష్ణోగ్రత 15 డిగ్రీల సెల్సియస్. ఈ సగటు ఉష్ణోగ్రత మరో రెండు డిగ్రీలకు మించి పెరగకుండా చూసుకోవడం పారిస్ ఒప్పందంలోని ప్రధాన అంశం. ప్రస్తుతం అన్ని దేశాలూ తమ తమ దేశాల్లో పరిశ్రమలు, వాహనాలు ఇతర కార్యకలాపాల ద్వారా వెలువడే ఉద్గారాలను తగ్గించడం ద్వారా భూగోళం సగటు ఉష్ణోగ్రత పెరుగుదల 2 డిగ్రీలకు మించకుండా చూడాలని, దీర్ఘకాలంలో దీన్ని 1.5 శాతానికి తగ్గించాలనీ పారిస్ ఒప్పందం నిర్దేశిస్తోంది. ఇది జరగాలంటే ఏ దేశం ఉద్గారాల్లో ఎంత కోత విధించాలో 2015 పారిస్ ఒప్పందం నిర్దేశించింది. ఈ ఒప్పందాన్ని 2020 నుండి అమలు చేయడం ప్రారంభించాలి. 2015 డిసెంబర్ 12న 196 దేశాలు అంగీకరించిన ఈ ఒప్పందంపై ఇంతవరకు 195 దేశాలు సంతకాలు చేశాయి.

పారిస్ ఒప్పందం ప్రకారం ప్రతి దేశం భూ తాపాన్ని తగ్గించేందుకు తను ఎంతమేరకు ఉద్గారాల్లో కోత విధిస్తుందో, దాన్ని ఎలా అమలు చేస్తుందో నిర్ణయించి ఒక ప్రణాళిక తయారు చేయాలి. దీన్ని జాతీయంగా నిర్ధారించిన కోటా (నేషనల్లీ డిటర్మయిన్డ్ కంట్రిబ్యూషన్) అంటున్నారు. అయితే ఆయా దేశాలు తప్పనిసరిగా నిర్దిష్ట కోటా ప్రకటించాలని గానీ, నిర్దిష్ట తేదీలోగా దాన్ని పూర్తి చేయాలని గానీ నిబంధన ఏమీ లేదు. కానీ ప్రతి దేశం ప్రకటించే లక్ష్యం గతంలో తను ప్రకటించిన లక్ష్యం కన్నా మించి ఉండాలి. ప్రతి అయిదేళ్లకు ఈ లక్ష్యం పెరుగుతూ ఉండాలి. గత నెల పోలెండ్‌లోని కటొవైస్‌లో జరిగిన సమావేశం ఆ ఒప్పందం అమలు కోసం నియమ నిబంధన లను రూపొందించింది. అమెరికా ఈ ఒప్పందం నుండి వైదొలగుతున్నట్లు ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2017 జూన్‌లో ప్రకటించారు. అయినప్పటికీ ఒప్పందం అమలులోకి వచ్చే 2020 వరకు అమెరికా సభ్య దేశంగా ఉంటుంది. గనుక కటొవైస్ సమావేశంలో అమెరికా కూడా పాల్గొని తన అభిప్రాయాలు చెప్పడమే కాకుండా నియమ నిబంధనలల్లో అనేక మార్పులు చేసి ఒప్పందం స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా వ్యవహరించింది.

పారిస్ ఒప్పందంలోని అంశాలు అమల్లోకి రాకముందే కొన్ని దేశాలు తమ తమ లక్ష్యాలను ప్రకటించాయి. కొన్ని దేశాలు భూతాపం కలిగించే ఉద్గారాలను తగ్గించేందుకు కొన్ని నిర్దిష్ట చర్యలు కూడా ప్రకటించాయి. ఉదాహరణకు పారిస్ ఒప్పందంలో భాగంగా ఫ్రాన్స్‌లో 2040 నుండి డీజిల్, పెట్రోల్ కార్లను నిషేధిస్తున్నట్లు ఫ్రెంచ్ వాతావరణ శాఖ మంత్రి నికోలస్ హులాట్ ప్రకటించారు. 2022 తరువాత తమ దేశం విద్యుత్ ఉత్పత్తి కోసం బొగ్గు ఉపయోగించబోదని, ఇంధన సామర్థ్యం పెంచడం కోసం 400 కోట్ల యూరోలు (సుమారు రూ 32,000 కోట్లు) కేటాయిస్తున్నట్లు కూడా ఆయన ప్రకటించారు. 2025 నాటికి నార్వే, 2030 నాటికి నెదర్లాండ్స్ పెట్రోల్, డీజిల్ కార్లను నిషేధిస్తున్నట్లు ప్రకటించాయి. వాతావరణ మార్పులను నివారించడానికి చేయాల్సిన దానితో పోలిస్తే ఈ చర్యలు నామమాత్రమే.

**భూ గోళాన్ని ఏమాత్రం రక్షించదు**

కటొవైస్ వాతావరణ సమావేశంలో కుదిరిన అంగీకారాన్ని పరిశీలిస్తే పారిస్ ఒప్పందం నుండి వెనక్కుపోయే అనేక నియమ నిబంధనలను రూపొందిచారు. మొదటిది, ఈ

నియమ నిబంధనలన్నిటినీ ఖచ్చితంగా అందరూ అమలు పరిస్తే కూడా భూ గోళం సగటు ఉష్ణోగ్రత 2050 నాటికి 3 డిగ్రీల వరకు పెరుగుతుందని ఐక్యరాజ్య సమితి వాతావరణ కార్యక్రమం (యునెప్) తెలిపింది. అంటే భూతాపం 1.5 డిగ్రీల కన్నా పెరగకుండా ఉంటే సురక్షితమనీ, 2 డిగ్రీలకన్నా పెరిగితే ప్రమాదమనీ ఐక్యరాజ్య సమితి సదస్సు (యుఎన్ఎఫ్‌సిసిసి) ఏదైతే చెప్పిందో దానికన్నా చాలా ఎక్కువగానే పెరుగుతుందన్న మాట. ప్రమాదకర స్థాయికన్నా ఒక డిగ్రీ సెంటీగ్రేడు, సురక్షిత స్థాయికన్నా రెట్టింపు పెరగడమంటే భూగోళం అనేక ఉపద్రవాలను ఎదుర్కోవడానికి సిద్ధపడాలి. గత 400 ఏళ్లుగా వాతావరణంలోకి విడుదలైన ఉద్గారాల వల్ల అది ఇంకెంత మాత్రం అదనపు ఉద్గారాలు భరించే స్థితిలో లేదు. అయినా పారిశ్రామికాభివృద్ధి పేరుతో వివిధ దేశాలు నిత్యం శిలాజ ఇంధనాలను మండిస్తూ, కోట్ల టన్నుల ఉద్గారాలను వాతావరణంలోకి విడుదల చేస్తూనే ఉన్నాయి. ప్రపంచ స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో ప్రతి ఒక్క శాతం పెరుగుదలకు వాతావరణంలో 0.733 శాతం ఉద్గారాలు పెరుగుతున్నాయి.

**"అయితే మనం వెంటనే ప్రారంభించి ప్రతిఏటా 2.4 శాతం కర్బన ఉద్గారాలు తగ్గించుకుంటూ పోతే మరో లక్షకోట్ల టన్నుల ఉద్గారాలు లేదా 2 డిగ్రీల సగటు ఉష్ణోగ్రతలు పెరగకుండా ఆపగలం. ఒకవేళ ఆపలేక ఇలాగే కర్బన ఉద్గారాలు వదులుకుంటూ పోతే ఈ శతాబ్దం చివరికి భూమి సగటు ఉష్ణోగ్రత పెరుగుదల 4 డిగ్రీల సెల్సియస్‌కు చేరుతుంది. అప్పుడు భూమి ఉంటుంది కానీ, దాని మీద మనుషులు మాత్రం అంతరించిపోయే జీవుల జాబితాలో చేరుతారు అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు."**




కటోవైస్‌లో జరిగిన పర్యావరణ పరిరక్షణ సభ

### మానవాభివృద్ధి వేరు
### పెట్టుబడిదారీ అభివృద్ధి వేరు

పారిశ్రామిక విప్లవం ముందు వరకు నేడు మనం చెప్పుకుంటున్న వాతావరణ సమస్య లేదు. పెట్టుబడిదారీ పారిశ్రామిక విప్లవం బొగ్గు వినియోగంతో వచ్చింది. తరువాత చమురు, గ్యాసు వినియోగం పారిశ్రామిక ప్రగతికి ఇంధనాలుగా మారాయి. ప్రపంచ బొగ్గు వినియోగం 1700 సంవత్సరంలో 27 లక్షల టన్నులుండేది 20వ శతాబ్దం ప్రారంభానికి 25 కోట్ల టన్నులకు పెరిగింది. ఇంకో శతాబ్ద కాలంలో ఇది 30 రెట్లకు పైగా పెరిగి 2014 నాటికి 800 కోట్ల టన్నులకు చేరుకుంది.

పెట్రోలియం ఉత్పత్తులతో నడిచే మోటారు వాహనాల సంఖ్య కూడా ఈ కాలంలో పెద్ద ఎత్తున పెరిగింది. 2010 నాటికి ప్రపంచంలో 100 కోట్లకు పైగా వాహనాలు వాడకంలో ఉన్నాయి. సగటున ప్రతి వెయ్యిమంది జనాభాకు 148 వాహనాలున్నాయి. కార్లలో 24 శాతం అమెరికాలోనే ఉన్నాయి. అమెరికాలో ప్రతి వెయ్యిమందికి 769 వాహనాలున్నాయి. ఒక్క 2011లోనే ప్రపంచ వ్యాప్తంగా 8 కోట్ల వాహనాలు ఉత్పత్తి అయినాయి.

వ్యక్తిగత వాహనాల ద్వారా ఒక్క అమెరికాలోనే 5 లక్షల టన్నుల గ్రీన్ హౌస్ వాయువులు గాలిలోకి విడుదలవుతున్నాయని లెక్కలు చెబుతున్నాయి. మన హైదరాబాదు జంట నగరాల్లో 12 లక్షల కార్లు, తేలిక వాహనాలూ రోడ్లమీద తిరుగుతున్నాయి. ఇవి రోజుకు సుమారు 1000 టన్నుల గ్రీన్ హౌస్ వాయువులను గాలిలోకి విడుదల చేస్తున్నాయి. ఇవన్నీ 2009 నాటి లెక్కలు. పదేళ్లలో మరింత పెరుగుతాయన్న దాంట్లో సందేహం లేదు. అభివృద్ధి పేరుతో అడవులను పెద్ద ఎత్తున నరికి వేయడం జరుగుతోంది. ఒకవైపు పరిశ్రమలు, వాహనాల నుండి వాతావరణంలోకి భూతాపం పెంచే వాయువుల విడుదల పెంచడం, మరోవైపు కార్బన్ డై-ఆక్సైడ్ వాయువును వాతావరణం నుండి పీల్చుకునే వృక్షాలను పెద్ద ఎత్తున నరికి వేయడం వల్ల భూగోళం వేడెక్కుతోంది.

సగటు భూగోళ ఉష్ణోగ్రత 2 డిగ్రీలకు పెరిగితే ఇక మన చేతులు దాటిపోయే పెను ఉత్పాతాలు సంభవిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వాతావరణంలోకి దాదాపు 1 లక్షకోట్ల (ట్రిలి యన్) టన్నుల కర్బన ఉద్గారాలు విడిచిపెడితే 2 డిగ్రీల వేడి పెరుగుతుందని అంచనా.

ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు కట్టిన లెక్కల ప్రకారం 2043 నాటికి, అంటే నేటికి మరో పాతికేళ్లలో భూమి అటువంటి స్థితికి చేరుకుంటుంది.

అయితే మనం వెంటనే ప్రారంభించి ప్రతి ఏటా 2.4 శాతం కర్బన ఉద్గారాలు తగ్గించుకుంటూ పోతే మరో లక్షకోట్ల టన్నుల ఉద్గారాలు, లేదా 2 డిగ్రీల సగటు ఉష్ణోగ్రతలు పెరగకుండా ఆపగలం. ఒకవేళ ఆపలేక ఇలాగే కర్బన ఉద్గారాలు వదులుకుంటూ పోతే ఈ శతాబ్దం చివరికి భూమి సగటు ఉష్ణోగ్రత పెరుగుదల 4 డిగ్రీల సెల్సియస్‌కు చేరుతుంది. అప్పుడు భూమి ఉంటుంది కానీ, దాని మీద మనుషులు మాత్రం అంతరించిపోయే జీవుల జాబితాలో చేరుతారు అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

పారిస్ ఒప్పందం, దాని కనుగుణంగా రూపొందించబడిన కటోవైస్ నిబంధనలు ఖచ్చితంగా అమలు పరిస్తే కూడా భూగోళ సగటు ఉష్ణోగ్రత 4 డిగ్రీలకు చేరకుండా చేస్తాయి గాని, 3 శాతానికి మించకుండా ఆపలేవు. "మీ వద్ద ఇంక సాకులేమీ లేవు. మనకు సమయం మించిపోతున్నది" అని కటోవైస్ సమావేశంలో స్ఫూర్తివంతంగా ప్రసంగించిన 15 ఏళ్ల స్వీడిష్ బాలిక గ్రేటా తుంబెర్గ్ అక్కడ చేరిన దేశాధినేతలను హెచ్చరించింది. "అవకాశం చేజారి పోతున్నది" వెంటనే గట్టి నిర్ణయం తీసుకోవాలి అని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ పేర్కొన్నారు. కానీ సమా వేశానికి హాజరైన దేశాధినేతలకు మాత్రం ఇదేమీ పట్టినట్టు కనిపించలేదు.

> **"మరీ ముఖ్యంగా అమెరికా ఈ సమావేశాల్లో వ్యవహరించిన తీరు సిగ్గుకే సిగ్గుతెప్పించే విధంగా ఉంది. భూ తాపం తగ్గించేందుకు జరుగుతున్న ఈ సమావేశాల్లో అమెరికా ఆధ్వర్యంలో డిసెంబర్ 10వ తేదీన శిలాజ ఇంధ నాల వాడకాన్ని ప్రోత్సహిస్తూ ఒక ప్రత్యేక సదస్సు జరిగింది. అమెరికాలో "శిలాజ ఇంధనాల పునరుజ్జీవం" జరుగుతోందని సదస్సులో పాల్గొన్న అమెరికా సీనియర్ అధికారి వెల్స్ గ్రిఫ్ఫిత్ పేర్కొన్నారు."**

### అమెరికా సైంధవ పాత్ర

మరీ ముఖ్యంగా అమెరికా ఈ సమావేశాల్లో వ్యవహరించిన తీరు సిగ్గుకే సిగ్గుతెప్పించే విధంగా ఉంది. భూ తాపం తగ్గించేందుకు జరుగుతున్న ఈ సమావేశాల్లో అమెరికా ఆధ్వర్యంలో డిసెంబర్ 10వ తేదీన శిలాజ ఇంధ నాల వాడకాన్ని ప్రోత్సహిస్తూ ఒక ప్రత్యేక సదస్సు జరిగింది. అమెరికాలో "శిలాజ ఇంధనాల పునరుజ్జీవం" జరుగుతోందని సదస్సులో పాల్గొన్న అమెరికా సీనియర్ అధికారి వెల్స్ గ్రిఫ్ఫిత్ పేర్కొన్నారు. సదస్సు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ "హాస్యాస్పదమైన, ఖరీదైన పారిస్ ఒప్పందాన్ని రద్దు చేసే సమయం వచ్చింది" అని పేర్కొన్నారు. గత ఏడాది ఉద్గారాల విడుదలను తగ్గించిన ఏకైక దేశం అమెరికాయేనని ఆయన పేర్కొన్నారు.

అమెరికా అధ్యక్షుడు ఏం చెప్పినా, గ్రీన్ ఎకానమీ గురించి దేశాధి నేతలు ఎన్ని మాటలు చెబుతున్నా 2018లో ఉద్గారాలు ప్రపంచ వ్యాపితంగా 2.7 శాతం పెరిగాయని 'ప్రపంచ కార్బన్ ప్రాజెక్ట్' నివేదిక కటొవైస్ సమావేశాలకు కొద్ది రోజుల ముందే తెలిపింది. 2014 నుండి 2016 వరకు క్రమంగా తగ్గుదల చూపిన ఉద్గారాల విడుదల గత రెండేళ్లలో మళ్లీ పెరగడం మొదలు పెట్టాయి. 2017లో 1.6 శాతం పెరిగాయి. 2018లో అన్ని దేశాలూ కలిపి రికార్డు స్థాయిలో 3,710 కోట్ల టన్నుల కార్బన్ డై–ఆక్సైడ్‌ను వాతావరణంలోకి విడుదల చేశాయి. భారత్ 6శాతం, చైనా 5 శాతం అదనంగా ఉద్గారాలు విడుదల చేశాయి. ఒక్క ఐరోపా యూనియన్ దేశాల్లో 1 శాతం తగ్గడం మినహా మిగిలిన అన్ని దేశాల నుండి ఉద్గారాల విడుదల పెరిగిందని "ప్రపంచ కార్బన్ ప్రాజెక్టు" రిపోర్టు తెలిపింది. అమెరికా కూడా ఈ ఏడాది 2.5 శాతం అదనంగా ఉద్గారాలు విడుదల చేసిందని నివేదిక స్పష్టం చేసింది.

ప్రపంచ జనాభాలో 20 శాతం మాత్రమే ఉన్న సంపన్న ధనిక పెట్టుబడిదారీ దేశాలు వాతావరణంలో 74 శాతం కార్బన్ డై–ఆక్సైడ్ పేరుకుపోవడానికి కారణమయ్యాయి. 80 శాతం ప్రజలు నివసించే వర్ధమాన దేశాలు కేవలం 26 శాతం వాయువులు విడుదల చేశాయి. మొత్తం మీద చూపినప్పుడు భూగోళ తాపాన్ని తగ్గించడానికి ప్రభుత్వాల నుండి వస్తున్న స్పందన సరిపడ్డంతగా, అంటే భూగోళం పై రానున్న విలయాన్ని ఆపే విధంగా లేదని అర్థమైపోతోంది.

కటొవైస్ సమావేశాల్లో నాలుగు గుర్తించ దగ్గ అంశాలున్నాయి. మొదటిది, పారిస్ ఒప్పందం నియమ నిబంధనల రూపకల్పనలో వర్ధమాన దేశాలకు అన్యాయం జరిగింది. వాతావరణంలోకి అత్యధికంగా ఉద్గారాలు విడిచిపెట్టే దేశాలకూ, అసలు విడిచిపెట్టని లేక కొద్ది మోతాదులో విడిచిపెట్టే పారిశ్రామికంగా అభివృద్ధి చెందని వర్ధమాన దేశాలకూ ఒకే రకమైన నిబంధనలు ఉండకూడదన్నది గతం నుండీ అంగీకరిస్తున్న విషయం. కానీ అన్ని దేశాలకూ ఒకేరకమైన నిబంధనలు అమలు చేయాలని పారిశ్రామిక దేశాలు పట్టుబట్టి సాధించుకున్నాయి. వర్ధమాన దేశాలు ఉద్గారాలు విడిచిపెట్టకుండా అభివృద్ధి సాధించాలంటే వాటి వద్ద తగిన సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక స్తోమతు ఉండాలి. కానీ ప్రస్తుతం వాటికా స్తోమతులేదు కనుక వాటిని పారిశ్రామిక దేశాలు సమకూర్చాలన్నది పారిస్ ఒప్పందంలో ఒక సూత్రం. కానీ ఈ అంశంపై చర్చలు జరపకుండాలనే వాయిదా వేశారు. ఆర్టికల్ 9 (వర్ధమాన దేశాలకు ఆర్థిక, సాంకేతిక సహకార)ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. దాంతో పేద ఆఫ్రికా దేశాల గ్రూపు నిరసన తెలుపుతూ చర్చలను బహిష్కరించింది. ఈ అంశాన్ని వదిలిపెట్టి కార్బన్ మార్కెట్లు, బీమా సదుపాయాల ఏర్పాటు గురించి చర్చలు జరపడానికి పారిశ్రామిక దేశాల ప్రతినిధులు ఆసక్తి చూపించారు.

రెండవది, భూతాపం వల్ల నష్టపోయే చిన్న దేశాలకు ఆర్థిక సాయం విషయాన్ని పారిశ్రామిక దేశాలు పూర్తిగా పక్కన పెట్టాయి. భూతాపంతో పెరిగే సముద్రమట్టాల వల్ల మునిగిపోయే తమ సంగతి ఏమిటి అని చిన్న ద్వీప దేశాలు నిలదీశాయి. "కొద్దిపాటి అభివృద్ధి చెందిన దేశాలు అనుభవిస్తున్న విలాసాలు చిన్న వర్ధమాన దేశా ప్రజల విలాపాలుగా మారుతున్నాయి." అని కిరిబటి దేశాధ్యక్షుడు టనెటి మమవు పేర్కొన్నారు. చిన్న అభివృద్ధి చెందుతున్న ద్వీప దేశాల గ్రూపు (ఎస్ఐడిఎస్) సమావేశం ముందు కొన్ని డిమాండ్లు పెట్టి, తమ సంగతి తేల్చాలని పట్టుబట్టినా అక్కడ వారి గోడు వినిపించు కునేవారు లేకుండా పోయారు.

వాతావరణాన్ని కలుషితం చేయడంలో పారిశ్రామిక దేశాల పాత్రే కీలకం గనుక రానున్న కాలంలో వర్ధమాన దేశాలు అంతగా కాలుష్యం చేయకుండా అభివృద్ధి చెందేందుకు ఆర్థిక సాయం చేస్తామని ధనిక దేశాలు అంగీకరించాయి. వర్ధమాన దేశాల్లో కాలుష్యం తగ్గించడానికీ, భూ తాపం వల్ల వచ్చే నష్టాలు పూడ్చుకోడానికీ ఏటా 10,000 కోట్ల డాలర్ల సహాయ చేస్తామని మాట ఇచ్చాయి. దీనికి అదనంగా ఏటా మరో 10,000 కోట్ల డాలర్లను 2020 వరకు వర్ధమాన దేశాలకోసం ఖర్చు చేస్తామని అవి 2015 పారిస్ సమావేశాల్లో హామీ ఇచ్చాయి. రెండు హామీలు కలుపుకుంటే గడచిన నాలుగేళ్లలో 80,000 కోట్ల డాలర్లు పేద వర్ధమాన దేశాలకు అందాలి. కానీ ఇప్పటివరకు ఈ దేశాలు ఇచ్చింది కేవలం 1000 కోట్ల డాలర్లు మాత్రమే. ధనిక దేశాలైన అమెరికా, ఫ్రాన్స్, జపాన్‌లు మాత్రమే కాక, మెక్సికో, వియత్నాం, ఇండోనేషియా లాంటి వర్ధమాన దేశాలు కూడా ఇచ్చింది కలిపితే ఈ మొత్తం అయింది.

మూడవది, శిలాజ ఇంధనాలు ఉత్పత్తి చేసే అమెరికా, సౌదీ అరేబియా, కువైట్, రష్యాలు వాతావరణ మార్పులపై విడుదలైన అంతర్జాతీయ శాస్త్రవేత్తల నివేదికనే తోసిపుచ్చాయి. 1.5 డిగ్రీల సెల్సియస్ సగటు ఉష్ణోగ్రత పెరిగితే భూగోళంపై సంభవించే విపరిణామాల గురించి ఒక నివేదిక తయారు చేయాలని 2015 పారిస్ చర్చల సందర్భంగా అన్ని దేశాలూ కోరడంతో వివిధ దేశాల శాస్త్రవేత్తలతో అటువంటి నివేదిక తయారు చేసి 'వాతావరణ మార్పులపై అంతర్ ప్రభుత్వ ప్యానల్' (ఐపిసిసి) గత అక్టోబర్‌లో విడుదల చేసింది. 2020 నాటికి భూతాపం పెరుగుదల 1.5 డిగ్రీల లోపల ఉంచకపోతే చిన్న ద్వీప దేశాలన్నీ మునిగిపోతాయనీ, అనేక తీర ప్రాంతాలు సముద్రం పాలవుతాయని,

వాతావరణంలో పెనుమార్పులు సంభవిస్తాయనీ నివేదిక పేర్కొంది. ఈ స్థాయిలో ఉంచాలంటే కర్బన ఉద్గారాలను తీవ్రంగా తగ్గించాలి. అలా చేయాలంటే అన్ని దేశాలూ తమ ఆర్థిక వ్యవస్థల్లో తీవ్ర మార్పులు చేసుకోవాలి. "సైన్సుతో ఒప్పందం కుదరదు, భౌతికశాస్త్ర సూత్రాలతో చర్చలు సాధ్యం కావు. వాతావరణ మార్పు అనేది అంతిమంగా ప్రపంచ సమస్య. కాలుష్యానికి దేశాల మధ్య హద్దులు తెలియవు" అని మాల్దీవుల మాజీ అధ్యక్షుడు మహమ్మద్ నషీద్ పేర్కొన్నారు. సగటు కాలుష్యం 2 డిగ్రీలకు పెరిగితే మొట్టమొదట మునిగిపోయే ద్వీపాల్లో మాల్దీవులు కూడా ఉంటాయి. అయితే ఈ నివేదికను 'గుర్తిస్తాం' కానీ 'స్వాగతించబోము" అని అమెరికా నాయకత్వంలో ఈ నాలుగు దేశాలు మొండికేశాయి. దాంతో మొత్తం చర్చలే ఆలస్యమైనాయి. చివరికి నివేదికను 'ఆహ్వానిస్తున్నాం' అన్న మాటను తొలగించారు. "ఈ నివేదికలో శాస్త్రీయమైన గాప్స్, విజ్ఞానపరమైన గ్యాప్స్ ఉన్నాయి' అందుకే మా దేశం దాన్ని ఆహ్వానించలేకపోతోంది అని సౌదీ అరేబియా అధికారి ఆయ్‌మాన్ షాస్లే పేర్కొన్నారు.

"వాతావరణాన్ని రక్షించే ప్రయత్నాల్లో అమెరికా వెనక్కు తగ్గి చైనా ముందుకు రావడం ఈ సందర్భంగా కొట్టొచ్చినట్లు కనిపించింది. ఈ చర్చల్లో అన్నిచోట్లా చైనా ముందు పీఠిన ఉండి కీలక పాత్ర పోషించింది. ప్రపంచంలో అమెరికా తరువాత చైనా అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ. అదే సమయంలో అత్యధిక ఉద్గారాలు విడిచిపెడుతున్న దేశాల్లో కూడా అది ఒకటి. అది చర్చల్లో ఒకవైపు వర్ధమాన దేశాల డిమాండ్లకు మద్దతుగా నిలిచింది."




పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ చేస్తున్న ఆందోళనకారులు

**చైనా చొరవ**

నాల్గవది, వాతావరణాన్ని రక్షించే ప్రయత్నాల్లో అమెరికా వెనక్కు తగ్గి చైనా ముందుకు రావడం ఈ సందర్భంగా కొట్టొచ్చినట్లు కనిపించింది. ఈ చర్చల్లో అన్ని చోట్లా చైనా ముందు పీఠిన ఉండి కీలక పాత్ర పోషించింది. ప్రపంచంలో అమెరికా తరువాత చైనా అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ. అదే సమయంలో అత్యధిక ఉద్గారాలు విడిచిపెడుతున్న దేశాల్లో కూడా అది ఒకటి. అది చర్చల్లో ఒక వైపు వర్ధమాన దేశాల డిమాండ్లకు మద్దతుగా నిలిచింది. చిన్న వర్ధమాన దేశాలకు మరిన్ని ఆర్థిక వనరులు, సాంకేతిక సహకారం అందించేందుకు పోరాడింది. మరోవైపు అన్ని దేశాలకూ ఒకేరకమైన నియమాలు ఉండాలన్న దానికి గతంలో చేసిన ప్రతిఘటనను తగ్గించింది. పారిస్ వాతావరణ చర్చల నుండి తప్పుకుంటున్నట్లు ఒకవైపు అమెరికా అధ్యక్షుడు ప్రకటించిన నేపథ్యంలో, ప్రస్తుత చర్చలో అమెరికా వాతావరణ విఘాత వైఖరి తీసుకున్న తరుణంలో చైనా ఈ రకంగా ముందుకు రావడం వర్ధమాన దేశాలకు కొండంత ధైర్యాన్నిచ్చింది. ఒకవైపు అమెరికా వెనక్కు తగ్గితే చర్చలల్లో చైనా, ఐరోపా యూనియన్‌లు అనేక అంశాల్లో కలిసి వెళ్ళడం కనిపించింది.

పారిస్ ఒప్పందంలో ఒప్పుకున్నట్లు అన్ని దేశాలూ ఉద్గారాలను తగ్గించినా 2 డిగ్రీల స్థాయిని మించిపోయి భూ తాపం 3 డిగ్రీలకు పెరుగుతుందని యునెప్ స్పష్టం చేస్తూ ఉంటే మరోవైపు ఒప్పందం పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ఏ దేశమూ వాతావరణానికి సంబంధించి తాము ప్రకటించిన విధానాలనూ, ఉద్గారాలు తగ్గిస్తామని చేసిన వాగ్దాలనూ వాస్తవంగా అమలు చేయడం లేదని వివిధ అధ్యయనాల్లో తేలిన విషయాన్ని ప్రతిష్ఠాత్మక నేచర్ పత్రిక ప్రచురించింది. పారిస్ ఒప్పందాన్ని పూర్తిగా అమలు పరిస్తే వచ్చే ఫలితాలేమిటి, అమలు పరచకపోతే వచ్చే ప్రమాదాలేమిటి అనే విషయమై చేసిన సర్వేను మసాచుసెట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (మిట్) 2016లో ఒక వ్యాసంలో వివరించింది. దాని ప్రకారం పారిస్ ఒప్పందం అమలు వల్ల మొత్తం మీద చూసినప్పుడు 0.6 నుండి 1.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత పెరుగుదలనునిలువరించగలం. అంటే ఒప్పందం పూర్తిగా అమలు పరిస్తే కూడా శతాబ్దం చివరి నాటికి అంటే 2100 నాటికి భూ తాపం 4 నుండి 5 డిగ్రీల సెంటీగ్రేడు పెరుగుతుంది. దీన్ని బట్టి ఇప్పుడు ఉద్గారాలు తగ్గించేందుకు తీసుకున్న కోటాలు ఎంత తక్కువో, అవికూడా సరిగ్గా అమలు పరచకపోవడం ఎంత ప్రమాదకరమో అర్థమవుతుంది.

అందుకే "దేశాలు చేస్తున్న వాగ్దానాలన్నీ మాటల్లోనే కాని చేతల్లో కనిపించడం లేదు" అని మాజీ నాసా శాస్త్రవేత్త, వాతావరణ మార్పుల నిపుణుడు జేమ్స్ హాన్సన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సదస్సులో ప్రసంగించిన స్వీడిష్ బాలిక తుంబెర్గ్ మాటల్లో చెప్పాలంటే.."రాజకీయంగా ఏ చర్యలు సాధ్యం అనేది విడిచిపెట్టి చేయాల్సినదేమిటి అనేదానిపై కేంద్రీకరించకపోతే మనకు భవిష్యత్తు ఉండదు". కానీ పెట్టుబడిదారీ ప్రభుత్వాలేవీ ప్రైవేటు లాభాల పరిధి నుండి బయటకు రావటం లేదు. పారిస్ ఒప్పందంలో మార్కెట్ యంత్రాంగం, కార్బన్ రుణాలు అనే అంశాలను నిర్ణయించే ఆర్టికల్ 6ను రూపొందించడంతో ఒక షెల్ కార్పొరేషన్ ప్రముఖ పాత్ర నిర్వహించినట్లు ఆ సంస్థ ప్రతినిధి ఒకరు గర్వంగా చెప్పుకున్నారు. అందుకే ప్రభుత్వాల లక్ష్యాలు ప్రైవేటు పెట్టుబడిదారుల లాభాలు పెంచడం మీద కేంద్రీకరించబడినంత కాలం వాతావరణ కాలుష్యాన్నీ, భూగోళ తాపాన్నీ అవి ఆపలేవు. అందువల్ల ఇప్పుడు తక్షణం జరగాల్సింది వాతావరణాన్ని మార్చడం కాదు, పెట్టుబడిదారీ ప్రభుత్వాలను రద్దు చేయడం. ❋

# వ్యవసాయ సంక్షోభాన్ని పెంచే నీతి ఆయోగ్ వ్యూహపత్రం

ఎ కోటిరెడ్డి



రచయిత ప్రజాశక్తి సహాయ సంపాదకులు

నీతి ఆయోగ్ నూతన భారతదేశం కోసం రూపొందించిన జాతీయ సమగ్ర వ్యూహపత్రాన్ని డిసెంబర్ 19వ తేదీన ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ ఆవిష్కరించాడు. మొత్తం 232 పేజీలున్న ఈ డాక్యుమెంట్‌లో వివిధ విభాగాలను విశ్లేషించారు. 2022 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ 75వ వార్షికోత్సవం సందర్భంగా అప్పటికి, ఆ తర్వాత 2030 నాటికి సాధించాల్సిన లక్ష్యాలను నిర్దేశించారు. ప్రస్తుతం దేశ జిడిపి 2.7 ట్రిలియన్ డాలర్లు– డాలరుకు 70 రూపాయల మారకం రేటు ప్రకారం 1.89 కోట్ల కోట్ల రూపాయలు–ఉండగా 2022–23 నాటికి 4 ట్రిలియన్ డాలర్లకు–2.80 కోట్ల కోట్ల రూపాయలు– చేరాలని, 2030 నాటికి 5 ట్రిలియన్ డాలర్లకు– 3.50 కోట్ల కోట్ల రూపాయలు–చేరాలని లక్ష్యం నిర్దేశించారు. ఈ అంకెలను రూపొందించటం లోనే అసంబద్ధత కనిపిస్తున్నది. ప్రస్తుతం 2018 డిసెంబరు నెల ముగింపులో ఉన్నాం. 2022–23 ఆర్థిక సంవత్సరం ముగింపుకు నాలుగు సంవత్సరాల మూడు మాసాలు మాత్రమే ఉన్నది. ఈ కాలంలో జిడిపిని 1.3 ట్రిలియన్ డాలర్లు–91 లక్షల కోట్ల రూపాయలు– పెంచాలని నిర్ణయించారు. అప్పటి నుండి 2030కి ఏడు సంవత్సరాలు ఉన్నది. ఈ ఏడు సంవత్సరాలలో జిడిపి 1 ట్రిలియన్ డాలర్లు– 70 లక్షల కోట్ల రూపాయలు– మాత్రమే పెంచాలని ప్రతిపాదించారు. 2022–23 నుండి 2030 నాటికి పెరిగే జిడిపి 2022–23 నాటికి పెరిగే జిడిపిలో సగం కూడా ఉండదు. కాబట్టి 2022–23 తర్వాత ఆర్థికవ్యవస్థ తిరోగమనంలో ఉంటుందని నీతి ఆయోగ్ భావిస్తున్నదా అనే సందేహం కలుగుతున్నది.

ప్రస్తుత వ్యవసాయ రంగ స్థితిగతులను సమీక్షించి, సాధించాల్సిన లక్ష్యాలను ఈ పత్రం లో నిర్దేశించారు. 2022–23 నాటికి రైతుల ఆదాయాలను రెట్టింపు చేయాలని వ్యూహ పత్రంలో పేర్కొన్నారు. ఈ రంగంలోకి కార్పొరేట్ సంస్థలను ప్రవేశపెట్టటం, ప్రైవేటు పెట్టుబడులకు ఉన్న ఆటంకాలను తొలగించటం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించటం, ఎగుమతులకు అవసరమైన పంటలను పండించటం ఉత్పాదకతను పెంచటం, వనరులను సమర్ధవంతంగా వినియోగించుకోవటం, పంటల వైవిధ్యాన్ని పెంచటం తదితరాలను వ్యవసాయ రంగం, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే సాధనాలుగా చూయించారు. ఈ మార్పుల ద్వారా రైతుల ఆదాయాన్ని, ఉపాధి అవకాశాలను పెంచటం, ఆహారభద్రతకు గ్యారంటీ, వ్యవసాయోత్పత్తి విలువను గరిష్టంగా పెంచటం వ్యవసాయ రంగంలో లక్ష్యాలుగా పేర్కొన్నారు.

**ఆహారపంటల నుండి దూరం చేయటం లక్ష్యం**

సాధించాల్సిన లక్ష్యాలలో ఆహారభద్రతను గురించి పేర్కొన్నప్పటికీ అమలు విషయం వచ్చేసరికి దానిని తుంగలో తొక్కటానికి అవసరమైన ప్రతిపానలన్నింటినీ చేశారు. దేశంలో సాగులో ఉన్న భూమిలో 77 శాతంలో ఆహారధాన్యాలు, పప్పులు, నూనెగింజలు పండిస్తున్నారు. ఈ పంటల ద్వారా మొత్తం వ్యవసాయోత్పత్తిలో 41 శాతం మాత్రమే వస్తున్నది. పండ్లు, కూరగాయలకు గిరాకి అధికమవుతున్నది. అధిక విలువైన పంటలను 19 శాతం భూమిలోనే పండిస్తున్నప్పటికీ, పై మూడు పంటలలో వచ్చినంత దిగుబడి ఈ పంటలలో వస్తున్నది. కాబట్టి ఆహారపంటల నుండి అధిక విలువైన పంటలకు మారటం చిన్న, మధ్య తరగతి రైతాంగానికి ఎక్కువ ప్రయోజనం కలిగిస్తుందని చెప్పారు. పండ్లు, కూరగాయలు పండించే భూమిని సంవత్సరానికి 5 శాతం చొప్పున పెంచాలని చెప్పారు. వ్యూహపత్రంలో చెప్పిన ప్రకారం ప్రస్తుతం 19 శాతం భూమిలో పండిస్తున్న ఈ పంటలు విస్తీర్ణాన్ని సంవత్సరానికి 5 శాతం చొప్పున పెంచితే 2022–23 నాటికి పండ్లు, కూరగాయలు పండిస్తున్న భూమి 50 శాతానికి చేరుతుంది. 50 శాతం భూమిలో పండించిన పండ్లు, కూరగాయలను వినియోగించగలిగిన మార్కెట్ మనదేశంలో ఉందా? లేకపోతే ఎగుమతులు చేయాలి. అంతర్జాతీయ మార్కెట్ బహుళజాతి సంస్థల చేతుల్లో ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో వ్యవసాయోత్పత్తుల ధరలలో తీవ్రమైన ఒడిదుడుకులు వస్తుంటాయి. ఈ సంస్థలు మార్కెట్ ధరలను తొత్తడం చేసి, తమకు అనుకూలంగా మలచుకుంటాయి. పంటలను పండించే రైతు స్వయంగా ఎగుమతి చేయటం సాధ్యం కాదు కాబట్టి రైతులు తమ పంటలను అమ్ముకోవటానికి పూర్తిగా మధ్య దళారులపై ఆధారపడాల్సి ఉంటుంది. దళారులు కార్పొరేట్లతో కుమ్మక్కై ధరలను దిగ్గోస్తారు. కాబట్టి అంతర్జాతీయ మార్కెట్లో అధిక ధరలు ఉన్నపుడు కూడా పండ్లు, కూరగాయలు పండించే రైతులు కనీస మద్దతు ధరలు కూడా పొందలేరు. పంట కోసిన తర్వాత పండ్లు, కూరగాయలు కొద్దికాలం మాత్రమే నిల్వఉంటాయి. సపోటా లాంటి పండ్లు, ఆకు కూరల లాంటి కొన్ని రకాలయితే కొద్ది గంటలకు మించి నిల్వ ఉండవు. వాటిని రైతులు తక్షణమే అమ్ముకోవాల్సి ఉంటుంది. ఈ ఉత్పత్తులకు స్థానిక మార్కెట్‌లో డిమాండ్ లేనపుడు దళారీలు ఎంత తగ్గించి కొనుగోలు చేస్తామన్నా రైతుకు అమ్ముకోవటం మినహా గత్యంతరం ఉండదు. అలా అమ్ముకోకుండా ఉండాలంటే రైతు తన పంటను నిల్వచేసుకోవటానికి శీతల గిడ్డంగులు ఉండాలి. పంట కోయగానే వెంటనే అమ్ముకొని, చేతికొచ్చిన డబ్బుతో అప్పులు తీర్చుకోవటం, కుటుంబ అవసరాలు తీర్చుకోవటం పేద, మధ్య తరగతి

రైతులకు ప్రధానం. ఈ విధంగా పేద, మధ్య తరగతి రైతులు పండ్లు, కూరగాయలు పండిస్తే వారి అవసరాలను తీర్చటం కోసం తమ పంటలను శీతల గిడ్డంగులలో నిల్వచేసుకోగానే, పంటకు కనీస మద్దతు ధరలో 90 శాతం వారికి రుణంగా అందించాల్సి ఉంటుంది. ఆ విధంగా శీతల గిడ్డంగులు నిర్మించి, రైతాంగం పంటను నిల్వ చేసుకోవటానికి అవకాశం కల్పించి, శీతల గిడ్డంగుల్లో ఉన్న పంటహామీపై పంటధరలో 90 శాతం ప్రభుత్వం రుణంగా ఇస్తుందా? అలా ఇవ్వకపోతే ఇతర పంటలు పండించే రైతుల కన్నా కూరగాయలు, పండ్లు పండించే రైతులు దారుణమైన పరిస్థితులను ఎదుర్కొంటారు. ఒకటి, రెండు సంవత్సరాలలోనే ఈ రైతులు దివాళా తీసి, భూములు అమ్ముకోవటం, ఆత్మహత్యలు చేసుకోవటంలాంటివి మరింత పెరుగుతుతాయి.

ఇక 50 శాతం పంటభూమిని పండ్లు, కూరగాయల పంటలకు కేటాయిస్తే ఆహారధాన్యాలు పండించే భూమి తగ్గిపోతుంది. నివేదికలో పేర్కొన్న ప్రకారమే ప్రస్తుతం 77 శాతం భూమిలో ఆహారధాన్యాలు, పప్పులు, నూనె గింజలు పండిస్తున్నాం. అయినా దేశ ప్రజల అవసరాల మేరకు వాటిని ఉత్పత్తి చేయలేక పోతున్నాం. ఇక ఆ పంటలు పండించే భూమిలో మూడవ వంతు తగ్గిపోతే ఈ ఉత్పత్తుల కొరత ఎంతగా ఉంటుందో ఊహించాల్సిందే. అదే జరిగితే సామాన్య ప్రజలు ఆహార ధాన్యాలు, పప్పులు, నూనెగింజల కొరతను ఎంతగా ఎదుర్కొంటారు! ప్రజలకు ఆహారధాన్యాలు అందుతాయా? ఈ పంటలు పండించే భూమి 50 శాతంకు తగ్గిస్తే వచ్చే దిగుబడులతో ప్రజలకు తిండిపెట్టటం సాధ్యమౌతుందా? దేశంలో తిండి కొరత ఏర్పడితే ఆర్థిక, రాజకీయ, సామాజిక సంక్షోభాలు తీవ్రం అవుతాయి.

**"ఇక 50 శాతం పంటభూమిని పండ్లు, కూరగాయల పంటలకు కేటాయిస్తే ఆహారధాన్యాలు పండించే భూమి తగ్గిపోతుంది. నివేదికలో పేర్కొన్న ప్రకారమే ప్రస్తుతం 77 శాతం భూమిలో ఆహారధాన్యాలు, పప్పులు, నూనె గింజలు పండిస్తున్నాం. అయినా దేశ ప్రజల అవసరాల మేరకు వాటిని ఉత్పత్తి చేయలేక పోతున్నాం. ఇక ఆ పంటలు పండించే భూమిలో మూడవ వంతు తగ్గిపోతే ఈ ఉత్పత్తుల కొరత ఎంతగా ఉంటుందో ఊహించాల్సిందే."**



నీతి ఆయోగ్ వ్యూహపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జైట్లీ

ప్రభుత్వం, సరళీకరణ విధానాల సమర్థకులు చెబుతున్నట్లుగా మనకు అవసరమైన ఆహార ధాన్యాలను అంతర్జాతీయ మార్కెట్లో కొనటంలో అనేక సమస్యలు ఉన్నాయి. చిన్న దేశాలకు అవసరాలు కొద్దిపాటిగా ఉంటాయి కాబట్టి ఆ దేశాలు ఆహారధాన్యాలు కొనుగోలు కోసం అంతర్జాతీయ మార్కెట్‌లోకి వెళ్ళినా ధరవరల్లో పెద్దగా మార్పురాదు. భారత్ లాంటి పెద్దదేశం అంతర్జాతీయ మార్కెట్ నుండి కోట్ల టన్నుల ఆహారధాన్యాలను కొనుగోలు చేయటానికి పూనుకుంటే మార్కెట్లోని పరిస్థితులు మారిపోతాయి. అంతర్జాతీయ ధరలు అసాధారణంగా పెరుగుతాయి. ఆ ధరలతో దిగుమతి చేసుకొని దేశంలో అమ్మితే మూడొంతుల మంది ప్రజలు అధిక ధరలకు ఆహారధాన్యాలను కొనలేరు. కాబట్టి భారత్‌లాంటి పెద్దదేశం ఆహారధాన్యాల దిగుమతులపై ఆధారపడి తన ప్రజలకు తిండి పెట్టటం సాధ్యం కాదు. అంతర్జాతీయ ఆహార నిల్వలు బహుళజాతి సంస్థల చేతుల్లో ఉంటాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలు ఆహార కొరతను ఎదుర్కొంటున్నపుడు ఆ దేశాలను తమ చెప్పుచేతల్లో పెట్టుకోవటానికి బహుళజాతి సంస్థలు, సామ్రాజ్యవాద దేశాలు ఆహారధాన్యాలను అందజేయటానికి విషమ షరతులు పెడతాయి. తమ మాట వినకపోతే ఆహార సరఫరాను ఆపివేసి, ఆ దేశాలలో కల్లోల పరిస్థితులను సృష్టిస్థాయి. గతంలో మనదేశం పట్ల అమెరికా వ్యవహరించిన తీరును గుర్తు చేసుకుంటే సామ్రాజ్యవాదులు ఆహారాన్ని ఆయుధంగా ఎలా వినియోగిస్తారో స్పష్టమౌతుంది. కాబట్టి వ్యూహపత్రంలో పేర్కొన్న విధంగా పంటలలో మార్పుచేస్తే రైతాంగం దివాళా తీయటం, ఆహారభద్రత, దేశ సార్వభౌమత్వం కూడా ప్రమాదంలో పడతాయి.

### సాంకేతిక పరిజ్ఞానంతోనే సమస్యలు పరిష్కారం కావు

వ్యవసాయంలో దిగుబడులు తక్కువగా ఉండటానికి, పశువుల ద్వారా తగినంత ఆదాయం రాకపోవటానికి కాలం చెల్లిన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించటమే కారణమని తేల్చారు. కాబట్టి ఉత్పాదకతను పెంచటం, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలంటే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని చెప్పారు. భూసార పరీక్షలు చేయించి, సాయిల్ హెల్త్‌కార్డ్-ఎస్‌హెచ్‌సి, భూమి ఆరోగ్యసూచిక-లో నమోదు చేయాలని, ఎరువులలోని పోషకాలు వృధా కాకుండా ఉపయోగించుకోవాలంటే భూమి ఆరోగ్యసూచిక ప్రాతిపదికగా పొలానికి అవసరమైన ఎరువులను వినియోగించాలని పేర్కొన్నారు. రైతాంగం సబ్సిడీలు పొందాలంటే కిసాన్ క్రెడిట్ కార్డులను ఎస్‌హెచ్‌సిలతో అనుసంధానం చేయాలి. హైబ్రీడ్ విత్తనాలను వినియోగిస్తే ఉత్పత్తిని 1.5 నుండి 3 రెట్ల వరకు పెంచుకోవచ్చు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయటానికి 1993-94 నుండి 2015-16 వరకు, 22 సంవత్సరాల కాలం పట్టింది. 2015-16 నుండి 2022-23 నాటికి రెట్టింపు చేయాలంటే సంవత్సరానికి 8 శాతంకు పైగా అభివృద్ధిని సాధించాలి. ఇది సాధించాలంటే వ్యవసాయం నుండి వ్యవసాయ వాణిజ్యానికి మారాలని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి భూములు ముక్కలుగా ఉండటం

**"వ్యవసాయరంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించటం అవసరమే. అయితే అది రైతాంగానికి ప్రయోజనం కలిగిం చేదిగా ఉండాలి. కాని అందుకు భిన్నంగా చిన్న కమతాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిం చటానికి ఆటంకంగా ఉన్నాయని చెబుతూ భూములను బడా పెట్టుబడి దారులు, కార్పొరేట్ సంస్థలకు అప్పగించటానికి అవసరమైన సన్నా హాలు చేస్తున్నారని వ్యూహపత్రం స్పష్టం చేస్తున్నది."**



నాటువేత పనులలో నిమగ్నమైన వ్యవసాయ కార్మికులు

ఆటంకం కలిగిస్తుందని వ్యూహపత్రంలో పేర్కొన్నారు. దేశంలో సగటు కమతం విస్తీర్ణం 1.15 హెక్టార్లు–2.78 ఎకరాలు– గా ఉందని, చిన్న, మధ్య తరగతి రైతులు 85 శాతం ఉండటంతో సాగుభూమి చిన్న చిన్న ముక్కలుగా విభజించబడిందని, ఇది నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించటం, రుణాలు పొందటం, ఉత్పాదకతను పెంచటం, రైతుల ఆదాయాలను పెంపు చేయటంపైనా ప్రభావం చూపుతున్నదని చెప్పారు.

వ్యవసాయరంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించటం అవసరమే. అయితే అది రైతాంగానికి ప్రయోజనం కలిగించేదిగా ఉండాలి. కాని అందుకు భిన్నంగా చిన్న కమతాలు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించటానికి ఆటంకంగా ఉన్నాయని చెబుతూ భూములను బడా పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలకు అప్పగించటానికి అవసరమైన సన్నాహాలు చేస్తున్నారని వ్యూహపత్రం స్పష్టం చేస్తున్నది. భూములను కార్పొరేట్లకు కౌలుకు ఇవ్వటాన్ని ప్రోత్సహించటానికి 2016లోనే ప్రభుత్వం లాండ్ లీజింగ్ యాక్ట్‌ను తీసుకొచ్చింది. దీనిలో కౌలుదార్లు, భూయజమానులకు ఉండే హక్కులను గురించి చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్, మోడల్ అగ్రికల్చరల్ ప్రొడ్యూస్ అండ్ లైవ్‌స్టాక్ యాక్ట్, మోడల్ కాంట్రాక్ట్ ఫార్మింగ్ యాక్ట్‌లను 2017లోనే తీసుకొచ్చారు. ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్–ఎఫ్‌పివో–లను ఏర్పాటు చేయటాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఆ విధంగా కౌలు, కాంట్రాక్టు సేద్యం పేరుతో భూములు, పంటలపై ఆధిపత్యాన్ని కార్పొరేట్, బహుళజాతి సంస్థలకు అప్పగించటానికి పూనుకున్నారు. ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌లను బడా సంస్థలతో అనుసంధానం చేస్తున్నారు. ఈ విధానాల వలన కార్పొరేట్, బహుళజాతి సంస్థల చేతుల్లోకి భూములు పోవటం, వారి ప్రయోజనాలు నెరవేరటానికి, వారి లాభాలు పెరగటానికిఉపయోగపడుతుంది మినహా రైతాంగానికి ఒనగూరేదేమీ ఉండదు.

వ్యవసాయ ఉత్పాదకతను పెంచటంలో వెనుకబడటానికి బాధ్యతను రైతాంగంపై నెట్టివేస్తున్నారు. ఇందులో ప్రభుత్వానికి ఏమీ బాధ్యత లేదా? ఇప్పటికీ 50 శాతం భూమికి సాగునీరు అందటం లేదు. భూసంస్కరణలను అమలు జరిపి దున్నేవానికి భూమిని ఇవ్వటాన్ని బూటకంగా మార్చటంతో ఇప్పటికీ భూకేంద్రీకరణ కొనసాగుతున్నది. ఇప్పుడు భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్న కౌలురైతులకు కనీసం పంటరుణం కూడా ఇవ్వటం లేదు. విత్తన పరిశోధనలు, వ్యవసాయానికి అవసరమైన ప్రాథమిక సదుపాయాలను కల్పించే బాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకొని, ప్రైవేటు వారికి అప్పగించింది. పంటలకు మద్దతు ధరలు కల్పించటం లేదు. వ్యవసాయోత్పత్తులను సేకరించటం, దిగుబడులను పెంచటానికి అవసరమైన చర్యలను తీసుకోవటం తదితరాలను ప్రభుత్వం వదిలివేసింది. ఈ విధంగా బాధ్యతల నుండి తప్పుకున్న ప్రభుత్వం రైతాంగంపై నెపం వేస్తున్నది. ప్రస్తుతం రైతాంగ ఆదాయాలను రెట్టింపు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం ఆ బాధ్యతను కూడా రైతాంగంపైనే మోపుతున్నది. ప్రైవేటు వారిని ప్రోత్సహిస్తున్న తన విధానాల ద్వారా రైతాంగ ఆదాయం రెట్టింపవుతుందని నమ్మబలుకుతున్నది. ఈ విధానాలు అమలు జరిగితే రైతుల ఆదాయాలు రెట్టింపు కావటం కాదు. లక్షల సంఖ్యలో రైతులు దివాళా తీసి, భూములు కోల్పోతారు. ల్యాండ్ లీజింగ్ యాక్ట్ ప్రకారం రైతుల నుండి భూములు ఎవరు కౌలుకు తీసుకుంటారు? ప్రస్తుత కౌలురైతులకు ఇంతకుముందు నుంచి ఉన్న కౌలుదారీ చట్టంలోని అంశాలనే ప్రభుత్వాలు అమలు జరపటం లేదు. కాబట్టి వారు ఈ చట్టంలోని అంశాలతో లబ్ది పొందలేరు. ఈ చట్టం ద్వారా బడా కంపెనీలు, కార్పొరేట్, బహుళజాతి సంస్థలు మినహా సామాన్యులు కౌలుకు తీసుకోలేరు. వ్యూహ పత్రంలో చెప్పినట్లు రైతుల నుండి పెద్దమొత్తం భూములు కౌలుకు తీసుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, పంటలు పండించటం ప్రారంభిస్తే, భూములు ఎవరి చేతిలో ఉంటాయి? భూములన్నీ బడా కంపెనీల చేతుల్లోకి పోతాయి. ఒకసారి భూములు వారి చేతుల్లోకి పోయిన తర్వాత తిరిగి రైతాంగం చేతికి రావటం సాధ్యమౌతుందా? వందలు, వేల ఎకరాలు లీజుకు తీసుకున్న భూమి నుండి ఒకరో ఇద్దరో రైతులు తమ భూమిని వెనక్కి తీసుకోవటం జరిగినా, వారు ఆ భూమిని సాగుచేయగలరా? వందల ఎకరాల మధ్యలో ఉన్న వారి భూముల లోకి వెళ్ళటానికి కంపెనీల యజమానులు దారిస్తారా? నీళ్ళు రానిస్తారా? దున్నటానికి ట్రాక్టరు వస్తుందా? మంగళగిరి మండలం ఆత్మకూరు వద్ద కోకాకోల కంపెనీ బోదె కాలువకు రెండు వైపులా ఉన్న భూమిని కొనుగోలు చేసింది. కంపెనీకి దిగువనున్న భూములకు ఈ బోదె కాలువ ద్వారా నీళ్ళు వెళతాయి. బోదె కాలువపై కంపెనీకి ఎలాంటి హక్కులేదు. కాని కోకాకోలా బోదెకాలువ ద్వారా దిగువ నున్న భూములకు నీళ్ళుపోవటాన్ని

అడ్డగించి, కాలువను పూడ్చివేసింది. రైతులు ఆందోళన చేసినా కంపెనీ లక్ష్యపెట్టలేదు. గత్యంతరం లేని స్థితిలో రైతులు ఇతర మార్గాల ద్వారా తమ భూములకు నీటిని తెచ్చుకుంటున్నారు. ఇటువంటి ఉదాహరణలు అనేకం ఉన్నాయి. కాబట్టి ల్యాండ్ లీజింగ్ యాక్ట్ ద్వారా కార్పొరేట్‌లు రైతుల నుండి భూములు కౌలుకు తీసుకొంటే భూములు వారి చేతులలోకి పోవటమే గాని తిరిగి రైతుల చేతుల్లోకి రావటం ఉండదు.

కాంట్రాక్టు వ్యవసాయంలో పంట రావటానికి ముందే నిర్దిష్టమైన ధరకు కొనుగోలు చేసేలా ఒప్పందం కుదుర్చుకుంటారు. సరుకు నాణ్యత ఎంత ఉండాలి, పంటకు ఏ ధర చెల్లించాలి అన్నది ముందుగానే నిర్ణయిస్తారు. పంట వచ్చిన తర్వాత ఆ ఒప్పందం ప్రకారం కొనుగోలు చేస్తారు. అయితే ఒప్పందం రైతు వైపు నుండి అమలు జరుగుతుంది కాని కాంట్రాక్టు వ్యాపారి వైపునుండి సక్రమంగా అమలు జరుగుతుందని గ్యారంటీ లేదు. కొనుగోలుదారు సరుకుకు వంకలు పెట్టి ధర దిగ్గోయటానికి ప్రయత్ని స్తుంటాడు. కంపెనీల కుతంత్రాలను ఎదుర్కొనే శక్తి రైతులకు ఉండదు. ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకొని, ఆదాయం రెట్టింపు కావటం కోసం ప్రైవేటు వ్యాపారులపై ఆధారపడమని రైతాంగానికి చెబుతున్నది.

> **❝ ఈ చట్టం ప్రకారం ప్రజా ప్రయోజనాల రీత్యా ప్రభుత్వం కొన్ని సరుకుల ఉత్పత్తి, సరఫరా, పంపిణీ, ఆ సరుకుల వ్యాపారం తదితరాలపై కొన్ని ఆంక్షలు విధించవచ్చు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చు. ఈ చట్టం ఉండటం వలననే నిత్యావసర సరుకులను యథేచ్ఛగా, అక్రమంగా నిల్వచేయటానికి సట్టా వ్యాపారులు భయపడుతున్నారు.❞**



ఆధునిక వంటకోత యంత్రం

**నిత్యావసర సరుకుల చట్టాన్ని రద్దుచేసే కుట్ర**

వ్యవసాయంలోపెద్దమొత్తంలో పెట్టుబడులు పెట్టటానికి నిత్యావసర సరుకుల చట్టం–ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్– ఆటంకంగా ఉందని చెప్పారు. నిత్యావసర సరుకులంటే కేవలం ఆహారధాన్యాలు, పప్పులు, నూనెలు, పంచదార, పాలు తదితరాలు మాత్రమే కాదు. పశుగ్రాసం, బొగ్గు, ఆటోమొబైల్ విడి భాగాలు, కాటన్, ఉలెన్ బట్టలు, ఇనుము, ఉక్కు తదితర సరుకులను ఈ జాబితాలో చేర్చారు. ఈ చట్టం ప్రకారం ప్రజా ప్రయోజనాల రీత్యా ప్రభుత్వం కొన్ని సరుకుల ఉత్పత్తి, సరఫరా, పంపిణీ, వ్యాపారం తదితరాలపై కొన్ని ఆంక్షలు విధించవచ్చు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చు. ఈ చట్టం ఉండటం వలననే నిత్యావసర సరుకులను యథేచ్ఛగా, అక్రమంగా నిల్వచేయటానికి సట్టా వ్యాపారులు భయపడుతున్నారు. చట్టం కింద నిత్యావసర సరుకుల సరఫరాను క్రమబద్ధీకరిం చటం కోసం రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కంట్రోల్ ఆర్డర్లను జారీచేయవచ్చు. ఏ సరుకునైనా నిత్యావసర సరుకుగా ప్రకటించ టానికి, కొన్ని సరుకుల ఉత్పత్తిని క్రమబద్ధీ కరించటం లేదా నిషేధించటం, సరఫరా, పంపిణీ, ధరలు, వాణిజ్యంపై ప్రభుత్వం అదుపు కలిగివుంటుంది. అవసరమైనపుడు ఒక సరుకును తన చేతిలోకి తీసుకొని, అందరికీ సమాన పంపిణీ, లేదా అవసరమైన వారికే పంపిణీని పరిమితం చేయటం లాంటి చర్యలను ప్రభుత్వం తీసుకోవచ్చు. ప్రస్తుతం బియ్యం, గోధుమ, పంచదార, కిరోసిన్ తదితరాలను ఈ చట్టం ద్వారానే ప్రభుత్వాలు ప్రజలకు అందిస్తున్నాయి. చట్టంలో ఉన్న నిబంధనలను వినియోగించుకొని కొన్ని సందర్భాలలో నైనా ప్రభుత్వాలు అక్రమ నిల్వలను వెలికితీయటానికి పూనుకుంటున్నాయి. ఎరువులు, పురుగుమందులు, నకిలీ విత్తన తయారీదారులపై దాడులు చేస్తున్నాయి. ఈ చట్టం రద్దైతే ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న నిత్యావసరాల సరఫరా ప్రమాదంలో పడుతుంది. అక్రమ వ్యాపారులు తమ ఇష్టం వచ్చిన విధంగా సరుకులను నిల్వచేయటం, ధరలు పెంచి అమ్ముకోవటం, నకిలీ,కల్తీ ఉత్పత్తులు విచ్చలవిడిగా సరఫరా కావటానికి అవకాశం ఏర్పడుతుంది.

**మద్దతు ధరలకు మంగళం**

ప్రభుత్వం వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్(సిఎసిపి)ను రద్దుచేసి, దాని స్థానంలో రాజ్యాంగం లోని ఆర్టికల్ 323 బి ప్రకారం అగ్రికల్చరల్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కనీస మద్దతు ధర స్థానంలో మినిమం రిజర్వ్ ప్రైస్‌ను నిర్ణయించాలి. అది వేలానికి ప్రారంభంగా ఉంటుంది. దేశంలో మిగులు ఉన్న ఉత్పత్తులు, అంతర్జాతీయంగా మిగులు ఉన్న ఉత్పత్తులు, దేశంలోనూ, అంతర్జాతీయంగానూ కొరత ఉన్న ఉత్పత్తులకు మద్దతు ధరలను నిర్ణయించే విధానాలను మార్చాలి. కనీస మద్దతు ధరల విధానం పాక్షిక పరిష్కారం మాత్రమేనని, పోటీ తో కూడిన స్థిరమైన జాతీయ మార్కెట్‌ను ఏర్పా టు చేయటంలోనే పరిష్కారం ఉన్నదని చెప్పారు.

వ్యూహపత్రంలో చెప్పిన అంశాలు వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధరలు నిర్ణయించటం, సబ్సిడీలను ఇవ్వటాన్ని ఆపివేయటం, రైతాంగాన్ని తట్టుకోలేని పోటీలోకి నెట్టటానికి దారితీస్తాయి. వ్యవసాయ ఖర్చులు, ధరల నిర్ణయ కమీషన్‌ను రద్దుచేస్తే కనీసమద్దతు ధరల నిర్ణయం ఉండదు. ప్రస్తుతం కనీసమద్దతు ధరలను కమీషన్ నిర్ణయం చేస్తున్నది కాబట్టి ధరలు తగ్గినపుడు మద్దతు ధరలకైనా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రభుత్వం మార్కెట్లోకి ప్రవేశించాలని, ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ఆందోళనలు చేస్తున్నాం. మద్దతు ధరల నిర్ణయ యంత్రాంగాన్నే రద్దుచేస్తే అటువంటి డిమాండ్ చేయటానికి అవకాశం ఉండదు. రైతుకు కనీస మద్దతు ధరల గ్యారంటీ లేకుండాపోతుంది. కనీసమద్దతు ధరల నిర్ణయం

> **"ప్రభుత్వం ఇపుడు కొన్ని వ్యవసాయోత్పత్తులకు సబ్సిడీలను అందిస్తున్నది. ఇకముందు అలా సబ్సిడీలు అందించరు. సరుకు లభ్యత ఆధారంగా చెల్లించాల్సిన సబ్సిడీని నిర్ణయిస్తారు. లభ్యత అంటే దేశీయంగానే కాదు. అంతర్జాతీయంగా ఆ సరుకు లభ్యమౌతున్నా సబ్సిడీ చెల్లింపును తగ్గించటమో, ఆపివేయటమో చేస్తారు. దేశీయంగా మిగులు ఉన్న ఉత్పత్తులకు సబ్సిడీ చెల్లింపును పూర్తిగా రద్దుచేస్తారు."**

కు బదులుగా కనీస ధరపై – మినిమం రిజర్వు ప్రైస్– ఉత్పత్తిని వేలం వేస్తారు. వేలంలో ఎంత ధర వస్తే అదే రైతుకు దక్కుతుంది. ఈ విధానం రైతును పూర్తిగా మార్కెట్‌శక్తుల దయాదాక్షిణ్యాలకు వదిలివేస్తుంది. అనేక సందర్భాలలో మార్కెట్లో ఉన్న వ్యాపారులంతా కుమ్మక్కైరైతు ఉత్పత్తికి మార్కెట్లో ఉన్న ధరలు కూడా దక్కకుండా చేయటాన్ని మార్కెట్ యార్డుల్లో చూస్తున్నాం. ఇక జాతీయస్థాయిలో మార్కెట్లను ఏకీకరణ చేసి, వేలం పాటలు జరిపితే కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలు ఎంతగా కుమ్మక్కౌతాయో, ధరలను ఎంతకు పతనం చేస్తాయో చెప్పలేని పరిస్థితి ఏర్పడుతుంది. ప్రస్తుతం ఈనామ్ విధానం ద్వారా వేలం వేస్తున్న వ్యవసాయోత్పత్తులకు అధికంగా ధరలు వస్తున్న పరిస్థితి లేదు. ఈ పద్ధతి వలన కొన్ని సందర్భాలలో నష్టం వస్తున్నదని రైతులు భావిస్తున్నారు. ఒకవేళ వేలం ప్రారంభించిన తర్వాత కనీసధరకు సరుకును ఎవరూ కొనుగోలు చేయక పోతే రైతు ఏం చేయాలి? వచ్చిన ధరకు సరుకును అమ్ముకొని పోవటం మినహా రైతుకు గత్యంతరం ఉండదు. ఈ రోజు మహారాష్ట్రలో ఉల్లిరైతులకు, రాష్ట్రంలో మిర్చి, వరి రైతులకు మార్కెట్లో ఏ పరిస్థితులు ఎదురౌతున్నాయో, అంతకన్నా తీవ్ర పరిస్థితులను దేశరైతాంగం ఎదుర్కోవాల్సి వస్తుం ది. కాబట్టి 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పటం బూటకం మినహా వాస్తవ రూపం ధరించే అవకాశం లేదు. ఆదాయాలను రెట్టింపు చేయటం మాటలను తమ రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను కప్పిపుచ్చుకోవటానికి వినియోగించుకొంటున్నారు.

**సబ్సిడీలు రద్దైపోతాయి**

ప్రభుత్వం ఇపుడు కొన్ని వ్యవసాయోత్పత్తులకు సబ్సిడీలను అందిస్తున్నది. ఇకముందు అలా సబ్సిడీలు అందించరు. సరుకు లభ్యత ఆధారంగా చెల్లించాల్సిన సబ్సిడీని నిర్ణయిస్తారు. లభ్యత అంటే దేశీయంగానే కాదు. అంతర్జాతీయంగా



ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులు తీసుకుంటున్న పేదలు

ఆ సరుకు లభ్యమౌతున్నా సబ్సిడీ చెల్లింపును తగ్గించటమో, ఆపివేయటమో చేస్తారు. దేశీయంగా మిగులు ఉన్న ఉత్పత్తులకు సబ్సిడీ చెల్లింపును పూర్తిగా రద్దుచేస్తారు. దేశీయంగా కొరతగా ఉండి, అంతర్జాతీయంగా ఆ సరుకు లభిస్తున్నా చెల్లించే సబ్సిడీని తగ్గిస్తారు. దేశీయంగానూ, అంతర్జాతీయంగానూ కొరతగా ఉన్న సరుకుకు కొంత సబ్సిడీ చెల్లించవచ్చు. ఈ పేరుతో రైతాంగాన్ని ఆహారోత్పత్తుల నుండి మళ్ళించి, వాణిజ్య పంటలు పండించేలా ప్రోత్సహించే చర్యలు తీసుకుంటారు. దేశంలో ప్రజల కొనుగోలు శక్తికి మించి ఆహారధాన్యాల ఉత్పత్తి జరుగుతున్నది. అంటే మన మన ప్రజల అవసరాలు తీరక పోయినా, మిగులు ఉన్నట్లే లెక్క. అంతర్జా తీయంగానూ ఎక్కువ ఉత్పత్తి జరుగుతున్నది. కాబట్టి ఆహార ఉత్పత్తులకు ఇచ్చే సబ్సిడీని తక్షణమే తగ్గిస్తారు. వ్యూహపత్రంలో పండ్లు, కూరగాయ లకు డిమాండ్ ఉన్నదని, అధిక ఆదాయం వస్తుందని, రైతులను ఆ వైపుకు మళ్ళించాలని చెప్పారు. కాబట్టి ఇపుడు జాతీయంగా, అంత ర్జాతీయంగా వాటికి కొరత ఉన్నదనే పేరుతో ఆ పంటలకు అధిక సబ్సిడీలు ఇస్తారు. ఈ విధంగా వ్యూహపత్రంలో చెప్పిన అంశాలు వ్యవసాయరంగాన్ని కోలుకోలేని దుస్థితిలోకి నెడతాయి. బహుళజాతి, కార్పొరేట్ సంస్థల దోపిడీకి మన రైతులు సమిధలుగా మారతారు.

**కౌలురైతులు వ్యవసాయ కార్మికుల ఊసేలేదు**

వ్యవసాయరంగంలో 50 శాతంకు పైగా వ్యవసాయ కార్మికులున్నారు. కౌలురైతుల సంఖ్య, వారు సాగుచేసే భూముల విస్తీర్ణం పెరుగుతున్నది. వీరుభయులూ తీవ్రమైన సమస్యలను ఎదుర్కొం టున్నారు. సంక్షోభ భారాలు వీరిపైనే ప్రధానంగా పడుతున్నాయి. నిత్యావసర సరుకుల ధరల పెరు గుదల వీరిపై ఎక్కువ ప్రభావం చూపుతుంది. వ్యవసాయ కార్మికుల పనిరోజులు తగ్గిపో తున్నాయి. ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయకపోవటం, పనిరోజులను కుదించ టంతో వలసలు పెరుగుతున్నాయి. విద్యా, వైద్యం వ్యాపారీకరణ కావటం వీరిపై మోయలేని భారాన్ని వేస్తున్నాయి. నాలుగోవంతు మందికి ఇళ్ళులేవు. మూడొంతుల మంది అప్పుల ఊబిలో ఉన్నారు. కౌలురైతుల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉన్నది. కౌలు గ్యారంటీ లేదు. ప్రతి సంవత్సరం కౌలురేట్లు పెరుగుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల భారం పెరుగుతున్నది. ప్రకృతి వైపరీత్యాల సందర్భాలలో నష్టాన్ని కౌలురైతులు భరిస్తుండగా, ప్రభుత్వం ఇచ్చే పరిహారం భూ యజమానుల చేతుల్లోకి పోతున్నది.

వ్యవసాయ కార్మికులు, కౌలురైతులు కలిసి వ్యవసాయరంగంలో 70 శాతం వరకు ఉంటారు. వీరి సమస్యలను పరిష్కరించకుండా వ్యవసాయ రంగం అభివృద్ధిని సాధిస్తుందా? సాధించే అభివృద్ధి అయినా ఎవరి చేతుల్లోకి పోతుంది? కాబట్టి వ్యవసాయరంగంలో పేద, మధ్యతరగతి రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొం టున్న సమస్యల పరిష్కారానికి కాక, కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలు, బడా వ్యాపారులకు భూములు, లాభాలు కట్టబెట్టటానికి ఉద్దేశించినదే నీతి ఆయోగ్ వ్యూహపత్రం. ఈ విధానాల వల న రైతుల దివాళాలు, ఆత్మహత్యలు పెరుగు తాయి. భూములు కార్పొరేట్ల చేతికి పోతాయి. గ్రామాలలో పనులు లేనివారి సంఖ్య పెరుగుతుంది. వలసలు పెరుగుతాయి. సామాజిక పరిస్థితులు దిగజారతాయి. ఇటువంటి దుష్పరిణామాలకు దారితీసే నీతి ఆయోగ్ వ్యూహపత్రం లోని అంశాల అమలును ప్రతిఘటించటానికి రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు వివిధ సామాజిక తరగతులు సంఘటిత పోరాటాలు చేయాలి. ❊

**మతోన్మాదం**

# హంతకుల స్వేచ్ఛాధామం గుజరాత్



రచయిత
పాత్రికేయుడు

**ఆలీ అహమ్మద్**

*పౌర అధికారులకు అండగా సైన్యాన్ని తరలించినపుడు సైన్యం సకాలంలో సమర్థవంతమైన చర్యలు చేపట్టగలిగితే పౌర కల్లోలాలను అరికట్టగలుగుతుంది. 2002 గుజరాత్ హత్యాకాండ సందర్భంగా సంక్లిష్టమైన మొదటి 24 గంటలు సైన్యానికి ప్రభుత్వం సహకరించలేదు.*

'ద సర్కారీ ముసల్మాన్'–విద్యాధికుడైన ఒక సైనికుని జీవితంలో జ్ఞాపకాలు పేర ఈ గ్రంథం వెలువడింది. ఇది లెఫ్టినెంట్ జనరల్ జమీరుద్దీన్ షా ఆత్మకథ, జ్ఞాపకాల సమాహారం. సాధారణంగా ఇతర మిలిటరీ అధికారుల ఆత్మకథల కంటే ఈగ్రంథానికి ఎక్కువ గుర్తింపు లభించింది. పలువురు మిలిటరీ వారి ఆత్మకథలకు కొద్దిగా భిన్నమైనది షా జీవిత గాథ. ప్రఖ్యాతిగాంచిన ఆలీఘర్ ముస్లిం యూనివర్శిటీ ఉన్నతాధికారిగా ఆయన బాధ్యతలు నిర్వహించటం కూడా అందుకు కారణం కావచ్చు. 'సర్కారీ' ముసల్మాన్ గ్రంథంలో 'ఆపరేషన్ పరాక్రమ్', 'ఆపరేషన్ అమన్' (2002 గుజరాత్ దారుణకాండ)ల గురించి పలు అంశాలను ప్రస్తావించటం ద్వారా కొన్ని ముఖ్యాంశాలను దేశ ప్రజల దృష్టికి తీసుకొని రావటానికి ఆయన ప్రయత్నం కృషి చేశారు.

గుజరాత్ పౌరఅధికారులకు తోడ్పడవలసిందిగా ఆ రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన పిలుపునకు మిలిటరీ 'బీసన్ డివిజన్'కు నేతృత్వం వహిస్తున్న జమీరుద్దీన్ షా సానుకూలంగా స్పందించారు. విశ్వహిందూపరిషత్ అయోధ్యలో 'పూర్ణాహుతి' పేర 2002లో ఒక కార్యక్రమం నిర్వహించింది. ఆ కార్యక్రమంలో పాల్గొని తిరిగివస్తున్న హిందూ కరసేవకులు ప్రయాణిస్తున్న రైలు బోగీని 2002 ఫిబ్రవరి 27న గోద్రా వద్ద తగలబెట్టారు. ఆ ప్రమాదంలో చనిపోయిన వారి మృతదేహాలను, గాయపడ్డవారిని అహ్మదాబాద్‌కు తరలించి విశ్వహిందూపరిషత్, బజరంగ్‌దళ్ సంస్థలకు అప్పగించారు. ఈ దుర్ఘటన గుజరాత్‌లో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. పెద్ద విస్ఫోటనాన్ని సృష్టించింది. నాటి నరేంద్రమోడీ నేతృత్వంలోని (బిజెపి) రాష్ట్ర ప్రభుత్వం మృతదేహాల అప్పగింతకు ఉత్తర్వులు జారీ చేసింది.

సాధారణ పరిస్థితుల్లో ఈ ఉదంతంలో షాకు ఇంతటి ప్రాధాన్యత లభించి ఉండేది కాదు. 2001 డిసెంబర్ 13న భారత పార్లమెంట్‌పై ఉగ్రవాదుల దాడి జరిగింది. ఈ సంఘటన అనంతరం 2002 జనవరి 12న అమెరికా మధ్యవర్తిత్వంలో జరిగిన చర్చల్లో అంగీకృత అంశాల అమల్లో పాక్ జాప్యం చేస్తున్నది. ఆ జాప్యాన్ని అరికట్టేందుకు, పాక్‌పై వత్తిడి పెంచేందుకు 'ఆపరేషన్ పరాక్రమ్' పేర భారత సైన్యం సరిహద్దుల్లో మోహరించి, తన విన్యాసాలను ముమ్మరం చేసింది. షా నేతృత్వంలోని పదాతిదళాన్ని హైదరాబాద్ నుండి తరలించారు. ఆ దళం జోధ్‌పూర్ సమీపంలోని ఎడారుల్లో తన విధులను నిర్వహిస్తోంది. సైనికదాడుల్లో భాగంగా ముందుకు సాగేందుకు ఉత్తర్వుల కోసం వారు ఎదురుచూస్తున్నారు. ఇదే కాలంలో అహమ్మదాబాద్ సైనిక శిబిరంలోని పదాతి దళాన్ని కూడా పాక్ సరిహద్దులకు తరలించారు.

షా తన గ్రంథంలో ఇలా పేర్కొన్నారు. "ఫిబ్రవరి 28న సైనిక ప్రధానాధికారి సుందరరాజన్ పద్మనాభన్ నాతో ఫోన్‌లో మాట్లాడారు. మా పదాతి దళాన్ని వెంటబెట్టుకుని గుజరాత్ వెళ్లి అక్కడ జరుగుతున్న అల్లర్లను అరికట్టాలని ఆదేశించారు. అక్కడ మారణకాండ ఆరంభమయిందని, 'ఆపరేషన్ అమాన్'ను ప్రారంభించి, పౌర అధికారులకు అండగా సైన్యాన్ని నిలిపి పరిస్థితిని చక్కదిద్దాలని కోరారు.

**క్షమించరాని జాప్యం:**

అదే రాత్రి షా నేతృత్వంలోని సైనిక డివిజన్‌ను విమానం ద్వారా అహమ్మదాబాద్‌కు తరలించారు. తీరా అక్కడకు చేరాక తన కర్తవ్య నిర్వహణకు అవసరమైన న్యాయమూర్తులు, వాహనాలు, స్థానిక పోలీసులతో సమన్వయం, గైడ్లు తదితరాలను సమకూర్చటంలో బాధ్యత తీసుకోవలసిన రాష్ట్ర ప్రభుత్వ అధికార యంత్రాంగం జాడే లేదు. గ్రంథంలో పేర్కొన్నట్లు షా వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ముఖ్యమంత్రి మోడీతోపాటు నాటి కేంద్ర రక్షణమంత్రి జార్జి ఫెర్నాండెజ్‌ని కూడా కలుసుకోగలిగారు. అవసరమైన సహకారం అందించి, తమకు విధి నిర్వహణలో తోడ్పడాలని వారికి విజ్ఞప్తి చేశారు. తమ పౌర అధికార యంత్రాంగం ద్వారా అలాంటి సహకారం అందిస్తామని కేంద్ర రక్షణమంత్రి సమక్షంలో మోడీ వాగ్దానం చేశారు. కానీ మరునాటి వరకూ ఆ వాగ్దానం అమలుకు నోచుకోలేదని షా తన పుస్తకంలో పొందుపరిచారు. జార్జి ఫెర్నాండెజ్ మాత్రం విమాన స్థావరంలో ఉన్న సైన్యాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. అంతిమంగా గుజరాత్‌కు చేరుకున్న తర్వాత 34 గంటల నిరీక్షణ అనంతరం అవసరమైన వాహనాలు సమకూరాయి. వాటిని వినియోగించుకుని సైన్యం రంగ ప్రవేశం చేసింది. 48 గంటల్లో మారణకాండను నిలుపుదల చేసింది.

సైనిక చర్య అనంతరం ఆపరేషన్ అమాన్ పై షా రూపొందించిన నివేదికపై సమాచార హక్కు కార్యకర్తలందరూ తమ దృష్టి సారించాల్సి వుంది. పౌర అధికార బృందం సహకారం తమ సైనిక విభాగానికి సకాలంలో అందకపోవటానికి కేవలం పౌర అధికారుల

**"తన నేతృత్వంలోని 3 వేలమంది సైనికులు 2002 మార్చి1న రోజంతా అహమ్మదాబాద్ వైమానిక స్థావరంలో చేతులు ముడుచుకుని కూర్చోవలసివచ్చిందని, హింసాకాండ సాగుతున్న ప్రాంతాలకు వేగంగా సైన్యాన్ని తరలించటంలో జరిగిన జాప్యానికి అక్కడి ప్రభుత్వ వైఫల్యమే కారణమని షా ఆరోపిస్తున్నారు. షా తన రాత పూర్వక ప్రకటనలో వ్యక్తం చేసిన అభిప్రాయానికి పై అంశాలు బలాన్ని చేకూర్చుతున్నాయి."**

వైఫల్యమే కారణం కాదని షా తన పుస్తకంలో స్పష్టం చేశారు. గుజరాత్ లో ఈ సందర్భంగా జరిగిన మారణకాండ ఆ రాష్ట్ర ప్రభుత్వం తరపున, ప్రభుత్వ సహకారంతో ఏకపక్షంగా జరిగిన దారుణ హింసాకాండ మాత్రమేనని షా ఎలాంటి పొరపాటు అవగాహ నలకు తావులేకుండా తన అభిప్రాయాన్ని స్పష్టంగా పాఠకుల ముందుంచారు.

ఒక సైనిక ఉన్నతాధికారి సైతం 'కల్లోల జలాల్లో చేపలు పట్టినట్లు'న్న పరిస్థితులను శ్రద్ధగా గమనిస్తూ, తన విధి నిర్వహణ చేపట్టవలసిన పరిస్థితి రావటం నియంతృత్వ శక్తులు ఇష్టాను సారం బరితెగించిన కాలానికి సంకేతంగా నిలుస్తుంది.

సోహ్రాబుద్దీన్ షేక్ పోలీస్ కస్టడీలోఉండగా హత్యగావించబడ్డాడు. ఈ ఘటనకు, గుజరాత్ హోం మంత్రి హరేన్ పాండ్యన్ హత్యకు, గుజరాత్ మారణకాండనుకప్పిపెట్టడానికి సంబంధం ఉన్నట్లు ఒక సాక్షి లిఖిత పూర్వక ప్రకటన స్పష్టం చేస్తోంది. అక్కడి పరిస్థితులను అతి సన్నిహితంగా పరిశీలిస్తున్న షా ప్రకటనను బట్టి సత్యాన్ని అత్యంత నేర్పుగా కప్పిపుచ్చే ప్రయత్నం జరిగినట్లు అర్థం చేసుకోవచ్చు. మోడీ, అమిత్‌షా (ఆనాటి రాష్ట్ర హోం మంత్రి)తో సన్నిహిత సంబంధాలున్న గుజరాత్‌పోలీస్ అధికారి డి.జి. వంజరా హరేన్ పాండ్యా హత్యకు కుట్రపన్నినట్లు ఒక సాక్షి ప్రమాణపూర్వక ప్రకటన విదితం చేస్తోంది. గుజరాత్ మారణకాండలో రాష్ట్ర ప్రభుత్వం పాత్రపై అనుమానాలు వ్యక్తం చేసినందుకు బిజెపిలో మోడీ ప్రత్యర్థి హరేన్ పాండ్యాను హత్య చేశారు.

సబర్మతి ఎక్స్‌ప్రెస్ అగ్ని ప్రమాదం, అనంతరం జరిగిన దాడులు ఈ రెండు నేరాలను ముస్లింలు ఒక పథకం ప్రకారం చేసిన హింసాకాండగా మితవాదులు అత్యంత విస్తృతంగా, పకడ్బందీగా ప్రచారం చేశారు. అల్ప సంఖ్యాకులైన ముస్లింలనే కుట్రదారులుగా చిత్రించారు. తద్వారా ముస్లింలను ఆత్మరక్షణ స్థితికి నెట్టేయ గలిగారు. రాష్ట్ర ప్రభుత్వంలోని అసమ్మతివాదుల వాదన ఇలావుంది: 2002 ఫిబ్రవరి 27, తన అధికార నివాసంలో జరిగిన సమావేశంలో 'గత 72 గంటలుగా అధిక సంఖ్యాకుల కోపోద్రేకాలవల్ల జరిగిన ఘటనల్లో మీరు జోక్య చేసుకోవద్దు'అని పౌర అధికారులను, పోలీసులను మోడీ ఆదేశించారు. జకియా జాఫ్రి కేసులో సుప్రీం కోర్టు నియమించిన ప్రత్యేక పరిశోధనా బృందం (సిట్) బిజెపి అభిప్రాయాలనే అతి నాజూకుగా తన అర్ధరాత్రి మీటింగ్‌లో వండివార్చింది. (సెల్వాద్ 2018) గుజరాత్ మారణకాండలో మోడీ పాత్రపై సిట్ అంతిమ రిపోర్టులో సైన్యం మోహరింపుపై చేసిన ప్రస్తావనలను శుద్ధ అబద్దాలుగా పేర్కొంటూ వాటితో షా విభేదించారు. గుజరాత్‌కు సైన్యాన్ని రప్పించటంలో, సైన్యాన్ని కల్లోలిత ప్రాంతాలకు తరలించేందుకు ఫిబ్రవరి 28 మధ్యాహ్నం ఒంటి గంటను ఎంచుకోవటం లోను మోడీ చాలా మెళకువగా వ్యవహరించారని సిట్ కితాబునిచ్చింది. ఆ తరువాత 2.30 గంటలకు సైన్యానికి అవసరమైన వాహనాలు సమకూర్చి, సైన్యాన్ని పంపాల్సిన ప్రాంతాల ఎంపిక వంటి సహకారాలు అందించటంలో మోడీ నిర్ణయాలను సిట్ తెగ మెచ్చుకుంది. సైన్యం మోహరింపు మార్చి1న ఉదయం 11 గంటలకు ప్రారంభించినట్లు పొందుపరచిన సిట్ రిపోర్టులో షా తన పుస్తకంలో తప్పుబట్టారు. ఆయా సైనిక బృందాల యుద్ధ డైరీలు, రోజువారీ రికార్డులను పరిశీలిస్తే ఈ అంశంపై సులభంగా అంచనాకు రావచ్చునని షా అభిప్రాయపడ్డారు.

తన నేతృత్వంలోని 3 వేలమంది సైనికులు 2002 మార్చి1న రోజంతా అహమ్మదాబాద్ వైమానిక స్థావరంలో చేతులు ముడుచుకుని కూర్చోవలసివచ్చిందని, హింసాకాండ సాగుతున్న ప్రాంతాలకు వేగంగా సైన్యాన్ని తరలించటంలో జరిగిన జాప్యానికి అక్కడి ప్రభుత్వ వైఫల్యమే కారణమని షా ఆరోపిస్తున్నారు. షా తన రాత పూర్వక ప్రకటనలో వ్యక్తం చేసిన అభిప్రాయానికి పై అంశాలు బలాన్ని చేకూర్చుతున్నాయి. సైనిక బృందం ఫిబ్రవరి 27, మార్చి1వ తేదీల మధ్య 72 గంటలు బలవంతపు నిరీక్షణ అనంతరం మార్చి2న రాష్ట్ర ప్రభుత్వం హడావుడి చర్యలకు ఉపక్రమించింది.

షా బహిర్గతం చేసిన అంశాలు గుజరాత్ మారణకాండ గురించి విస్తృతంగా ప్రచారం చేయబడిన కథనాలపై పలు అనుమానాలకు దారితీశాయి. రాజకీయంగా పరిశీలిస్తే ఒక శక్తి సంపన్నుడైన, తిరుగులేని నాయకుడిగా ఆనాటి ముఖ్యమంత్రి నరేంద్రమోడీపై ఉన్న నమ్మకంపై జాతీయస్థాయిలో నీలి నీడలు ఆవరించాయి. గుజరాత్ కార్యక్రమాన్నంతటినీ అత్యంత సాహసోపేతంగా నడిపిన ధీరుడిగా మోడిని సైద్ధాంతికంగా సమర్థించే హిందూత్వ అనుయాయులు ప్రచారం చేసుకొంటున్నారు. ఈ పరిస్థితిని ఆధారం చేసుకుని మరోసారి ప్రజలు తనకు కేంద్రంలో అధికారాన్ని కట్టబెట్టడం ఖాయమని మోడీ ధీమాగా ఉన్నారు. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న ఈ తరుణంలో మోడీ నిజస్వరూపం బయటపడటం పట్ల బిజెపి ఆందోళన చెందుతున్నది. ఈ ప్రమాదాల నుండి బయటపడేందుకు ప్రజలను నమ్మించగలిగే ఏదో ఒక సైద్ధాంతిక పిలుపుతో ప్రజలముందుకు రావటం బిజెపికి అనివార్యమౌతుంది.

పెద్ద నోట్లరద్దు, ఉపాధి రహిత అభివృద్ధి, రైతాంగం ఆత్మహత్యలు, రూపాయి విలువ పతనం, కాశ్మీరీ యువత రాళ్లు రువ్వటంతో ఎదురయ్యే సవాళ్లు, పాకిస్థాన్, చైనాల పట్ల అవలంబిస్తున్న విదేశాంగ విధానంలోని పిల్లి మొగ్గలు తదితర అంశాల్లో వరుసగా పలు విధానపరమైన వైఫల్యాలు మోడీ ప్రభుత్వంలో బహిర్గతమౌతున్నాయి. వివిధ పరిణామాల వలన జరుగుతున్న విభజనలు తనకు ఉపకరిస్తాయన్న బిజెపి ఆశలను పై వైఫల్యాలు మింగేస్తాయి. రాజకీయ బలాబలాల్లో వస్తున్న మార్పుల ఫలితంగా తమ పార్టీ మరో 50 సంవత్సరాలు అధికారంలో కొనసాగటం ఖాయమని అమిత్‌షా అంచనా లేస్తున్నారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ మరో అడుగు ముందుకేసి దేశ భద్రతను పటిష్టపరచిన బలమైన నాయకత్వం (బహుశా మోడీ) మరో పది సంవత్సరాలు కేంద్రంలో అధికారంలో కొనసాగుతుందన్న ధీమా వ్యక్తం చేశారు. మరోమారు మోడీ ప్రభుత్వం కొనసాగడమంటే భారతీయ బహుళత్వ

**"ప్రభుత్వ సంస్థలు గతంలో ఏనాడూ లేనివిధంగా వత్తిడికి గురిచేయబడ్డాయి. భారత్‌లో పోలీస్ కస్టడీ మరణాల కేసులు పెరుగుతున్నాయి. చట్టవిరుద్ధమైన ఆదేశాలతో పోలీస్ వ్యవస్థను కట్టడిచేస్తున్నట్లు ఈ సందర్భంగా హషింపురా కోర్టు వ్యాఖ్యానించడాన్ని గమనంలో ఉంచుకోవాలి. పాలనా యంత్రాంగం కాషాయ శక్తుల ప్రభావంలో నడుస్తున్న దనేందుకు ఉత్తరప్రదేశ్, సజీవ ఉదాహరణగా పేర్కొనవచ్చు."**

విలువలకు, ప్రజాస్వామ్య, రాజకీయ సంస్కృతికి, సామాజిక రంగంలో సమ్మిళిత పరిస్థితులకు తిరుగులేని ఎదురుదెబ్బ తగలటం ఖాయమని నిరూపితం కావటమే.

**సైన్యం స్పందనలు:** తమ కృషికి అండగా నిలవాలన్న పౌర అధికారుల పిలుపులకు సైన్యం ప్రతిస్పందనలు ఎలా ఉన్నాయన్న అంశాన్ని పున:పరిశీలించేందుకు ఇది సరైన సమయం. ఒక టౌన్ హాల్లో జరిగిన సైనిక సమ్మేళనంలో నాటి రక్షణమంత్రి జార్జి ఫెర్నాండెజ్ పాల్గొన్నారు. సైన్యంతో కలిసి రొట్టెలు భుజించారు (చార్ఖానా). గుజరాత్‌లో సైన్యం సేవల పట్ల తన పాత్ర గురించి పలు ప్రశ్నలకు సమాధానం చెప్పారు. గుజరాత్ హింసాకాండను అరికట్టేందుకు సైనిక సహకారం తీసుకోవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన నచ్చచెప్పగలిగారు. కానీ 'సాంస్కృతిక జాతీయవాదులు' అవిచ్ఛిన్నంగా, ఏకపక్షంగా కొనసాగించిన 72 గంటల రక్తపాతం అనంతరమే ఫెర్నాండెజ్ ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. తద్వారా ఈ 'జాతీయవాదులు' తమ దుర్భలత్వాన్ని, భీరత్వాన్ని నిరూపించుకున్నారు. ఆ 72 గంటల వ్యవధిలో సైన్యం వైమానిక స్థావరంలో ఎదురుచూపులతో కూర్చుండి పోయింది. సామూహిక హత్యాకాండకు, తీవ్ర మైన నేరాలకు, శిక్షల నుండి తప్పించుకు పారిపోయేందుకు ఇదే సమయాన్ని 'అపర జాతీయవాదులు' వినియోగించుకున్నారు.

గుజరాత్ హింసాకాండను అరికట్టడంలో సైన్యం సాహసోపేత చర్యలను తన పుస్తకంలోని ఒక అధ్యాయంలో షా ఆసక్తికరంగా వివరించారు. మిలిటరీ నిబంధనల చట్టం చాప్టర్7లో, పౌర అధికార యంత్రాంగానికి అండగా బాధ్యతలు నిర్వహణ విభాగంలో 15 నుండి 20 పేరాల్లో (ఇండియన్ ఆర్మీ 1987:109) ఇలావుంది. సైన్యం అండతో కూడా పౌర అధికారులు "తీవ్రమైన కల్లోల పరిస్థితులు"ను అదుపు చేయలేని పరిస్థితుల్లో సైనికపాలన (మార్షల్ లా) విధించే అధికారం సైన్యానికుంది. అందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి పొందేందుకు అవకాశం లేనపుడు, ఒక మిలిటరీ కమాండరు శాంతిభద్రతల పరి స్థితిని చక్కదిద్దేందుకు తన అధికారాలను ఉపయోగించుకునేందుకు ఆ చట్టం అవకాశమిస్తోంది. (ఇండియన్ ఆర్మీ-109). షా ఇలా పేర్కొన్నారు: "మార్షల్ లా అమలు పరచాలన్న ఆలోచన నా మనసులో మెదిలింది. నాకప్పగించిన బాధ్యతల పరిధిలో ఆ అంశం లేదు. శాంతిభద్రతలు అదుపు తప్పినపుడు మేజిస్ట్రేట్ లేకున్నా కాల్పులు జరిపే అధికారాన్ని ఆ చట్టం సైన్యానికిచ్చింది. కానీ పై అధికారి నాకప్పగించిన బాధ్యతల పరిధిని దృష్టిలో ఉంచుకొని అందుకు పూనుకోలేకపోయాను.

పోట్లగిత్త కొమ్ములు లంకించుకుని విచక్షణా జ్ఞానంతో దాన్ని అదుపులోకి తేవటం తనవంటి సైనిక జనరల్‌కు అసాధ్యమేమీకాదని షా తన గ్రంథంలో తెలిపారు. తన నేతృత్వంలోని పదాతి దళం లక్ష్యం కల్లోల ప్రాంతాన్ని చుట్టుముట్టడం, పరిస్థితిని అదుపులోకి తీసుకోవటం, శతృవును నాశనం చేయటంగా ఉందని పేర్కొన్నారు. కానీ ఈ సందర్భంగా శతృవులు సామూహికంగా మారణకాండ సాగించి శిక్ష నుండి తప్పించుకున్నారని ప్రత్యేకంగా చెప్పారు. "అహమ్మదాబాద్ వైమానిక కేంద్రంలో వేచివున్న సైనిక పటాలానికి దగ్గరగా తుపాకీ కాల్పుల శబ్దం వినిపిస్తున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోవలసి వచ్చింది"అని షా ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క రోజు ముందుగా తమ బెటాలియన్‌కు నగరంలో ప్రవేశించే అవకాశం ఇచ్చివుంటే మృతుల్లో మూడోవంతు, అంటే కనీసం 300 మందికి పైగా కాపాడి ఉండేవారమని షా మననం చేసుకున్నారు.

దేశవ్యాపితంగా, ప్రాంతీయంగా సైనిక ప్రధాన కేంద్రాలు, ఉప కేంద్రాలున్నాయి. గుజరాత్ సమీపంలోని నాగపూర్‌లో కూడా ఒక ప్రాంతీయ సైనిక కేంద్రం ఉంది. ఈ కేంద్రాలు తమ పరిధిని పౌర అధికారులకు అవసరమైన పుడు తోడు కావలసివుంది. నాగపూర్ బెటాలి యన్ కూడా ఆపరేషన్ పరాక్రమ్‌కు తరలించ బడింది. కానీ సరిహద్దు నుండి గుజరాత్‌కు తరలించబడిన షా బెటాలియన్‌కు సహకరించేం దుకు అవసరమైన కమాండర్స్‌ను, ఆపరేషన్ స్టాఫ్ అధికారులను కేటాయించకపోవటం సైనిక పరంగా జరిగిన లోపం. కల్లోలిత ప్రాంతాల్లోని పరిణామాలను సైన్యంతో సంభాషించగల సివిల్, పోలీస్ అధికారుల సహకారం తగువిధంగా లభించకపోవటం మరో సమస్య.

పశ్చిమ సరిహద్దులోని తన పైఅధికారి, జోధ్‌పూర్ సైనిక బృందం కమాండెంట్ పర్యవేక్షణలో షా పనిచేశారు. ఆవిధంగా సదరన్ కమాండ్ సైనిక కేంద్రం కూడా ఈ వైఫల్యంలో తనవంతు బాధ్యతల నుండి తప్పుకోజాలదు.


ప్రభుత్వ సంస్థలు గతంలో ఏనాడూ లేనివిధంగా వత్తిడికి గురిచేయబడ్డాయి. భారత్‌లో పోలీస్ కస్టడీ మరణాల కేసులు పెరుగుతున్నాయి. "చట్టవిరుద్ధమైన ఆదేశాలతో పోలీస్ వ్యవస్థను కట్టడిచేస్తున్నట్లు ఈ సందర్భంగా హషింపురా కోర్టు వ్యాఖ్యానించడాన్ని గమనంలో ఉంచుకోవాలి. పాలనా యం త్రాంగం కాషాయ శక్తుల ప్రభావంలో నడుస్తున్న దనేందుకు ఉత్తరప్రదేశ్, సజీవ ఉదాహరణగా పేర్కొనవచ్చు. ఎన్నికల కోణంలో ప్రాధాన్యతగల ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి మైనారిటీ వ్యతిరేకత ను నరనరానా జీర్ణించుకున్న ఒక మతాధిపతి (మహంత్)గా మనకు తెలుసు. రామమందిరం సమస్య, జాతీయ పౌర రిజిష్టరు, చేజారుతున్న కాశ్మీరు సమస్య, పాకిస్తాన్ ఉగ్రవాద చర్యలు, ఇలాంటి కీలక రాజకీయ సమస్యలతో దేశం రక్తమోడుతోంది.

షా రాతపూర్వక ప్రకటనల నుండి సైన్యానికి సంబంధించి ముందు జాగ్రత్తపరంగా నేర్చుకోవలసిన గుణపాఠాలేమిటి? సైనిక నిబంధనల చట్టం (ఎం.ఎం.యల్.) చాప్టర్ 7ను అనుసరించి సైన్యానికున్న అధికారాలను, గుజరాత్‌లో షా సైనిక బృందం చొరవను కట్టడి చేసి గందరగోళానికి దారితీసిన కారణాలను స్పష్టంగా పునఃపరిశీలించాలి. ఈ ప్రక్రియను ఎంత త్వరగా చేపడితే అంతగా మేలు జరుగుతుందని దేశ రాజకీయాల్లో నెలకొన్న సైద్ధాంతిక అస్థిరతను బట్టి అర్థమౌతోంది.

**(అనువాదం: వై సిద్ధయ్య)**

అంతర్జాతీయం

# సామ్రాజ్యవాద దాడికి సాకు ఉగ్రవాదం



రచయిత
ప్రముఖ పాత్రికేయుడు

**జాన్ పిల్జర్**

ఒక పరిశోధనాత్మక పత్రికా రచయిత, సినిమా నిర్మాత. జాన్ పిల్జర్ ఆసియా పసిఫిక్ ప్రాంతంపై అమెరికా జరుపుతున్న దాడుల గురించి, ప్రపంచవ్యాప్తంగా అమెరికా ఆధిపత్యం కుంచించుకుపోవడం గురించి మాట్లాడుతూ "కొత్త తరహా ప్రచ్ఛన్న యుద్ధం అమెరికాను ఒంటరి చేసింది, మిగతా ప్రపంచాన్ని భయం గుప్పిట్లో పెట్టింది" అని అన్నారు. ఆయన అమెరికా, ఇంగ్లండ్ వంటి సామ్రాజ్యవాద దేశాల విదేశీ విధానాల విమర్శకుడు. యుద్ధం, వివక్ష, నయా ఉదారవాద విధానాలు, స్థానికులపై జరుగుతున్న అకృత్యాలు, సమాచార మాధ్యమం కార్పొరేటీకరణ కావడం వంటి విషయాలను తీవ్రంగా విమర్శించిన వ్యక్తి. పత్రికా రచయితగా కొనసాగిన తన ఆరు దశాబ్దాల ప్రయాణంలో శక్తివంతమయిన రాజ్యాలు తమ స్వప్రయోజనాల కోసం ప్రపంచాన్ని ఎలా ఉపయోగించుకుంటాయో వివరణాత్మకంగా, నిర్దిష్టంగా గ్రంథస్తం చేశారు. **1962** నుండి యు.కె.లో ఉంటున్న ఈయన 20వ శతాబ్దంలోని అత్యంత ప్రముఖమైన సంఘటనలను గ్రంథస్తం చేశారు. వియత్నాం యుద్ధం, కంబోడియాలో అల్లకల్లోలం, తూర్పు తైమూరులో ఇండోనేషియా జరిపిన మారణకాండ, లాటిన్ అమెరికా, ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లలో అమెరికా జోక్యం, ఇజ్రాయిల్ పాలస్తీనాను ఆక్రమించటం, ప్రపంచబ్యాంకు, మూడో ప్రపంచ దేశాలలో అంతర్జాతీయ ద్రవ్య సంస్థల విధానాల అమలు ప్రభావాలు వాటిలో ఉన్నాయి. పిల్జర్ **1970**లో నిర్మించిన మొట్టమొదటి డాక్యుమెంటరీ 'ప్రశాంతమయిన తిరుగుబాటు' ఇంతకు మున్నెన్నడూ వెలికిరాని వియత్నాంలోని అమెరికా సైన్యంలో తిరుగుబాటును చిత్రీకరించారు. ఒక రాజ్యం మరణం, ది తైమూర్ కాన్స్పిరసీ, ఫ్లైయింగ్ ఫ్లాగ్, వార్మింగ్ ది వరల్డ్ డాక్యుమెంటరీలు విమర్శకుల ప్రశంసలను అందు కున్నాయి. లాటిన్ అమెరికా ఆర్థిక, రాజకీయాలలో అమెరికా జోక్యం చేసుకోవడాన్ని **2007**లో తీసిన ది వార్ ఆన్ డెమోక్రసిలో చిత్రీకరించారు. **1945** నుంచి అమెరికా **50** ప్రభుత్వాలను కూలదోయడానికి ప్రయత్నాలు చేయడాన్ని–అందులో చాల ప్రభుత్వాలు ప్రజాతంత్ర యుతంగా ఎన్నికయినవే– ఆ క్రమంలో **30** దేశాలపై బాంబు దాడులకు తెగబడటం, ఫలితంగా లెక్కలేనన్ని ప్రాణాలు గాలిలో కలిసిపోయాయన్న విషయాలన్నింటినీ చిత్రీకరించారు. **2016**లో నిర్మించిన ది కమింగ్ వార్ ఆన్ చైనాలో అమెరికాకి ప్రస్తుతం చైనా అంటే ఉన్న వ్యతిరేకతను చూపించారు. పిల్జర్ ఎన్నో పురస్కారాలను పొందారు. అందులో ఎమ్మా, బాఫ్తా, సోఫీ ప్రైజ్, సిడ్నీ పీస్ ప్రైజ్ ముఖ్యమైనవి. మంత్లీ రివ్యూలో ప్రచురించిన ఆయన ఇంటర్వ్యూలోని కొన్ని అంశాలను మార్క్సిస్టు పాఠకులకు అందిస్తున్నాం.

– సంపాదకులు

---

ప్ర : ఈ మధ్య కాలంలో మీరు నిర్మించిన డాక్యుమెంటరీ "ది కమింగ్ వార్ ఆన్ చైనా" అమెరికా చైనాతో ఎలా యుద్ధం చేస్తోందో వివరించారు. మీరు ఆ రహస్య యుద్ధం గురించి వివరించగలరా? ఆసియా పసిఫిక్ ప్రాంతమే సామ్రాజ్యవాదం తరువాతి లక్ష్యం అవుతుందని మీరు భావిస్తున్నారా? ఈ జోక్యం పరిణామాలు, పర్యవసానాలు ఎలా ఉండబోతాయి?

**జ :** ఇదొక రహస్య యుద్ధం. ఎందుకంటే ఇక్కడ వాస్తవాల నుండి మన దృష్టి మరల్చ బడుతున్నది. 2010లో అప్పటి అమెరికా కార్య దర్శి హిల్లరీ క్లింటన్, మనీలా వెళ్ళి అప్పుడు కొత్తగా ఎన్నికయిన ఫిలిప్పీన్ దేశాధ్యక్షుడు బెనిగ్నో అక్వినోను కలిసి చైనా అధీనంలో ఉన్న స్ప్రార్లీ దీవులు తమవని ప్రకటించమని, అయిదు అమెరికా సైనిక స్థావరాలు అక్కడ ఉండేందుకు అనుమతించాలని ఒప్పించి వచ్చారు. మనీలాకి చైనాతో సత్సంబంధాలు ఉండేవి. మౌలిక వసతుల నిర్మాణం కోసం సులువైన పద్ధతిలో తీర్చే విధంగా ఇచ్చే అప్పు కోసం చైనాతో సంప్రదింపులు జరుగుతున్నాయి. అమెరికా చెప్పినట్లే చైనా తన స్ప్రార్లీ దీవులలో తిష్ట వేసిందని హేగ్‌లో వున్న అంతర్జాతీయ న్యాయస్థానంలో అక్వినో వాజ్యం వేసింది. చైనాకి స్ప్రార్లీ దీవుల పై ఏ విధమైన హక్కులు లేవని న్యాయస్థానం తీర్పునిచ్చింది. సహజంగానే చైనా ఈ తీర్పును పూర్తిగా తిరస్కరిం చింది. ఇది చిన్న సంఘటనే. కానీ చైనాను దురాక్రమణ దారునిగా ప్రపంచం ముందు నిలబెట్టడానికి బాగా పనికి వచ్చింది. అమెరికా చేసిన ఈ ప్రచారానికి కారణం, అమెరికా యొక్క జాతీయ అభద్రతా భావం, సైన్యం, ప్రసార మాధ్యమాలు అమెరికా ఇక ఎంతమాత్రం శక్తివంతమయినదని భావించడం లేదనే భావన. ఆ తరువాతి సంవత్సరం 2011లో ఒబామా "చైనా ప్రమాదం" గురించి చెప్పాడు అంటూ పిలుపునిచ్చారు. దానితో అమెరికా ప్రధాన సముద్ర, వాయు సైన్యాలు ఆసియా పసిఫిక్ ప్రాంతానికి బదలాయించబడ్డాయి. రెండో ప్రపంచ యుద్ధం తరువాత ఇంత పెద్ద మొత్తంలో

సైనికులను తరలించటం ఇంకెప్పుడూ జరగలేదు. ఒక్క తరంలోనే ఆర్థిక ప్రగతిని అత్యంత ఉచ్ఛ స్థితికి తీసుకెళ్లిన చైనా వాషింగ్టన్‌కు కొత్త శత్రువు, లేదా కొత్తగా రూపొం దించబడిన శత్రువు అన్నమాట. చైనా చుట్టూ అమెరికా సైనిక స్థావరాలను ఏర్పరచు కుంది. ఆస్ట్రేలియా మొదలుకుని పసిఫిక్ ద్వీపాలలో, జపాన్, కొరియాలో యురేషియా అంతటా ఈ సైనిక స్థావరాలు ఉన్నాయి. అవిప్పుడు ఆధునీకరించ బడుతున్నాయి, శక్తి వంతం చేయబడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 800 అమెరికా సైనిక స్థావరాలలో సగానికి పైన చైనా చుట్టూనే 'ఓ ఉచ్చులాగా బిగించబడి ఉన్నాయి' అని ఆ దేశ అధికారి ఒకరు వివరిం చారు. "స్వేచ్ఛగా నౌకాయానం చేసే హక్కు"ను సాకుగా చూపి ఇదంతా జరుగుతున్నది. అమెరి కా నౌకలు చైనా జలాలలో తిరుగుతుంటాయి. చైనా భూభాగం మీద అమెరికా డ్రోన్లు విహరి స్తుంటాయి. జపాన్‌లోని ఒకినావా ద్వీపం ఒక అమెరికా సైనిక స్థావరం. ఇందులో సైన్యం చైనాపై దాడికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది. దక్షిణ కొరియాలోని జేజూ ద్వీపంలోని ఏజిస్ తరగతి క్షిపణులు 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న షాంఘైపై ఎక్కు పెట్టబడి ఉంటాయి. అందువలన నిరంతరంగా రెచ్చగొట్టడం జరుగు తూనే ఉంటుంది. అక్టోబర్ 3న మొట్టమొదటి సారిగా అమెరికా చైనాకు అత్యంత సన్నిహిత మిత్రదేశమైన రష్యాని బాహాటంగా బెదిరిం చింది. రష్యాతో చైనాకి పరస్పర రక్షణ ఒప్పం దం ఉంది. ప్రసార మాధ్యమాలకు వీటిపై ఆసక్తి లేదు. ఈ మధ్యే చైనా తన అణు ఆయుధాలను ఆధునీకరిస్తున్నది.

ప్ర : **నోమ్ చోమ్‌స్కీ లాంటి వారు అమెరి కన్ సామ్రాజ్యం పతనం అవుతున్నదని అంటు న్నారు. దానిని మీరు అంగీకరిస్తారా? ఈ మధ్య కాలంలో ఉత్తరకొరియాతో అమెరికా సైనిక ఒప్పందం చేసుకునే ప్రయత్నం చేసింది కదా! అంతకు ముందు క్యూబాతో దౌత్య సంబంధాలు మెరుగుపరుచుకొనే ప్రయత్నం చేసింది. ఈ అంశాలు ఏం తెలియచేస్తున్నాయి? ప్రపంచం మరింత వైవిధ్య భరితం కానుందా?**

**జ :** అమెరికన్ సామ్రాజ్యం ఒక శక్తిగా పతనమవుతూ ఉ ండవచ్చు. ప్రపంచాన్ని శాసిం చే శక్తిగా ఇప్పుడు అమెరికాకు లేకపోవచ్చు ప్రపంచ ఆర్థిక వ్యవస్థని దాని డాలర్లతో నింప లేకపోవచ్చు. కానీ అమెరికా సైనికీకరణ మున్నెన్నడూ లేనంత భయంకరంగా ఉంది. ఒక కొత్త తరహా ప్రచ్ఛన్న యుద్ధానికి తెరలేస్తున్నది. ఇది ప్రపంచాన్ని అపాయంలోకి నెట్టబోతున్నది. 21వ శతాబ్దం మొదటిలో అమెరికా ఫాసిస్ట్ యుగం పూర్వ స్థానానికి చేరుకోబోతున్నట్టు నార్మన్ మైలర్ (అమెరికన్ జర్నలిస్ట్, నవలా కారుడు) రాశారు. మిగిలిన వారు మనం ఇప్పటికే చేరుకున్నామని రాశారు.

ప్ర : **"మార్పును మేము నమ్ముతాం" అన్న ఒబామాగారి నినాదం ప్రజా సంబంధాలలో అతి పెద్ద విజయం అని మీరన్నారు. 9/11 హత్యలకు వ్యతిరేకంగా ఒబామా ప్రపంచ వ్యాప్తంగా చేసిన ప్రచారం అత్యంత ఖరీదయిన దనీ మీరే అన్నారు. ఒబామా పట్ల మీరెందు కంత కఠినంగా ఉన్నారు? ఒబామాకి నోబెల్ శాంతి పురస్కారం కూడా వచ్చింది కదా! అమెరికా అధ్యక్షునిగా డోనాల్డ్ ట్రంప్ గురించి మీ అభిప్రాయం ఏమిటి ?**

**జ :** నేను ఒబామా పట్ల 'కఠినం'గా లేను. నిజానికి తరచుగా ప్రచార మాధ్యమాలలో చూపించబడే రూపానికి భిన్నంగా ఒబామాయే మానవజాతి పట్ల కఠినంగా ఉన్నారు. ఒక్క సమస్యా పరిష్కరించకుండా ఏడేళ్లు నిరంత రాయంగా యుద్ధంచేసిన వ్యక్తి ఒబామా. అతను అమెరికా అధ్యక్షులందరిలో అత్యంత హింసా త్మకమైన వ్యక్తి.



**సిరియాపై అమెరికా వైమానిక దాడి**

అధ్యక్షునిగా అతని చివరి సంవత్సరమయిన 2016లో విదేశీ సంబంధాల పరిషత్తు లెక్క ప్రకారం అతను 26,171 బాబులు కురిపించాడు. అంటేరోజులోని ప్రతి గంటకి 3 బాంబులన్నమాట. అది కూడా పౌరులపైనే. ఒబామా మారణహోమానికి రూపొందించుకున్న కొత్త బాంబింగ్ పద్ధతి, డ్రోన్లద్వారా బాంబులు వేయడం. 'న్యాయ హద్దులు దాటి చంపవలసిన' కొన్ని పేర్లను ప్రతి మంగళవారం అయన ఎంపిక చేసుకొనే వారని న్యూయార్క్ టైమ్స్ పత్రిక రిపోర్ట్ చేసింది. ప్రపంచ వ్యాప్తంగా, ముఖ్యంగా ఆఫ్రికాలో అమెరికా ప్రత్యేక సైనిక కార్యక్రమాలను ఆయన పెంచారు. ఆయన బ్రిటన్, ఫ్రాన్స్‌తోనూ అమెరికా విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి హిల్లరీ క్లింటన్‌తో కలిసి ఆధునిక లిబియాను సర్వనాశనం చేశారు. ఎప్పటిలాగే లిబియా నాయకుడుఅమాయకులను మట్టుపెడుతున్నాడన్న పేరుమీదే ఇదంతా చేశాడు. అందువలన ఇంతకు ముందు అక్కడ మధ్యేవాదులుగా వున్న వారు కూడా ఇప్పుడు ఐసిస్‌లో చేరారు. ఆఫ్రికా నుంచి యూరప్‌కి వలసలు పెరిగే పరిస్థితి ఏర్పడింది. ఉక్రెయిన్‌లో ప్రజాతంత్ర యుతంగా ఎన్నికయిన అధ్యక్షుడిని కూలదోసి ఫాసిస్టుల మద్దతు ఉన్న పాలకులకు ప్రభుత్వాన్ని అప్పగిం చారు- అంటే రష్యాని ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టడమే.

ప్ర : **మీరు గత యాభై సంవత్సరాలుగా యుద్ధ సమాచారం రిపోర్ట్ చేసే పనిలోనే ఉన్నారు. వియత్నాం, ఇరాక్, ఆఫ్ఘన్ యుద్ధం వంటి పెద్ద పెద్ద యుద్ధాలను గురించిన సమాచారం అందించారు. ఇప్పుడు ఆయుధాలను కొనుగోలు చేయడం ఆర్థికవ్యవస్థలో ఒక భాగంగా మారిం ది. ఆయుధాలను అమ్మే కంపె నీల ప్రాముఖ్యత కూడా పెరిగింది. యుద్ధం యొక్క రాజకీయ అర్థశాస్త్రం సంగతేమిటి?**

**జ :** ఇప్పుడు యుద్ధం యొక్క రాజకీయ అర్థశాస్త్రం అంటే అమెరికా రాజకీయ అర్థశాస్త్ర మే. అమెరికా తన పౌరులలో 8 కోట్ల మందికి ఆరోగ్యాన్ని అందించడానికి ప్రాధాన్యతను ఇవ్వ డం లేదు. కాని బడ్జెట్‌లో 60 శాతం యుద్ధ సన్నాహాలకు వినియోగిస్తున్నది. భారత దేశానికి కూడా యుద్ధ ఆర్థిక వ్యవస్థ ఉన్నది. ప్రపంచం లోనే అత్యధికంగా ఆయుధీకరణకు ఖర్చు చేస్తున్న దేశాల సరసన భారతదేశం కూడా చేరింది.

బడ్జెట్లో ఆయుధాలకు ఫ్రాన్స్ కన్నా ఎక్కువ ఖర్చు చేస్తున్నారు. దేశంలో సగం బడ్జెట్ ఆయుధాల కొనుగోలుకు వినియోగిస్తున్నారు. నేను మొదటి సారి భారతదేశానికి వెళ్ళినప్పుడు సైనిక స్థావ రాలు ఉన్నా దేశంలో ఆరోగ్య వంతమైన ప్రజ లు ఉండడాన్ని గమనించాను. ఇప్పుడు తళుకు బెళుకు జిలుగుల మధ్య ప్రపంచంలో ఎక్కడా లేనంత ఎక్కువమంది ఆకలితో అలమటిస్తున్న బాలలను భారత దేశంలో చూస్తున్నాను.

**ప్ర : అమెరికా తీవ్రవాదంపై యుద్ధం చేయడాన్ని కపటత్వం అని, రెండు నాల్కల ధోరణి అని మీరు విమర్శించారు. అలా ఎందు కన్నారు? మరి తీవ్రవాదాన్ని ఎలా అణచాలి? ఆధునిక జీవనానికి తీవ్రవాదం వలన ఎంత వరకు ముప్పు ఉంది?**

**జ :** తీవ్రవాదానికి కారణం రాజ్యాలే. సౌదీ అరేబియా చేస్తున్న తీవ్రవాద ఆగడాలకు ఇప్పుడు ఎమెన్ బలవుతున్నది. అక్కడ అనేక తీవ్రవాద సంస్థలను సౌదీ అరేబియా పెంచి పోషిస్తున్నది. 2001లో అమెరికా అధ్యక్షుడు జార్జి డబ్ల్యూ బుష్ మొదలుపెట్టిన తీవ్రవాదంపై యుద్ధం నిజంగా ఒక "తీవ్రవాదం యుద్ధమే". ఇందులో లక్షలాది మంది, ముఖ్యంగా ముస్లింలు ఆహుతి అయిపోయారు. అమెరికా, బ్రిటన్ లాంటి శక్తివంతమయిన దేశాలు తీవ్రవాదాన్ని ఒక "వ్యూహాత్మక " ఆయుధంగా వాడుతున్నారు. లిబియా, సిరియాలలో జిహాదీలకు మద్దతు నివ్వడం ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. నిర్ధారణ సుస్పష్టం – ప్రభుత్వాలు తీవ్రవాదాన్ని ప్రోత్సహించదానికి స్వస్తి చెప్పాలి. అప్పుడే ఈ దేశాలలోపారే రక్తపుటేరులు ఆగిపోతాయి.

**ప్ర : అమెరికాలో మంచి తీవ్రవాదులు చెడ్డ తీవ్రవాదులు ఉన్నారని మీరే అన్నారు ఎవరు మంచి తీవ్రవాదులు? ఎవరు చెడ్డ తీవ్రవాదులు?**

**జ :** మంచి, చెడ్డ అనే బిరుదులు మార్పు లకు గురవుతూ ఉంటాయి. ప్రస్తుతానికి సౌదీలు మంచి తీవ్రవాదులు. నిజానికి వారిని తీవ్ర వాదులుగానే పిలవడం లేదు. అత్యంత చెడ్డ తీవ్రవాదులు – ఆల్ ఖైదాలు – షియాలకు వ్యతిరేకంగా అమెరికా తరపున పోరాడు తున్నందు వలన ఇప్పుడు మంచి తీవ్రవాదుల య్యారు. ఇక కుర్దులు ఎప్పుడూ మంచి చెడు కలగలిసిన తీవ్రవాదులే. ఇరాక్‌లో కుర్దులు మంచివారు, టర్కీలో చెడ్డవారు. అందువలన ఈ బిరుదులన్నీ వారు అమెరికా వైపు ఉన్నారా లేరా అన్నదానిపై ఆధారపడి ఉంటాయి.

**ప్ర : అమెరికా 2017 డిసెంబర్ 9న జెరూసలేంని ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తిం చడం తోటే పాలస్తీనియన్లలో భయం బాధ ముప్పిరిగొన్నాయి. మీరన్నట్టు వారు వారి దేశం లోనే శరణార్థులయ్యారు. పాలస్తీనా మీద దాడి ఆధునిక చరిత్రలో సుదీర్ఘమయిన దాడి అనిమీరు అన్నారు. పాలస్తీనా సమస్యను వివరించగలరా? అమెరికాకు ఈ ప్రాంతంలో ఉన్న భౌగోళిక, వ్యూహాత్మక ప్రయోజనాలు ఏమిటి? పాలస్తీనాకు న్యాయం జరగాలంటే ఎం చేయాలి ?**

**జ :** మధ్య ప్రాచ్య ప్రాంతాన్ని యుద్ధాలతో అస్థిరంగా, అనిశ్చితంగా, చీలికలు పేలికలుగా ఉంచడం అమెరికా ముఖ్య ఉద్దేశం. బ్రిటన్ ఈ ప్రాంతాన్ని ఈ పద్ధతిలోనే తన ఆధీనంలో వుంచుకోగలిగిందని అమెరికా జాతీయ రక్షణ సలహాదారుడు జాన్ బోల్టాన్ సంతోషంగా చెప్పాడు. ఈ పద్ధతికి కేంద్రమే ఇజ్రాయిల్ 'విధానం'. వలసవాదం ప్రపంచం అంతా అంతం అవుతున్న తరుణంలో కాల దోషం పట్టిన సామ్రాజ్యవాదాన్ని మధ్యప్రాచ్యం పై రుద్దడం అంటే ఇదే. రచయిత ఇళ్లన్ పాపే ఈ మధ్యే ప్రచురించిన తన పుస్తకంలో వ్రాసి నట్టు ఇజ్రాయిల్ ఆ ప్రాంత స్థానిక ప్రజలయిన పాలస్తీనియన్లకు జైలుగా మార్చబడింది. పశ్చిమ దేశాల కపటత్వం అంతా ఇజ్రాయిల్‌లోనే ఉంది. సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అస్సాద్ ఒక భూతంగా చిత్రించబడుతున్నాడు. అదే ఇజ్రాయిల్ అధ్యక్షుడు బెంజమిన్ నెతన్యాహు, అంతకంటే భయంకరమయిన భూతమయినా పాలస్తీనియన్లను, కొంత మేరకు అమెరికా కాంగ్రెస్‌ని, శ్వేతాసౌధాన్ని, బ్రిటిష్ పార్లమెంటు లోని రెండు సభలను నియంత్రణలో పెట్టడానికి ఉపయోగపడడం వలన అతనికి ఈ బిరుదు నుండి మినహాయింపు దొరికింది. ఈ మధ్య బ్రిటిష్ లేబర్ పార్టీ నాయకుడు జెరిమి కార్బిన్, ప్రధాని అయ్యే అవకాశాలు ఉన్నవాడిని అకారణంగా యూదులకు వ్యతిరేకి అని పెద్ద ఎత్తున ప్రచారం చేయడంతో ఇది బయట పడింది. ఎన్నో ఏళ్లుగా పాలస్తీనా హక్కుల గురించి మాట్లాడుతున్న కార్బిన్ వారి ఒత్తిడులకు లొంగి జియోనిజం అర్థాన్ని మార్చడానికి అంగీ కరించారు. ఫలితంగా ఇజ్రాయిల్ ఒక జాతి వివక్ష చూపే రాజ్యం కాకుండా పోయింది. నేనిప్పుడు రాస్తున్న సమయంలోనే ఇజ్రాయిల్ సైనికులు గాజా ప్రాంతంలో పసి పిల్లలతో సహా అనేక మందిని నరుకుతూనే ఉన్నారు. 2018 మార్చి నుండి 77 మంది పాలస్తీనియన్ల కాళ్ళు తీసేయవలసి వచ్చింది. ఇందులో 14 మంది పిల్లలు కూడా ఉన్నారు. 12 మంది వెన్నెముకలో తుపాకి గుళ్ళు దూరిన కారణంగా పక్షవాతానికి గురయ్యారు. ఒక్క ఇజ్రాయిల్ వ్యక్తి కూడా గాయపడలేదు.

**ప్ర : మనం ఇప్పుడు ప్రపంచీకరణ అంటు న్నది నిజానికి నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానం. 1960లలో అనుకుంటాను, మీరు మొదటిసారిగా ఇండోనేషియాలో జరుగుతున్న వ్యవస్థాగత సర్దుబాట్లు –స్ట్రక్చరల్ అడ్జస్ట్‌మెంట్స్ –కార్యక్రమం బండారాన్ని బయట పెట్టారు. మీరు ఇప్పుడు అంతర్జాతీయ పెట్టుబడి విదేశీ మార్కెట్లలో క్రూరంగా చొరబడడానికి, పాత రోజుల్లో తుపాకులు ఉన్న పడవలతో ప్రపంచ దేశాలలో చొరబడడానికి మధ్య పెద్దగా తేడా ఏమి లేదంటారు. ఒక పత్రికా రచయితగా, రాజ్యాలలో అమలు జరిగే విధానాలు క్షుణ్ణంగా తెలిసిన వారిగా నయా ఉదారవాద ఆర్థిక విధానాల పుట్టు పూర్వోత్తరాలు చెప్పగలరా? ఈ రోజు అవెలా పనిచేస్తున్నాయి?**

**జ :** నయా ఉదారవాదం ద్రవ్య విధానం–మోనిటరిజం– పొడిగింపు మాత్రమే. రెండూ పెట్టుబడిదారీ విధానం యొక్క తీవ్ర రూపాలే. పశ్చిమ దేశాలైన బ్రిటన్‌లో మార్గరెట్ థాచర్, అమెరికాలో రోనాల్డ్ రీగన్, యూరప్‌లో వారి సమకాలికులు ఈ విధానాలను అవలంభించారు. ప్రపంచంలో 'మూడింట రెండొంతుల సమాజం' ఈ విధానాలు అమలు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ విధానంలో పై నున్న మూడో వంతు ప్రజలు ధనికులవుతారు, కనీస పన్నులు కడతారు, లేదా అసలు కట్టక పోవచ్చు కూడా. వారి కిందున్న మూడో వంతు 'ఆశ' కలిగిన వారు అయి ఉంటారు. అందులో కొంతమంది 'క్రూరమైన' ఈ పోటీ ప్రపంచంలో విజయాలు సాధిస్తారు. మిగిలినవాళ్లు అప్పుల ఊబిలో కూరుకు పోతుంటారు. అంతకంటే కిందున్న మూడో వంతు, వారి అణకువకి ప్రతిఫలంగా నిత్య దరిద్రంలో మునిగి తేలుతుంటారు. రాజ్యానికి ప్రజలకు మధ్య నున్న సంబంధం మంచితనం నుండి క్రూరత్వానికి మారిపోతుంది. అమెరికా లోని కార్పొరేట్ కంపెనీలచే తర్ఫీదు పొందిన ఒక కొత్త తరగతి వారి సరికొత్త "సంస్కృతి", "పదాల"తో, సామాజిక ప్రజాతంత్ర వ్యవస్థ కార్పొరేట్ల ఆధిపత్యంలోకి మార్చడాన్ని పర్యవేక్షి స్తారు. సమాచార మాధ్యమంలో ప్రజల "వాదనలు" పూర్తిగా నియంత్రించ బడతాయి. "వర్గ విధానాల" ఆధారంగా వచ్చిన "సమస్యలను" "ప్రాంతీయ తత్వాలు పక్కకు నెట్టేస్తాయి. ఉత్తుత్తి రాజకీయ భూతాలు (రష్యా నాయకత్వం లో చైనా నడుస్తున్నదని ప్రచారంలో పెట్టిన లాంటివి) సృష్టించబడి "అవసరమైన శత్రువులు" తయారు చేయబడతారు.

**ప్ర : మానవజాతి భవితవ్యం ఎవరి అధీనంలో ఉంటుంది, ఎవరు పునర్నిర్మిస్తారు? శక్తివంతమయిన దేశాలు, బడా కార్పొరేట్లు, బూర్జువాజి చట్టాలు చేయడంలోను ప్రపంచ నియమాలు రూపొందించడంలోనూ ఎలా ప్రముఖ పాత్ర వహిస్తారో అనే అంశాలు మీ రచనలలో ఉంటాయి. అయినా ఈ శక్తివంత మయిన శక్తులను ఎదుర్కొన్న కథనాలు కూడా ఎంతో ఉత్తేజం కలిగించే విధంగా మీరు రాస్తుం టారు. ఒక మంచి ప్రపంచం ఏర్పడుతుందని మీరు ఆశిస్తున్నారా? మీరు ఆశావాదులా?**

**జ :** ఎన్నోదేశాలలో, ముఖ్యంగా భారత దేశంలో ఉత్తేజం కలిగించే శక్తులు ఎదురొడ్డి నిలుస్తున్నాయి. నేను మొదటి సారిగా భారతదేశం వచ్చిన 1960 నుండి ఇక్కడి సాధారణ ప్రజానీకం పట్టుదలను చూసి చకితుడిని అవుతూనే ఉన్నాను. ముఖ్యంగా రైతులు న్యాయం కోసం తమ జీవితాలను కూడా పణంగా పెట్టి చేస్తున్న పోరాటాలు ఎంతో వుత్తేజం కలిగిస్తున్నాయి. ఈ మధ్య (సెప్టెంబర్ 23 నుండి అక్టోబర్ 2 వరకు) 50000 మంది రైతులు ఢిల్లీ వరకు చేసిన సుదీర్ఘ పాదయాత్ర ఇందుకు ఉదాహరణ. క్రమశిక్షణతో, రాజకీయ లక్ష్యంతో, సమర్ధవంతంగా పాదయాత్ర పూర్తి చేసుకుని, నిరసన అంటే ట్రంప్ పార్లమెంటు సభ్యులకు సంతకం చేసి ఇచ్చిన ఉత్తుత్తి పిటిషన్ లాంటిదని ఎగతాళి చేయడానికి అనుకునే పశ్చిమదేశాలలో ఉన్న మాలాంటి వారికి ఒక కనువిప్పు. మహాత్ముని జన్మదినం నాడు పోలీసులు దాడి చేయడానికి ప్రభుత్వం అనుమతి నివ్వగానే వారు ప్రతిఘటించారు. ఆ రాజకీయ స్ఫూర్తి, వారి ఉద్యమాలను ఏ దారిలో నడిపి స్తుందో అన్నది బహుశా నేటి ప్రపంచంలో విప్లవాలను స్పష్టంగా గుర్తుకు తెస్తున్న అంశం. నయా ఉదారవాద విధానాలు, "పట్టణీకరణ" పేరుతో నాశనం అవుతున్న వ్యవసాయం, దానికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న ప్రజల ప్రతినిధులు వారు మానవుల భూములను కాజేసి వాటిని లాభాలను తెచ్చిపెట్టే సరుకులుగా మారుస్తున్న విధానాలకు వారు వ్యతిరేకం. భారత ప్రభుత్వాలు 3,00,000 మంది రైతుల ఆత్మహత్యలను పరిగణనలోనికి తీసుకోలేదన్నది ఒక చారిత్రక దౌర్భాగ్యం. ఒక విధంగా చెప్పాలంటే భారతదేశ రైతు మనం దరి ప్రతినిధి. వందనా శివ మనలను హెచ్చరిం చినట్టు భూమికి రక్షణ అయిన విత్తనాలను తయారు చేసుకోవటానికి స్వేచ్ఛ లేకుంటే, మోన్‌శాంటోలాంటి వారికి ప్రపంచం లోని గ్రామీణ ప్రాంతాలన్నీ ధారా దత్తం చేస్తే, పర్యావరణ విధ్వంసం జరిగి మానవాళి మను గడే ప్రశ్నార్ధకమవుతుంది. అయితే మనుషులు శిలా విగ్రహాలు కాదు. పర్సి బైస్షే షెల్లీ రాసినట్టు " వారు సింహంలా నిద్రలేచి



ఢిల్లీలో రైతు ప్రదర్శన

జూలు విదిలిస్తారు". ఆ నిరసన కనిపించనంత సేపు అది మంచు క్రిందఉండే విత్తనం లాంటిదే. ఇప్పు దున్నంత ప్రజా చైతన్యాన్ని, అదేసమయంలో గందర గోళాన్ని నేను ముందెన్నడూ చూడలేదు. పశ్చిమ దేశాలలో జనం ఈ విధానాలకు వ్యతి రేకంగా ఉన్నా, సమ్మతిస్తున్న ట్టు కనిపిస్తున్నది. వారు ఈ విధానాలను వ్యతిరేకిస్తున్నా ఎదిరించ టానికి సందేహిస్తున్నారు. అది మారుతుంది. ఎప్పటికీ మారనిది శక్తివంతులైన వారు సామాన్య ప్రజల శక్తిని చూసి భయపడడమే.

**ప్ర : మీరిప్పుడు అనుసరిస్తున్న జర్నలిజం సవాళ్లతో కూడుకున్నది, కఠినమయినది. మీ పత్రాలు, వ్యాసాలు ఇతర విధానాల ద్వారా మీరు ప్రపంచంలోనే అత్యంత శక్తివంతులను ప్రశ్నిస్తూ వస్తున్నారు. అలా మీ ఆలోచనలను మలిచి, నిరసనను తెలియచేయాలని ప్రేరేపిం చిన వేవి? మీ మీద ప్రభావం చూపినవి, మిమ్మలను ఉత్తేజితులను చేసినవి ఏవి ?**

**జ :** ఈ రోజుల్లో అత్యంత సుస్థిరమైన ప్రసార మాధ్యమాలు అధికారానికి దాసోహం అంటున్నవే. అవి సాధారణ ప్రజలకు ప్రాతి నిధ్యం వహించవు. నిజమైన ప్రజల గొంతుకలు వినిపించేవి అసమ్మతి తెలియచేసేవే. సెన్సార్ చేసే వాళ్ళకి నచ్చనివి ఇవి. అవెంత చిన్నవైనా ప్రపంచ నలుమూలలలో సమాజాలలో జరుగు తున్న పోరాటాలే నా ఆలోచనలను ప్రభావితం చేస్తాయి. ఈ ప్రభావం నామీద నా చిన్నతనం లోనే మొదలయిందనుకుంటాను. మా అమ్మ 'మనం సదా జీవన పోరాటం చేస్తున్న వారి తరపునే నిలబడి ఉంటాం' అని నా చిన్నతనం లోనే నాతో అంటూ ఉండేది. అలా మొదలయిం దన్నమాట.

**అనువాదం: కె ఉషారాణి**

## అభిప్రాయం

## రైతుల ఆత్మహత్యలపై ప్రత్యేక సంచిక తేవాలి

మనదేశంలో రైతుల ఆత్మహత్యలకు సంబంధించి సమగ్ర నివేదికలు లేవు పాలకులు, నూతన ఆర్థిక విధానాలు మొదలుపెట్టినప్పటి నుండి వ్యవసాయం క్షీణించింది. రైతుల ఆత్మహత్యల పరంపర కొనసాగుచున్నది. తమ సమస్యల పరిష్కారం కొరకు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తునే వున్నారు. "అఖిలభారత కిసాన్ సభ ఆధ్వర్యంలో 5-3-2018 న యాభై వేల ఎండిన గళాలతో లక్షనెత్తురోడిన పాదాలతో రైతుల, ఆదివాసీల పాదయాత్ర నాసిక్‌లో మొదలై 12-3-2018 న మహారాష్ట్ర అసెంబ్లీ దగ్గర ముగిసింది. స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలన్నదే ప్రధాన డిమాండ్. నవంబర్ 29న లక్షమందితో ఢిల్లీలో జరిగిన కిసాన్ మార్చ్ ఒక చారిత్రక పోరాటం. రైతులఆత్మహత్యలు-ఉద్యమాలపై ప్రత్యేక సంచిక తీసుకొని రావలసిందిగా కోరుచున్నాను.

**- తుంపాల శ్రీరామమూర్తి,**

**గాజువాక, విశాఖ**

# పోషకాహార లోపంతో కుంగుతున్న 'బాల భారతం'

**రచయితలు సన్నీజోన్, భీమేశ్వరరెడ్డి, మయాంక్ అగర్వాల్**
లెక్చరర్లు, బిట్స్ పిలాని హైదరాబాద్.

**తా**జాగా వెలువడిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నివేదిక-4 ప్రకారం 2005-06 నుండి 2015-16 మధ్య దశాబ్దంలో, భారత దేశం లోని బాలల పోషకాహార లోపం5 సం॥లలోపు బాలల్లో గతంలో కన్నా మూడింట ఒకవంతు పెరిగింది. సామాజికంగా- ఆర్థికంగా బాలల్లో పోషకాహార లోపం కొనసాగుతూనే ఉంది. ఈ లోపాన్ని అధిగమించటంలో అరుణాచల ప్రదేశ్, హిమాచల ప్రదేశ్, మిజోరం రాష్ట్రాలు వృద్ధిని సాధించాయి. ఈశాన్య రాష్ట్రాలు ఈ దిశలో ఉత్తమ ఫలితాలు సాధిస్తుండగా, త్రిపుర, పంజాబ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలు మరింత గట్టిచర్యలు చేపట్టాయి. అందువలన ఈ రాష్ట్రాలలో పరిస్థితి మెరుగుగా ఉంది. "పోషకాహార లోపాన్ని, ఆకలిని నిరోధించడంలో, అధిగమిచడంలో ప్రపంచంలోని అన్ని దేశాల కన్నా భారతదేశం అధమస్థాయిలో ఉంది." అని 2007వ సం॥లో అమర్త్యసేన్ రాశారు. గత దశాబ్ద కాలంలో ఈ పరిస్థితి ఏమైనా మారిందా? ముఖ్యంగా ఆర్థిక వృద్ధి సాధించామంటూ ప్రకటించే భారతదేశం బాలల్లో పోషకాహార లోపాన్ని అధిగమించే కృషి చేసిందా? క్రమంగా వృద్ధి చెందుతున్న పౌష్టికాహార లోపాన్ని నిరోధించ డానికి ఏదైనా వినూత్నంగా ఆలోచించగలిగిందా? ఈ దశాబ్ద కాలంలో, అట్టడుగు స్థాయిలోనున్న రాష్ట్రాలు, ఈ దిశగా చర్యలు ఏమయినా చేపట్టాయా? భారతదేశంలో మొట్టమొదటి సారిగా 640 జిల్లాలలో చేపట్టిన, సర్వేలో పోషకాహార లోపం కేవలం కొన్ని రాష్ట్రాలలో కొన్ని జిల్లాలకే పరిమిత మయ్యిం దా? దేశవ్యాప్తంగా ఒకేరీతిన ఉందా? అన్న కారణాలను విశ్లేషించారు.

**బాలల్లో పోషకాహార లోపం :**

బాలల్లో పోషకాహార లోపాన్ని అధిగమించడానికి బంగ్లాదేశ్, నేపాల్ గణనీయమైన కృషి చేశాయి. శ్రీలంక, దక్షిణాసియాలోని కొన్ని దేశాలు మాత్రం ఈ సమస్యను నేటికీ అధిగమించలేకపోయాయి. అందులో మనదేశం కూడా ఉంది. యునిసెఫ్ 2013లో విడుదల చేసిన నివేదిక ప్రకారం ప్రపంచంలో పోషకాహార లోపంతో ఉన్న బాలల్లో 2011 నాటికి 38 శాతం భారతదేశంలోనే ఉన్నారు. 2013లో భారతదేశంలో పోషకాహారలోపంతో ఉన్న బాలలు ఆఫ్రికాలో కన్నా ఎక్కువ మంది ఉన్నారు. తమ పొరుగు దేశాలతో పోల్చుకుంటే తాము ఏ స్థాయిలో ఉన్నామో భారతదేశం ఆలోచించాలి. బాలల్లో పోషకాహార లోపర, తద్వారా కలిగే వ్యాదులు దేశ గౌరవాన్ని ఎక్కడ ఉంచుతాయో భారతదేశం పరిగణనలోకి తీసుకోవాలి.

దేశవ్యాప్తంగా పోషకాహార లోపం అధికంగా ఉన్న చిన్నారులున్న జిల్లాల్లోని 6,01,509 కుటుంబాలను పరిశీలించి 2015-16 సం॥లో విడుదల చేసిన నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే -4 నివేదిక విశ్లేషణ జరిపింది. ఈ దిశలో ముఖ్యంగా 0-59 నెలల మధ్య అనగా పసికందు నుండి 6సం॥ల బాలల మధ్య వయస్సుకు తగ్గ ఎత్తు, ఎత్తుకు తగ్గ బరువు లేని కారణాలను పరిశీలించింది. 2005-06 మరియు2015-16 మధ్య కాలంలో విడుదలైన ఎన్‌ఎఫ్ హెచ్‌ఎస్-3 మరియు ఎన్‌ఎఫ్ హెచ్ ఎస్-4 నివేదికల ఆధారంగా బాలల పోషకాహార లోపాన్ని తగ్గించడానికి రాష్ట్రాలు, జాతీయ స్థాయిలో ప్రభుత్వాలు చేపట్టిన చర్యలను విశ్లేషించడం కోసం దేశంలోని 640 జిల్లాల లో 604 జిల్లాలను తీసుకుని అధ్యయనం చేయడం జరిగింది.

2015-16లో విడుదలయిన ఎన్‌ఎఫ్ హెచ్‌ఎస్-4 నివేదిక ఆధారంగా, భారతదేశంలో 38శాతం బాలలు, వయస్సుకు తగ్గ ఎత్తు లేకపోవడం, 36శాతం ఎత్తుకు తగ్గ బరువు లేక కునారిల్లుతున్నారు. నగర ప్రాంతాల కన్నా గ్రామీణ భారతదేశంలో ఈ సమస్య 10 శాతం ఎక్కువగా ఉంది. సమగ్రంగా పరిశీలించినప్పుడు 40 శాతం బాలలు వయస్సుకన్నా తక్కువ ఎత్తు, 38 శాతం తక్కువ బరువుతో ఉన్నారు. 2005-06 నుండి 2015-16 మధ్య దశాబ్దకాలంలో వయసుకు తగ్గ ఎత్తులేనివారు 10 శాతం, ఎత్తుకు తగ్గ బరువు లేనివారు 7శాతం తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

**సామాజిక ఆర్థిక వ్యత్యాసాలు**

భారతదేశంలో ఉన్న సామాజిక, ఆర్థిక వ్యత్యాసాలను ఎన్‌ఎఫ్ హెచ్‌ఎస్ -3 నివేదిక స్పష్టం చేసింది. అంతేగాక భారతదేశంలో పేద, సంపన్న వర్గాల మధ్య వ్యత్యాసం హెచ్చు స్థాయిలో ఉన్నది. సంపన్న వర్గాల బిడ్డల కన్నా పేదల బిడ్డలు ఎత్తు, బరువు తక్కువగా ఉండటం రెండింతలు ఎక్కువగా ఉంది. సంపద పెరుగు తున్నకొలదీ, క్రమంగా ఈ వ్యత్యాసం తగ్గుతున్నది.

అత్యంత హీనమైన పేదరికాన్ని అనుభవిస్తున్న పేదవర్గాలలోనే వయసుకు తగ్గఎత్తులేక పోవటం లెక్కల్లో చూపిన సంఖ్య కన్నా హెచ్చుగానే ఉంది. ఇది సంపన్న వర్గాలలో వ్యతిరేక దిశలో ఉంది. సామాజికంగా వెనుక బడియున్న ఆదివాసీలు, మరియు దళితులలో వయసుకు తగ్గ ఎత్తులేకపోవటం, ఎత్తుకు తగ్గ బరువు లేకపోవటం పెరిగింది.

**రాష్ట్రాల అభివృద్ధి**

బాలల్లో పోషకాహార లోపం సమస్యను అధిగమించటంలో కేరళ రాష్ట్రం దేశంలోనే ముందుంది. తర్వాత స్థానాలలో గోవా, త్రిపుర, పంజాబ్, హర్యానా రాష్ట్రాలున్నాయి. 48శాతంతో అట్టడుగున బీహార్ ఉండగా, ఉత్తర ప్రదేశ్, జార్ఖండ్, మేఘాలయ, మధ్య ప్రదేశ్‌లు 40 శాతం కన్నా ఎక్కువ మందితో ఉన్నాయి. జాతీయ సరాసరి కన్నా రాజస్థాన్ మరియు గుజరాత్ రాష్ట్రాలలో ఈ సమస్య

ఎక్కువగా ఉంది. అట్టడుగుస్థాయిలో ఉన్న ఐదు రాష్ట్రాలలో కేరళ, గోవా కన్నా రెండింతలు అధికంగా ఈ సమస్య ఉన్నది. అట్టడుగునున్న ఐదు రాష్ట్రాల పరిస్థితి యధాతథంగా ఉండగా, మిగిలినరాష్ట్రాలలో మాత్రం కొంత మెరుగైంది. త్రిపుర, హిమాచల్ ప్రదేశ్, ఛత్తీస్‌ఘర్ తమ స్థానాలను మెరుగుపరచుకోగా, మణిపూర్, సిక్కిం, కర్ణాటక, రాజస్థాన్, జార్ఖండ్ మరియు తమిళనాడు అంతకు మునుపు కన్నా దిగ జారాయి.

ఛత్తీస్‌ఘర్, అరుణాచల్ ప్రదేశ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ మరియు పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు ఈ సమస్యను అధిగమించడంలో గతంలో కన్నా ముందంజ వేశాయి. వీటన్నింటి లోనూ ఉన్న ఒకే సారూప్యత 2005-06 కాలంలో ఈ లోపం అత్యధిక స్థాయిలో నుండ టం, అదే సమయంలో పైన పేర్కొన్న రాష్ట్రా లతో సమాన స్థాయిలోనున్న బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ మరియు రాజస్థాన్ తమ స్థానాలను ఏ మాత్రం మెరుగుపరచుకోలేదు. ఉత్తరప్రదేశ్ మరియు మేఘాలయ మాత్రం మంచి ఫలితా లను సాధించాయి. వీటన్నిటి కన్నా హిమాచల్ ప్రదేశ్ మాత్రం భిన్నంగా ఉంది. కారణం వయసుకు తగిన ఎత్తు, ఎత్తుకు తగిన బరువు లోపాలను అధిగమించడంలో ఈ రాష్ట్రం అన్ని రాష్ట్రాల కన్నా ముందుంది. ఛత్తీస్‌ఘడ్, గుజరాత్ రాష్ట్రాలు గతంలో కన్నా వృద్ధి రేటు సాధించినప్పటికీ, గతంలోని తమ స్థానాల కన్నా దిగువకు జారిపోయాయి. జార్ఖండ్, రాజస్థాన్, బీహార్ మరియు మధ్యప్రదేశ్‌లు తమిళనాడు యధాతథంగా ఉన్నాయి.

కర్ణాటక మరియు మహారాష్ట్ర కొద్ది మెరుగుదల సాధించి గతం కన్నా ముందున్నా యి. కాగా కేరళ, మిజోరాం, మణిపూర్, సిక్కిం, మరియు జమ్మూకాశ్మీర్ బాలల్లో బరువు సమస్యను అత్యల్పంగా కలిగి ఉన్నాయి. 2005-06 సం॥లో అగ్రస్థానంలో నున్న పంజాబ్ మరియు గోవా తమ స్థానాలను మెరుగుపరుచుకున్నాయి.

తమ రాష్ట్రాల్లోని బాలల్లో పోషకాహార లోపాన్ని అధిగమించటం కోసం ప్రభుత్వాలు ఏమైనా కృషి చేశాయా అన్న అంశాన్ని పరిశీలి ద్దాం. వయసుకు తగిన ఎత్తు విషయంలో 2005-06లో ఉత్తరప్రదేశ్, బీహార్, మేఘా లయ, ఛత్తీస్‌ఘర్, మరియు గుజరాత్‌లు 52 శాతంతో అట్టడుగున ఉన్నాయి. 50 శాతంలో మధ్యప్రదేశ్, జార్ఖండ్ కొంచెం మెరుగుగా ఉ న్నాయి. ఈ రాష్ట్రాలలో ఛత్తీస్‌ఘడ్ మరియు గుజరాత్‌లు అతి కొద్దిగా మెరుగైె అట్టడుగు

**"వయసుకు తగిన ఎత్తు విషయంలో 2005-06లో ఉత్తరప్రదేశ్, బీహార్, మేఘాలయ, ఛత్తీస్‌ఘర్, మరియు గుజరాత్ లు 52 శాతంతో అట్టడుగున ఉన్నాయి. 50 శాతంలో మధ్యప్రదేశ్, జార్ఖండ్ కొంచెం మెరుగుగా ఉన్నాయి. ఈ రాష్ట్రాలలో ఛత్తీస్‌ఘడ్ మరియు గుజరాత్‌లు అతి కొద్దిగా మెరుగైె అట్టడుగు 6,7 స్థానా లకు ఎగబాకాయి. మేఘాలయ సైతం వృద్ధిని సాధించి, జాతీయ సరాసరికన్నా కాస్త మెరుగైన స్థానాన్ని ఆక్రమించింది."**



పోషకాహారలోపంతో బాలలు

6,7 స్థానాలకు ఎగబాకాయి. మేఘాల య సైతం వృద్ధిని సాధించి, జాతీయ సరాసరికన్నా కాస్త మెరుగైన స్థానాన్ని ఆక్రమించింది. 2005-06లో ఎత్తుకు తగ్గ బరువు లేనివారి విషయంలో 60 శాతంతో మధ్యప్రదేశ్, అత్యం త దిగువనుండగా, 56 శాతంతో జార్ఖండ్, బీహార్, 47 శాతంతో ఛత్తీస్‌ఘడ్, 40 శాతంతో మేఘాలయ తరువాతి స్థానాలలో ఉన్నాయి.

2015-16 నివేదిక ప్రకారం ఎత్తుకు తగ్గ బరువు లేనివారి విషయంలో జార్ఖండ్ అగ్రస్థానంలో కొనసాగుతున్నది. 40 శాతం లోపంతో బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, మరియు గుజరాత్ దిగువ స్థానాలను ఏ మాత్రం మెరుగపరచుకోలేదు. జార్ఖండ్, మేఘాలయ తమ గత స్థానాలను మెరుగు పరచుకున్నాయి. కర్ణాటక మరియు మహారాష్ట్ర కొద్ది స్థాయిలోనే తమ సమస్యను అధిగమించి గతంలో కన్నా ముందున్నాయి. కాగా మిజో రాం, మణిపూర్, సిక్కిం, కేరళ, మరియు జమ్మూ కాశ్మీర్ బాలల్లో ఎత్తుకు తగ్గ బరువు లేని సమస్య అత్యల్పంగా కలిగి ఉన్న రాష్ట్రాల పట్టికలో అగ్రస్థానాన్ని సాధించాయి.

2005-06 నివేదిక ప్రకారం మేఘాలయ తో పాటుగా దిగువస్థాయిలోనున్న మధ్య ప్రదేశ్, త్రిపుర, హిమాచల్‌ప్రదేశ్ మరియు అరుణాచల్ ప్రదేశ్ ఎత్తుకు తగ్గ బరువు లేకపోవటం సమస్యను అధిగమించడంలో వృద్ధి సాధించాయి. గతంలో 14వ స్థానంలో ఉన్న మిజోరాం ఉన్నత ప్రమాణాలతో అగ్రస్థానాన్ని అలంకరిం చింది. ఇదేస్థితిని కేరళ, మణిపూర్‌లు కూడా కొనసాగించాయి. అరుణాచల్‌ప్రదేశ్ మరియు హిమాచల్‌ప్రదేశ్ నామామాత్ర వృద్ధిని సాధిం చగా, గతంలో అగ్రస్థానంలోనున్న మేఘాలయ, 5వ ర్యాంకుకు దిగజారింది. బీహార్, మధ్య ప్రదేశ్, జార్ఖండ్‌ల విషయంలో సైతం ఇదే కొనసాగింది. పట్టికలో దిగువస్థాయిలోనున్న మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల పరిస్థితుల్లో ఏమాత్రం మార్పులేదు. వయసుకు తగ్గఎత్తులేని సమస్యను అధిగమించే క్రమంలో అరుణాచల్‌ప్రదేశ్, మిజోరాం ఉన్నత ప్రమాణాలు సాధించాయి. హిమాచల్‌ప్రదేశ్ వీటికి జత కలిసింది. హిమాచల్‌ప్రదేశ్‌లాగా మరో 4 రాష్ట్రాలు ఉన్నత ప్రమాణాలు సాధిం చగా అవన్నీ ఈశాన్య భారతంలోనివే కావడం గమనార్హం.

2005-06లో ఎత్తుకు తగ్గబరువు లేని విషయంలో 60 శాతంతో మధ్యప్రదేశ్ అత్యంత దిగువనుండగా, 56 శాతంతో జార్ఖండ్, బీహార్ 40 శాతం, మేఘాలయ 47 శాతంతో ఛత్తీస్ ఘడ్‌లు ఉన్నాయి. మేఘాలయ మినహాయించి, మిగిలిన రాష్ట్రాలు తమ పాతస్థానాల నుండి ఏ మాత్రం వృద్ధి సాధించలేదు.

**అననుకూలతలు**

భారతదేశంలోని బాలలలో పోషకాహార లోపంలో సామాజిక అంతరాల కన్నా, ఆర్థిక అంతరాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. అన్ని రాష్ట్రాల కన్నా ఉత్తరప్రదేశ్ ఎలాంటి అభ్యున్నతి లేకుండా దిగువస్థాయిలోనే ఉండిపోయింది. వయసుకు తగిన ఎత్తు లోపాన్ని అధిగమించే క్రమంలో కేరళ అగ్రస్థానంలో ఉంది. తర్వాత స్థానంలో మేఘాలయ, అరుణాచలప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, పంజాబ్ మరియు తమిళనాడు ఉ న్నాయి. ఎత్తుకు తగ్గత బరువు లేని సమస్యను పరిశీలిస్తే, పేదల్లో ఈ సమస్య అధికంగా ఉ

> **“ భారతదేశ మహిళల్లో ఉన్న పోషకాహార లోపం, ఆహారం పట్ల అవగాహనా రాహిత్యం, బాల్యంలో సరైన పోషకాహారం సరిపడా బాలలకు అందకపోవడం, పేదరికం, తల్లులు ఎక్కువకాలం పాఠశాలల్లో చదవక పోవడం, శారీరక బలహీనత, సరైన పరిశరాల శుభ్రత లేకపోవడం, మంచినీటి వసతి లేకపోవడం, స్త్రీ , పురుష నిష్పత్తి సమానంగా ఉండకపోవడం వంటి అనేకానేక కారణాలు కూడా ప్రధాన కారణాలే. ”**

న్న రాష్ట్రం మహారాష్ట్ర కాగా, తర్వాత స్థానంలో రాజస్థాన్, తెలంగాణా, ఒడిశా, మరియు గుజరాత్ రాష్ట్రాలున్నాయి. పేదల్లో ఈ సమస్యను అధిగమించడంలో హిమాచల్‌ప్రదేశ్ ముందుండగా, మణిపూర్, మేఘాలయ, తమిళనాడు, నాగాలాండ్, పంజాబ్ తర్వాతి స్థానాలలో ఉన్నాయి.

జిల్లా స్థాయిలలో మూడు ముఖ్యమైన అంశాలు ప్రతిఫలిస్తాయి. తొలుతగా ఎత్తు తక్కువ సమస్య అతి తక్కువున్న రాష్ట్రాలలో మొదటి పది జిల్లాల్లో, ఐదు జిల్లాలు కేరళలో ఉన్నాయి. ఈ సమస్య అధికంగా ఉన్న రాష్ట్రాలలో అగ్రస్థానంలో ఉత్తరప్రదేశ్ ఉండగా అందులో ఆరు జిల్లాలు ఉన్నాయి. ఈ రాష్ట్రంలోని “డి మోరియా” జిల్లాలో మూడు రకాల హీనత కనిపిస్తుంది. వివిధ భిన్న కోణాల విశ్లేషణ ÷

దేశవ్యాప్తంగా జరిగిన ఎన్నెన్నో అధ్యయనాలలో స్పష్టమైన విషయం, భారత దేశంలోని బాలల పోషకాహార లోపానికి కారణాలపై భిన్న అభిప్రాయాలు ఉన్నాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం, భారతదేశంలో ప్రాథమికంగా ఉన్న పరిసర ప్రాంతాల అనారోగ్య వాతావరణం ఓ ప్రధాన కారణం అని భావిస్తారు. కోర్సీ వెలువరించిన అభిప్రాయం ప్రకారం, “మాతృత్వం పట్ల, గర్భస్థ సమయంలోనూ సరైన పోషకాహారం తల్లులు తీసుకోకపోవడం, బిడ్డలకు ఎదిగే క్రమంలో ఎలాంటి ఆహారం అదించాలి అన్న ప్రాథమిక అవగాహన లేకపోవడం మరో కారణం. వీటితో పాటు భారత దేశంలోని వివిధ భౌగోళిక అంశాలు, వాతావరణ పరిస్థితులు కూడా బాలల్లోని ఈ స్థితికి ప్రధాన కారణం.



అసమానతల భారత్

వయసుకు తగ్గ ఎత్తులేక పోవటానికి, ఎత్తుకు తగ్గ బరువు లేకపోవటానికి మధ్య అవినాభావ సంబంధం ఉన్నదని విశ్లేషణలు వెల్లడిస్తున్నాయి. భారతదేశ మహిళల్లో ఉన్న పోషకాహార లోపం, ఆహారం పట్ల అవగాహనా రాహిత్యం, బాల్యంలో సరైన పోషకాహారం సరిపడా బాలలకు అందకపోవడం, పేదరికం, తల్లులు ఎక్కువకాలం పాఠశాలల్లో చదవక పోవడం, శారీరక బలహీనత, సరైన పరిశరాల శుభ్రత లేకపోవడం, మంచినీటి వసతి లేకపోవడం, స్త్రీ , పురుష నిష్పత్తి సమానంగా ఉండకపోవడం వంటి అనేకానేక కారణాలు కూడా ప్రధాన కారణాలే. ఈ మొత్తం కారణాల కన్నా, స్త్రీలు ఎక్కువ కాలం చదువుకోకపోవడం దారిద్ర్యరేఖకు దిగువ నుండటం ప్రధానమైనవే. కారణాలుగా భావించవచ్చు. తల్లుల్లో 10 శాతం పోషకాహార లోపం ఉంటే బిడ్డల్లో 2.7 శాతం వరకూ పోషకాహార లోపానికి దోహదకారి అవుతుంది.

పోషకాహార లోపానికి ఆరు ప్రధాన కారణాలు ఉన్నాయి. స్త్రీలల్లోని అవగాహనా రాహిత్యం, పేదరికం, బాలలపై ప్రభావాన్ని కలిగిస్తున్నాయి. స్త్రీలలోని 10 శాతం అవగాహన పెరిగితే అది బాలలపై 6 శాతం ప్రభావం చూపుతుంది. భారతదేశంలో ఈ సమస్య తీవ్రత తగ్గాలంటే స్త్రీలలో పోషకాహారం పట్ల అవగాహన పెరగాలి. దారిద్ర్యం తగ్గాలి. ఇదే విషయాన్ని ప్రపంచంలోని మిగిలిన దేశాలు సైతం ధృవీకరించాయి. ప్రతి దేశంలోనూ ఒకే విధమైన అంశాలు ప్రభావం చూపకపోయినప్పటికీ, ఆయా ప్రాంతాల సమస్యల కారణంగా బాలల్లో పోషకాహార లోపం సమస్య ప్రబలి ఉంది. అయితే పరిసరాల పరిశుభ్రతను మెరుగుపరచడం వలన ఈ స్థితిలో కొంత మెరుగుదల కనిపించింది. నామమాత్రం వృద్ధి ఈ దశకంలో కనిపించినప్పటికీ, సామాజిక, ఆర్థిక అంతరాలు తీవ్ర ప్రభావం నేటికీ ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది.

**అనువాదం : డా॥ శమంతకమణి**

**‘మార్క్సిస్టు’కు మీ సందేహాలు రాయండి!**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

విశ్లేషణ

# శబరిమల పేరుతో బిజెపి రాజకీయాలు



రచయిత ఐఐటి ముంబయిలో పరిశోధక విద్యార్థి

**డిబి రూపేష్**

కేరళలోని ప్రసిద్ధి చెందిన శబరిమల ఆలయంలోకి 10–50 ఏళ్ల మధ్య వయస్సున్న మహిళల ప్రవేశంపై అమలులో వున్న నిషేధాన్ని తొలగిస్తూ 2018 సెప్టెంబర్ 28న సుప్రీం కోర్టు తీర్పు వెలువరించింది.వాస్తవానికి 10–50 ఏళ్ల మధ్య వయస్సులైన మహిళల ప్రవేశంపై వున్న ఈ నిషేధాన్ని కేరళ హైకోర్టు 1991 నాటి ఎస్ మహేంద్రన్ వర్సెస్ ది సెక్రెటరీ ట్రావెంకూర్ కేసులో వెలువరించిన తీర్పు ద్వారా విధించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ పిటిషనర్లు 2006లో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రాజ్యాంగం మహిళలకు సమాన హక్కులు కల్పించిందన్న సూత్రం ప్రాతిపదికగా సర్వోన్నత న్యాయస్థానం ఈ నిషేధాన్ని తొలగిస్తూ మెజార్టీ తీర్పు వెలువరించింది. దీనితో ఈ తీర్పుపై పెద్దయెత్తున అసంతృప్తి, నిరసనలు వెల్లువెత్తటం, హింసాకాండ చెలరేగటం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో శబరిమల వివాదం చుట్టూ కొనసాగుతున్న రాజకీయాలను సమగ్రంగా విశ్లేషించే ప్రయత్నమే ఈ వ్యాసం. ఈ అంశానికి సంబంధించి కొన్ని ప్రశ్నలు ప్రధానంగా మనకు ఎదురౌతాయి. శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశం అంశం ఆకస్మికంగా ఎందుకు వివాదాస్పదంగా మారింది? దీని వెనుక వున్న రాజకీయ ప్రకంపనలేమిటి? వలస పాలనానంతర కేరళ గురించి ఇది ఏం చెబుతోంది?

శబరిమలలో ప్రధాన దైవం అయ్యప్ప. ఆయన అస్ఖలిత బ్రహ్మచారి అని భక్తులు విశ్వసిస్తుంటారు. ఈ కారణంతోనే రుతుక్రమంలో వున్న మహిళలకు ఆలయ ప్రవేశాన్ని నిషేధించారు. ఇది ప్రధానంగా పురుషాధిక్య యాత్రా కేంద్రం. అయితే ఇక్కడ కుల, మతపరమైన వివక్షకు తావులేదు. ఈ 'పురుషాధిక్యత' అన్నది వివిధ ప్రక్రియల ద్వారా మనకు కన్పిస్తుంది. ఊసెల్లా అండ్ ఊసెల్లా (2003:70) ప్రకారం ఈ యాత్ర ప్రధానంగా లింగ ప్రధాన ప్రక్రియ. ఇది రెండు రూపాల్లో వుంటుంది. ఇద్దరు పురుష దేవతలైన శివ, విష్ణువులకు జన్మించిన శక్తిస్వరూపుడైన ఈ దైవంతో పురుషులు మమేకం కావటం మొదటి పద్ధతి. మరో పద్ధతిలో శబరిమల యాత్రకు వెళ్లే పురుషుల బృందం ఇతర భక్తులను తమలో కలుపుకుని అందరూ మమేకమై యాత్రకు బయల్దేరుతారు. అంతిమంగా ఆలయంలో అందరూ పురుషులే వుంటారు. శబరిమల యాత్ర సీజన్‌లో పురుషాధిక్య సాంస్కృతిక రూపాలు, పద్ధతులు మనకు కన్పిస్తాయి. నల్లరంగు ధోతి, మెడలో పూసల దండలు, నుదుటిన బొట్టు, ఇళ్లలో, బహిరంగ ప్రదేశాలలో భజనల నిర్వహణ వంటివి ఈ సీజన్‌లో మనకు కన్పించే సాధారణ దృశ్యాలు. ఈ సీజన్‌లో మనకు కన్పించే మరో ముఖ్యమైన అంశం అయ్యప్పన్ విళక్కు. శబరిమల యాత్రికులు 41 రోజుల పాటు ఆచరించే దీక్షనే అయ్యప్పన్ విళక్కు అని పిలుస్తారు. ఈ కాలంలో అనుసరించిన పద్ధతుల ద్వారా వారు సర్వసంగ పరిత్యాగులుగా మారతారు. దీక్షాకాలంలో వారు ఇంటిని అతి పవిత్రంగా చూసుకుంటారు. ఈ ప్రక్రియలో మహిళలకు ఎటువంటి పాత్ర వుండదు. ఈ ఇళ్లలో రోజువారీ కొనసాగే దీక్షా కార్యక్రమాలలో కూడా పురుషాధిక్యతే మనకు కన్పిస్తుంటుంది. కేరళలో ఈ యాత్రకు దళితులు, ఇతర వెనుకబడిన వర్గాలు (ఒబిసి) బాగా ఆకర్షితులవుతారు. అరుదుగా బ్రాహ్మణులు కూడా ఈ యాత్రలో పాల్గొంటుంటారు. సాధారణంగా వైదిక ఆలయాలను సందర్శించని దళితులు సైతం ఈ సీజన్‌లో శబరిమల ఆలయాన్ని సందర్శిస్తుంటారు. ఈ అవర్ణ యాత్రికుల ఆసక్తి అంతా వారి బ్రాహ్మణేతర మూలాలను ప్రతిబింబిస్తుంటుంది. అయితే ప్రస్తుతం కొనసాగుతున్న పూజాదికాలు, నిర్మాణాలు అన్నీ బ్రాహ్మణ తాంత్రిక సంప్రదాయాన్ని పోలి వుంటున్నాయి.

వాస్తవానికి శబరిమల మలయరాయ అనే ఆదివాసీ వర్గానికి చెందిన ప్రార్థనా స్థలం అని చారిత్రక, పాలనాపరమైన రికార్డుల ద్వారా తెలుస్తోంది. వీరిపై బౌద్ధమత ప్రభావంతో పాటు వీరికి ముస్లింలు, క్రైస్తవులతో గట్టి సంబంధాలుండేవని పరిశోధకులు (మీనన్ 2007) చెబుతున్నారు. శబరిమల యాత్రికులు తొలుత వావరు స్వామి (ముస్లిం దైవం)ని సందర్శిస్తారు. ఆ తరువాతే అయ్యప్పను సందర్శించుకుంటారు. అంటే మతాల మధ్య విశ్వాసాల మధ్య సంబంధాలను ఈ ఆలయ సంప్రదాయాలు ప్రతిబింబిస్తున్నాయని చెప్పుకోవచ్చు. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని కేవలం 'హిందువు'లకు మాత్రమే పరిమితం చేయాలని సంఘ్‌పరివార్ సంస్థలు చేస్తున్న డిమాండ్ ప్రాథమికంగా శబరిమల బహుళత్వ లక్షణానికి వ్యతిరేకం అన్నది సుస్పష్టం. శబరిమల యాత్రలో ఇమిడి వున్న లౌకిక విలువలకు వ్యతిరేకంగా 'హిందూ' ఐక్యతను కూడగట్టటం ఈ డిమాండ్ ప్రధానోద్దేశం. అయ్యప్ప చుట్టూ అల్లుకున్న పురాణేతిహాసాలన్నీ ఇక్కడి బ్రాహ్మణేతర మూలాలనే గట్టిగా సూచిస్తున్నాయి. స్థానిక బ్రాహ్మణ పూజారులు శబరిమలలో పూజలు చేసేందుకు నిరాకరించిన సమయంలో ఈ ఆలయ యాజమాన్య బాధ్యతలు నిర్వర్తిస్తున్న ట్రావెంకూర్ దేవస్వామ్ బోర్డ్ (టిడిబి) బయట నుండి ఒక తంత్రిని తీసుకు వచ్చిందని చరిత్రకారుడు కెఎన్ గణేశ్ చెబుతున్నారు. ఆ తరువాతే పూజలు, తాంత్రిక పద్ధతులన్నీ బ్రాహ్మణ సంప్రదాయానికి అనుగుణంగా మారిపోయాయి. బ్రాహ్మణ తాంత్రిక పద్ధతులు అమలులోకి రావటంతో బ్రాహ్మణేతర దైవాలను శివుడు, విష్ణువు వంటి బ్రాహ్మణ దైవాలతో కలిపేందుకు తంత్రిలు అవసరమయ్యారు. ఇందులో భాగంగానే అయ్యప్ప పూజా సంప్రదాయాలను

> **❝ కాంగ్రెస్ పార్టీ సందిగ్ధంతో కూడిన వైఖరిని అనుసరించింది. సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ వేలాది మంది భక్తులు ఎర్నాకుళం, పందళం వీధుల్లో నిరసన ప్రదర్శనలు జరిపారు. వివిధ రాజకీయ పార్టీలు, కులాలు, వర్గాలకు చెందిన ప్రజలు కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ సమయంలోనే సంఘ్ పరివార్, కాంగ్రెస్ పార్టీలు తమ వైఖరిని మార్చుకుని ఈ 'నామజప నిరసన'లకు నేతృత్వం వహించటం ప్రారంభించాయి. ❞**




సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా కేరళలో జరుగుతున్న ఆందోళనలు

అందుకు అనుగుణంగా మార్చివేశారు. ఈ అంశాలన్నింటినీ పరిశీలిస్తే శబరిమల ప్రధానంగా బ్రాహ్మణేతర యాత్రా కేంద్రమేనని, కాలక్రమంలో ఇది హిందూ బ్రాహ్మణ ఆలయంగా మారిందని అర్థమవు తోంది. శబరిమల, అయ్యప్ప సంస్కృతిని దక్షిణ భారత దేశంలో విస్తృత స్థాయిలో ప్రచారం చేసేందుకు 1945లో ఏర్పడిన అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం (ఎబిఎఎస్ఎస్) ప్రయత్నించింది. ఈ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా 260 అయ్యప్ప మందిరాలు, సంఘానికి 3,800 శాఖలు, 67 తాలూకా యూనియన్లు వున్నట్లు వారి వెబ్‌సైట్ ద్వారా తెలుస్తోంది. 'సంప్రదాయ పద్ధతు'లను ఉల్లంఘిస్తున్నారంటూ ఎబిఎఎస్ఎస్ 1982 నాటి నుండి శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశాన్ని అడ్డుకుంటూ వస్తోంది. తరువాత 1991 నాటి మహేంద్రన్ వర్సస్ ది సెక్రెటరీ, ట్రావెంకూర్ కేసులో వెలువరించిన తీర్పు ద్వారా కేరళ హైకోర్టు మహిళల ప్రవేశంపై నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ నిషేధాన్ని రద్దు చేస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పునకు వ్యతిరేకంగా కొనసాగుతున్న నిరసలు, ఇక్కడి ప్రజల మనోభావాల మధ్య వైరుధ్యాన్ని పరిశీలించాల్సి వుంది. సుప్రీంకోర్టు తీర్పు ఆలయ సంప్రదాయాలకు వ్యతిరేకమన్న భావన ప్రజల్లో బలంగా వుంది. కానీ తొలి రోజుల్లో నిరసనలు ఇంత ఉధృత స్థాయిలో లేవు. సుప్రీంకోర్టు తీర్పును ఆరెస్సెస్, బిజెపి స్వాగతించాయి. కాంగ్రెస్ పార్టీ సందిగ్ధంతో కూడిన వైఖరిని అనుసరించింది. సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ వేలాది మంది భక్తులు ఎర్నాకుళం, పందళం వీధుల్లో నిరసన ప్రదర్శనలు జరిపారు. వివిధ రాజకీయ పార్టీలు, కులాలు, వర్గాలకు చెందిన ప్రజలు కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ సమయంలోనే సంఘ్ పరివార్, కాంగ్రెస్‌పార్టీలు తమ వైఖరిని మార్చుకుని ఈ 'నామజప నిరసన'లకు నేతృత్వం వహించటం ప్రారంభించాయి. కేరళలో అగ్రవర్ణాలకు చెందిన నాయర్ సర్వీస్ సొసైటీ (ఎన్ఎస్ఎస్) ఈ నిరసనలకు భక్తులను సమీకరించటం ప్రారంభించింది. ప్రారంభంలో వివిధ రాజకీయ పార్టీలు, సంస్థలతో కలిసి సమన్వయంతో ఎన్ఎస్ఎస్ ఈ ప్రదర్శనలను నిర్వహించింది. ఇందులో పందళం మాజీ రాజ కుటుంబం, నంబూద్రి యోగక్షేమ సభ, అఖిల కేరళ తంత్రీ సమాజం వంటివి కూడా పాలుపంచుకున్నాయి. దాదాపు 41 సంస్థలు ఈ నిరసనల్లో భాగస్వాములయ్యాయి. అయితే సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకించిన యజవ సంస్థ శ్రీనారాయణ ధర్మపరిపాలన (ఎస్ఎన్డిపి) యోగం ఈ నిరసనలకు మాత్రం బహిరంగ మద్దతు ప్రకటించలేదు. ఎస్ఎన్డిపికి చెందిన రాజకీయ పార్టీ భారత ధర్మ జనసేన (బిడిజెఎస్) మాత్రం నిరసనలను గట్టిగా సమర్థించింది. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన కేరళ పులయార్ మహాసభ (దళిత కుల సంఘం) నిరసనలను తీవ్రంగా విమర్శించింది. ఈ ఆలయ యాజమాన్య హక్కులను ప్రకటించుకున్న మలయరాయ వర్గం బ్రాహ్మణుల పెత్తనాన్ని ప్రశ్నించింది. ఆ తరువాత తులా మాసం పూజలకు ఆలయం తెరచిన తరువాత ఆ పరిసర ప్రాంతాలలో అత్యంత ఉధృత స్థాయిలో హిందుత్వ హింస ప్రబలింది. మహిళా జర్నలిస్టులతో సహా అనేక మంది మీడియా ప్రతినిధులపై దాడులు చేయటం, వాహనాలను ధ్వంసం చేయటం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. శబరిమల ఆలయ సందర్శనకు వచ్చిన కొంత మంది మహిళలు సైతం హిందుత్వ శక్తుల ఆగడాలతో మార్గమధ్యంలోనే వెనుదిరిగారు. ఈ పితృస్వామ్య సంస్థలు, వ్యక్తులు శబరిమల యాత్ర పురుషాధిక్యతను కాపాడేందుకు తమ నిరసనలను ఆయుధంగా మార్చుకున్నారు.

### ఆలయపరమైన గుర్తింపు

1950లో సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో తీవ్రంగా ధ్వంసమైన ఈ ఆలయాన్ని పునర్నిర్మించిన తరువాత హిందూ యాత్రా స్థలంగా అభివృద్ధి చేశారు. ట్రావెంకూర్‌లో హిందూ మహా మండలం, ఎబిఎఎస్ఎస్‌లు ఈ అంశంపై హిందూ సమీకరణకు ప్రయత్నించాయి. ఈ సమయంలో ఆలయ పునరుద్ధరణకు ఎబిఎఎస్ఎస్ చొరవ చూపింది. అదే విధంగా 1983లో సంఘ్ పరివార్‌తో కలిసి శబరిమల ఆలయ సమీపంలో ఒక చర్చి నిర్మాణానికి వ్యతిరేకంగా ఈ సంస్థ భారీ ఉద్యమాన్ని నిర్వహించింది. శబరిమలకు హిందుత్వ గుర్తింపు రావటానికి ఎబిఎఎస్ఎస్, నిలయకల్ అంశాలు కీలకంగా మారాయి. 1950 తరువాత ఆలయ పూజా సంప్రదాయాలలో చోటు చేసుకున్న మార్పులను గమనిస్తే మళయాళంలో ధనుర్మాసంలో పేటతుళ్లయి ప్రక్రియను నిర్వహిస్తారు. అయితే ఇప్పుడు యాత్రికుల సంఖ్య భారీగా పెరగటంతో దానిని ముందుకు జరిపారు. జ్యోతిశ్శాస్త్రం (దేవ ప్రసన్నం) సూచించిన ప్రకారం మహిళల సందర్శనపై నిషేధాన్ని 1991లో హైకోర్టు జోక్యం తరువాత అమలు చేశారు. ప్రతిరోజూ ఆలయాన్ని మూసే సమయంలో ఆలపించే హరివరాసనం (లాలి పాట) ఇప్పుడు అయ్యప్ప, శబరిమలకు అధికార గీతంగా మారిపోయింది. 1969లో ఐదు ధ్వజస్థంభాల ప్రతిష్ఠాపన తరువాత పడిపూజ

అమలులోకి వచ్చింది. అంతకు ముందు మెట్ల వద్ద కొబ్బరికాయలను పగులకొట్టే ప్రక్రియను పక్కకు జరిపారు. మకరవిళక్కు వార్షిక ఉత్సవం ప్రాధాన్యతను సంతరించుకుని వావర్ ప్రాధాన్యత తగ్గిపోయింది. దీనితో పాటు అక్కడ చోటు చేసుకున్న వ్యవస్థాగత మార్పులు వైదిక సంప్రదాయాలకు అనుగుణంగా వున్నాయి. శబరిమలలో చోటు చేసుకున్న కీలక మార్పులు ఇవే. ఈ మార్పులను కాలం చెల్లిన సంప్రదాయాలుగా కాక భూ సంస్కరణల అమలు తరువాత కేరళలో వచ్చిన విస్తృత మార్పుల్లో భాగంగా పరిగణించాల్సిన అవసరం ఏర్పడింది. 80వ దశకం తరువాత పెరిగిన ఈ ప్రక్రియ ఉధృతిని 'ఆలయీకరణ'గా చెప్పవచ్చు. ఇది ఇప్పటి వరకూ కొనసాగుతూనే వుంది. కావూస్ వంటి ప్రార్థనా మందిరాలను హిందూ ఆలయాలుగా మార్చే ఈ ప్రక్రియను 'ఆలయీ కరణ' అనవచ్చు. ప్రార్థనా మందిరాలను ఆలయాలుగా మార్చే ప్రక్రియ చరిత్రలో అనేకసార్లు చోటుచేసుకుంది. అయితే ప్రస్తుత మార్పులకు, గత మార్పులకు వ్యత్యాసం వుంది. బ్రహ్మణ తాంత్రిక ప్రక్రియను వివిద కులాల వారు ఆమోదించటం ప్రస్తుత ఆలయీకరణ ప్రక్రియలో ఒక విశిష్ట లక్షణం. ఈ ప్రక్రియలో బ్రాహ్మణ తాంత్రిక పరిజ్ఞానాన్ని ఇతర పూజా పద్ధతులకన్నా అధీకృతమైనదిగా పరిగణిస్తున్నారని ఒక మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో యజవ తంత్రి అజయన్ చెప్పారు. ప్రార్థనా మందిరాన్ని ఆలయంగా మార్చే ప్రక్రియలో తంత్రిలు అక్కడి పాత దైవాన్ని కొత్త దైవంగా మారుస్తారు. ఉదాహరణకు దేవి పేరిట ఒక చెట్టుకింద పూజిస్తుండే ఒక స్థానిక దేవత వుండే ప్రాంతాన్ని ఆలయంగా మార్చేస్తారు. అయితే పాత పద్ధతులెవరికీ తెలియవు. ఈ కేసులో దైవం వేరయినా చైతన్యం ఒక్కటే. పూర్వ చైతన్యం నుండి కొత్త పూజకు పునరంకితం కావటమే ఈ ప్రక్రియ. ఇందుకు తాము తంత్ర సముచ్ఛ యాన్ని అనుసరిస్తామని అజయన్ చెప్పారు. ఇక్కడ సముచ్ఛయ ఒక ప్రముఖ పద్ధతిగా మారి పోయిందని, తాను కూడా అనేక ప్రాంతాలలో ఇదే విధమైన మార్పులు చేశానన్నారు. ఈ ప్రక్రియ కాలక్రమంలో ఈ ప్రదేశాన్ని హిందూ దేవాలయంగా మార్చివేయటమే కాక ఎటువంటి వివక్షకూ తావు లేకుండా అన్ని కులాలు, వర్గాల వారిని అనుమతించింది. శబరిమల ఆలయంలో కూడా ఇటీవలి కాలంలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. కేరళలో ఆలయ వ్యవస్థ, దాని కార్యకలాపాలలో కులం కీలకంగా మారింది.

> "కేరళ రాజకీయాల్లో కాలుపెట్టటం తమకు సులభసాధ్యంకాదన్న నిర్ధారణకు వచ్చిన ఆరెస్సెస్ ఈ సందర్భాన్ని తమకు అనుకూలంగా మల్చుకు నేందుకు వ్యూహరచన చేస్తోంది. కేరళలో హిందూ జనాభాలో మెజార్టీ ప్రజలు అటు కాంగ్రెస్‌తోనో లేదా ఇటు వామపక్షాలతోనో కలిసిపోతారు. సిపిఎం పార్టీకి వున్న ప్రజా పునాది ఎక్కువగా హిందువులు, యజవ (ఒబిసి)లు, దళితుల్లోనే వుంది."


కేరళ పునర్వికాస వారసత్వాన్ని కొనసాగిస్తూ జరుగుతున్న ప్రదర్శనలు

తియ్యాలు/యాజవలు, దళితులు తమ ఇళ్లలో క్రతువులకు, పూజా కార్యక్రమాలకు బ్రాహ్మణ పూజారులను ఆహ్వానిస్తున్నారు. ప్రస్తుత శబరిమల అంశం కూడా ఆలయీకరణ ప్రక్రియకు సంబంధించి దళిత సంఘాలు, మేధావుల నుండి తీవ్ర విమర్శలకు లోనయింది. 'సంప్రదాయం' పేరుతో చేస్తున్న వాదనలను తిరస్కరించటానికి చారిత్రక వాస్తవాలను వెలికి తీసే ప్రక్రియకు ఇది నాంది పలికింది. దీనితో గతంతో పోల్చుకుంటే శబరిమల వివాదం ఇప్పుడు ప్రజల దృష్టిని విశేషంగా ఆకర్షిస్తోంది. వివిధ కులాలకు చెందిన భక్తులను ఒకే వేదికపైకి తెచ్చే ప్రామాణీకరణ ప్రక్రియ అభివృద్ధి చెందింది. దీనితో సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా "సంప్రదాయ' పద్ధతులను రక్షించేందుకు ఈ వర్గం ప్రయత్నిస్తోంది. ఏదైనా ఆలయానికి సంబంధించిన సమస్యలు హిందువుల్లోని సవర్ణులు, అవర్ణులను ఏకం చేస్తాయనటానికి శబరిమల ఉదంతాన్ని చక్కని ఉదాహరణగా చెప్పవచ్చు. సమకాలీన హిందూ ఆలయ కార్యకలాపాలన్నీ పితృస్వామ్య పరిధిలో హిందూ గుర్తింపునకు ప్రధాన వనరుగా మారిపోయాయి. సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్న అసంతృప్తి నిరసనలకు ఆజ్యం పోయటంలో ఇది కీలకంగా మారింది.

### హిందూత్వ రాజకీయ వ్యూహాలు

కేరళ రాజకీయాల్లో కాలుపెట్టటం తమకు సులభసాధ్యంకాదన్న నిర్ధారణకు వచ్చిన ఆరెస్సెస్ ఈ సందర్భాన్ని తమకు అనుకూలంగా మల్చుకునేందుకు వ్యూహరచన చేస్తోంది. కేరళలో హిందూ జనాభాలో మెజార్టీ ప్రజలు అటు కాంగ్రెస్‌తోనో లేదా ఇటు వామపక్షాలతోనో కలిసిపోతారు. సిపిఎం పార్టీకి వున్న ప్రజా పునాది ఎక్కువగా హిందువులు, యజవ (ఒబిసి)లు, దళితుల్లోనే వుంది. హిందుత్వ రాజకీయాల్లో ప్రజా పునాదిని విస్తరించేందుకు ఆరెస్సెస్ ఆలయ వ్యూహాన్ని సిద్ధం చేసింది. ఈ వ్యూహంతో కేరళలో దశాబ్దాలుగా వేళ్లూనుకున్న వామపక్ష రాజకీయ ప్రభావాన్ని ఛేదించాలని భావించింది. ఇందుకు అనుగుణంగానే కేరళలోని వివిధ ప్రాంతాలలో మతపరమైన ఘర్షణలకు తెరతీసే ప్రయత్నం చేస్తోంది. అయితే ఈ ప్రయత్నాలేవీ సత్ఫలితాలనివ్వటం లేదు. కేరళలో మత విశ్వాసాలు, క్రతువులు, ఆలయ కార్యకలాపాల వంటి అంశాలకున్న రాజకీయ హద్దులు హిందూత్వ సిద్దాంతాలను సంక్లిష్టం చేస్తున్నాయి. వివిధ కుల, రాజకీయ పార్టీల నేపథ్యం కలిగిన ప్రజలు ఆలయ కార్యకలాపాలలో ఏ విధంగా ఒక్కతాటిపైకి వస్తారు. ఈ భావనల్లో ఏమైనా వ్యత్యాసం వుందా? ఈ ప్రశ్నపై ఇప్పుడు దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరం వుంది. అయితే ఆలయాలకు సంబంధించిన అంశాలలో రాజకీయ పార్టీల మధ్య హద్దులు కూడా చెరిగిపోతున్నాయి. అయితే శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశాన్ని అనుమతించాలన్న తీర్పును అమలు చేయాలన్న వామపక్ష ప్రభుత్వ కృతనిశ్చయంతో రాజకీయ పార్టీల మధ్య చెరిగిన హద్దులు మళ్లీ ప్రత్యక్షమవుతున్నాయి. సంస్కరణ ఉద్యమాల చరిత్ర, నిమ్న వర్ణాల భావన, వారిని చైతన్యవంతం చేయటం వంటి అంశాలపై వామపక్షాలు దృష్టి పెట్టి ప్రచారోద్యమం నిర్వహిస్తున్నాయి. ❋

ఈ మాసం ప్రత్యేకం

# హెగెల్‌ను దాటి ముందుకు సాగిన మార్క్స్

ఎం శివరామకృష్ణన్

మార్క్సిస్టు సిద్ధాంత ఆవిష్కర్త అయిన కారల్‌మార్క్స్ జర్మనీలోని రైన్ ప్రావిన్స్‌లో (ప్రష్యాలో భాగం) జన్మించాడు. మార్క్స్ జన్మించే నాటికి జర్మనీ 300 రాజ్యాలుగా విభజింపబడిఉంది. అందులో ప్రష్యా అతి పెద్దది. ఫ్రాన్స్ మొట్టమొదటి కాన్సుల్ అయిన నెపోలియన్ బోనాపార్ట్ తన సామ్రాజ్య విస్తరణ కోసం ప్రష్యాపై యుద్ధం ప్రకటించాడు. 1795 లో ప్రష్యన్ చక్రవర్తి ఫ్రెంచ్ సైన్యం ముందు నిలబడలేక రైన్ ప్రావిన్స్ ప్రాంతాన్ని ఫ్రాన్స్‌కు ఇవ్వడానికి అంగీకరించి ఒప్పందం చేసుకున్నాడు. రైన్ ప్రావిన్స్‌ను ఫ్రాన్స్‌లో కలుపుకున్న తర్వాత నెపోలియన్ "కోడ్ నెపోలియన్" చట్టాలను ప్రవేశపెట్టాడు. ప్రష్యాతో సహ అనేక దేశాల్లో ప్రవేశపెట్టిన చట్టాలతో పోలిస్తే నెపోలియన్ చట్టాలు చాలా ప్రగతిశీల లక్షణాలను కలిగివున్నాయి.

ప్రష్యాలో అమలులో ఉన్న చర్చీల వంశ పారంపర్యమైన హక్కులను, భూస్వామ్య హక్కులను ఫ్రెంచ్ ప్రభుత్వం రద్దు చేసింది. భూస్వామ్య వ్యవస్థని పూర్తిగా రద్దు చేసింది. రాజులు, పూజారుల హక్కులన్నింటినీ రద్దు చేసింది. ఫ్రెంచ్ విప్లవం నినాదాలైన స్వేచ్ఛ, సమానత్వం సౌభ్రాతృత్వం రైన్ ప్రావిన్స్‌లో ప్రతిధ్వనించాయి. నెపోలియన్ ఆక్రమణలో ఉన్న రైన్‌లాండ్‌లో ఫ్రాన్స్ పునరుజ్జీవనోద్యమం విస్తృతంగా వ్యాపించింది. రైన్ ప్రావిన్స్‌లో వోల్టైర్, థామస్ పైన్ యొక్క రచనలు విద్యావంతులైన తరగతుల్లో బాగా ప్రాచుర్యం పొందాయి. ఫ్రెంచ్ పునరుజ్జీవ ఉద్యమ ప్రభావంతో సామాజిక, సంస్కృతిక జీవితంలోకి ప్రగతిశీల ఆలోచనలు విస్తృతంగా వ్యాపించాయి.

1813లో జరిగిన లీఫ్‌జిగ్ యుద్ధంలో రష్యా, ప్రష్యా, స్వీడన్, ఆస్ట్రియా కూటమి చేతిలో ఫ్రెంచ్ సైన్యం ఓడిపోయింది. ఫ్రాన్స్‌పై విజయం తర్వాత నాలుగు దేశాలు 1814-15లో వియన్నాలో కలుసుకొని రైన్ ప్రావిన్స్‌ను ప్రష్యాకు తిరిగి ఇవ్వాలని నిర్ణయించి ప్రష్యాలో విలీనం చేశారు. ప్రష్యన్ ప్రభుత్వం రైన్ ప్రావిన్స్‌లో కోడ్ నెపోలియన్ చట్టాన్ని రద్దు చేయకుండా కొనసాగించడానికి అనుమతించింది. నెపోలియన్ పాలనలో భూస్వామ్యవ్యవస్థ రద్దుతో రైన్ ప్రావిన్స్‌లో పెట్టుబడిదారులు అభివృద్ధి చెంది అనేక పరిశ్రమలను ప్రారంభించారు. ఖనిజ సంపదతో నిండి ఉన్న రైన్ ప్రావిన్స్ ప్రాంతంలో పెట్టుబడిదారులు అనేక భారీ పరిశ్రమలను స్థాపించటంతో పారిశ్రామికవేత్తలు, పారిశ్రామిక కార్మికుల పెరుగుదలకు దారితీసింది. అదేకాలంలో ప్రష్యా, జర్మనీలో చేతివృత్తులు, చిన్నతరహ పరిశ్రమలు అభివృద్ధి అయ్యాయి.

ప్రష్యన్ రాచరికం రైన్ ప్రావిన్స్‌లో అభివృద్ధి అవుతున్న పెట్టుబడిదారుల పెరుగుదలను అణిచివేసింది. పెట్టుబడిదారుల్లో ఈ చర్య తీవ్ర ఆగ్రహాన్ని కల్గించింది. ప్రష్యాలోని ఇతర ప్రాంతాల్లో రైన్ ప్రావిన్స్‌కి భిన్నమైన పరిస్థితి వుంది. భూస్వామ్య ప్రభువుల నుండి అభివృద్ధి అవుతున్న పెట్టుబడిదారులు తీవ్రమైన ప్రతిఘటనను ఎదుర్కొన్నారు. అంతిమంగా ఎదుగుతున్న పెట్టుబడిదారులుభూస్వామ్య వ్యవస్థపై ఆధిపత్యం సాధించారు. 1815లో జర్మనీలో ఉన్న 300 రాజ్యాలు, 39 ప్రాంతాలుగా విభజింపబడి ఏకీకృత జర్మనీ యూనియన్ ఉద్భవించింది. ఏకీకృత జర్మనీ యూనియన్‌లో ప్రష్యా అతిపెద్ద పాత్ర పోషించింది.

పదిహేనువేల జనాభా ఉన్న రైన్ ప్రావిన్స్‌లోని చిన్న పట్టణమైన ట్రయర్‌లో కార్ల్‌మార్క్స్ 1818, మే 5న జన్మించాడు. ఫ్రెంచి పునరుజ్జీవన ఉద్యమ మద్దతుదారుడుగా ఉన్న మార్క్స్ తండ్రి హేన్రిచ్ మార్క్స్ బాగా చదువుకున్న వ్యక్తే గాక ప్రగతిశీల ఆలోచనాపరుడు. కార్ల్ మార్క్స్ చిన్నతనంలోనే మానవత్వంతో, పేద, అణిచివేయబడ్డ వారిపట్ల సానుభూతి కలిగిఉన్నాడు. మార్క్స్ తన పాఠశాల ఆఖరి పరీక్షగా "ఒక వృత్తిని ఎంచుకోవడంలో ఓ యువకుని ఆలోచనలు" అన్న అంశంపై వ్యాసం రాయవలసి వచ్చింది.

మానవ సంక్షేమమూ మన సొంత పరిపూర్ణతా అన్నవి మాత్రమే వృత్తిని ఎంచుకోవడంలో మనకు ప్రధానంగా మార్గం చూపుతాయి. ఈ రెండు ప్రయోజనాల మధ్య ఘర్షణ ఉంటుందనీ, ఒకదాని కోసం రెండో దాన్ని వదులుకోవాల్సి ఉంటుందనీ అనుకోనక్కర్లలేదు. అందుకు విరుద్ధంగా మనిషి తన తోటి మానవుల పరిపుష్టి కోసమూ, వారి మేలు కోసమూ పనిచేయడం ద్వారానే తన సొంత పరిపూర్ణతని సాధిస్తాడు. ఇది మనిషి స్వభావంలోనే ఉంది. తానెంతో విలువనిచ్చి స్వీకరించిన వృత్తిని నిర్వహించగల అర్హత తనకు లేదేమోనన్న భావం కారల్‌మార్క్స్ భయంతో వణికేలా చేసింది. తాను ఎంచుకున్న మార్గం మానవజాతి సంక్షేమం, సమగ్రతకు సంబందించినది కావడం వలన చరిత్రలో అతని స్థానం చిరస్థాయిగా నిలిచిపోయింది.

మనం అత్యంత విలువనిచ్చే భావాలపై ఆధారపడిన వృత్తి సమాజంలో మనల్ని మరింత ఎత్తున నిలబెడుతుంది. మన జీవితానికి సార్థకతను ఇస్తుంది. మన కార్యకలాపాలను సవాలుచేయ వీల్లేనివిగా మారుస్తుంది.

ఒక వేళ మార్క్స్ మానవజాతి సంక్షేమం గురించి ఆలోచించకపోయినట్లైతే తను ప్రముఖుడైన భోధకుడిగా, మహర్షిగా, మహాకవిగా, గొప్ప యోగ్యతకల్గిన వ్యక్తిగా ఉన్నతమైన స్థాయిలో ఉండేవాడు. వ్యవస్థకు ప్రతిష్ట చేకూర్చేవారు ఎవరున్నా వారిని గొప్పవాడిగానే చరిత్ర పిలుస్తుంది. అందరి మంచి కోసం పనిచేయడం ద్వారా తమని తాము ఉదాత్తంగా మలుచుకొన్న వారినే చరిత్ర మహనీయులు అంటుంది. అత్యధిక ప్రజానీకానికి ఆనందాన్ని అందించిన వ్యక్తి అత్యంత ఆనందపరవశుడు అని కూడా అంటుంది. మానవజాతి కోసం తనను తాను అర్పించుకున్నవారినే అందరూ అనుసరించాలని మతం స్వయంగా చెబుతుంది. ఆ తీర్పుని కాదనగల ధైర్యం ఎవరికుంది ?

మానవజాతి కోసం మనం పనిచేయడానికి వీలు కల్పించే వృత్తిని ఎంపిక చేసుకుంటే మనల్ని ఏ భారమూ వంచలేదు. ఎందుకంటే అప్పుడు మనం చేసే త్యాగాలు అందరి కోసమూ. అప్పుడు మనం అనుభవించేది సంకుచితమైన, పరిమితమైన, స్వార్థపూరితమైన ఆనందం కాదు. అప్పుడది లక్షలాది ప్రజల ఆనందం, అదే మన ఆనందమవుతుంది. ఆప్పుడు మన కార్యకలాపాలు ఎప్పటికీ నిశ్చలంగా నిలిచి ఉంటాయి. అప్పుడు మన అస్థికల మీద ఉదాత్త మానవులవెచ్చటికన్నీళు ్ళ ఏకారతాయి.

కార్ల్‌మార్క్స్ లా విద్యార్థిగా బాన్

**"హెగెల్ రాజకీయ, సైద్ధాంతిక భావాలను అంగీకరించడానికి మార్క్స్ ఇష్టపడలేదు. మార్క్స్ సహజంగా భూస్వామ్య వ్యవస్థ, రాచరికాన్ని వ్యతిరేకించాడు. సాంఘీక అభివృద్ధికి అధిక ప్రాధాన్యతను ఇచ్చే ప్రష్యా రాచరికమే అత్యుత్తమమని చెబుతున్న హెగెల్ వాదనను మార్క్స్ అంగీకరించలేదు. ప్రష్యాలో ప్రజాస్వామ్యాన్ని అడ్డుకుంటున్న రాచరికం, భూస్వాములు, పెత్తందార్లు ప్రత్యామ్నాయం కాదు."**

యూనివర్శిటిలో చేరిన తర్వాత అతనిలో విత్తనంగా ఉన్న నాస్తికత్వం మొక్కగా ఎదిగింది. అతనిలో దేవుడి గురించి, మతం గురించి ప్రశ్నలు తలెత్తాయి. సందేహాలు తెలుసుకునే ప్రయత్నంలో మార్క్స్ తన తండ్రికి ఉత్తరం రాశాడు. మార్క్స్ సందేహాలకు సమాధానం ఇస్తూ హేన్రిచ్ దేవుడిపై, మతంపై విశ్వాసం కల్గించే విధంగా జవాబు రాశాడు.

నీవు మంచి నైతిక విలువలతో కొనసాగుతావు. నాకు అందులో సందేహం లేదు. కాని నైతికతకు గొప్ప మద్దతు దేవుడిపై స్వచ్ఛమైన విశ్వాసంలో ఉంది. దేవుని పైన మూఢ భక్తి కలవాడిగా మనిషి ఉండకూడదని లేఖలో రాశాడు. జీవితంలో కొన్ని సంఘటనలు జరిగినప్పుడు అప్రయత్నంగానే నాస్తికుడు కూడా అసంకల్పితంగా దేవుడి ఆరాధన మొదలు పెడతాడు. ఇది సహజం. న్యూటన్, లాక్, లైబ్నిజ్ దైవత్వాన్ని విశ్వసించారు అని జవాబు రాసాడు హేన్రిచ్. కానీ మార్క్స్ హేన్రిచ్ సమాధానంతో ఏకీభవించలేదు. క్రమంగా అతను దేవుడిపై, మతంపై విశ్వాసం కోల్పోయాడు.

ఇదే సమయంలో ప్రష్యాలో రాచరిక వ్యవస్థ నడుస్తున్నది. 3వ ఫ్రెడరిక్ విలియం, భూస్వాములు (జుంకార్స్) సామాజికంగా, రాజకీయంగా ప్రజల జీవితాలపై ఆధిపత్యం చలాయిస్తున్నారు. ఎదుగుతున్న పెట్టుబడిదారులు భూస్వాముల నుండి అడ్డంకులు, ఆంక్షలను ఎదుర్కొంటూ అభివృద్ధి అయ్యారు. పెట్టుబడిదారులు తయారు చేసిన వస్తువులపై సుంకాలను, విదేశీ వస్తువులపై ఆంక్షలను విధించమని భూస్వాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కానీ ప్రభుత్వం సుంకాలు వేయడానికి అంగీకరించలేదు. ప్రభుత్వ అమలుచేస్తున్న పన్నువిధానంపై పెట్టుబడిదారులకు వ్యతిరేకత ఉన్నా రాచరికంతో ఘర్షణ పడటానికి సిద్ధపడలేదు. బూర్జువా ప్రజాస్వామ్య బావాలున్న రైన్‌ల్యాండ్‌లో ఎదుగుతున్న పెట్టుబడిదారులు ప్రభుత్వానికి తమ డిమాండ్స్ విన్పించడానికి, హక్కులను సాధించుకోవడానికి దిన, వార, పక్ష పత్రికలు తీసుకువచ్చారు.

కార్ల్ మార్క్స్ బాన్ విశ్వవిద్యాలయంలో రెండు పర్యాయాలు మాత్రమే ఉన్నారు. ఆ తరువాత మార్క్స్ తండ్రి అతన్ని బెర్లిన్ విశ్వవిద్యాలయంలో చదువు కొనసాగించమని చెప్పారు. లా కోర్సుకు అనుభవం ఉన్న అధ్యాపకులు బెర్లిన్ యూనివర్శిటీలో ఉండటంతో మార్క్స్ అక్కడే లా పూర్తి చేశాడు. బెర్లిన్ విశ్వవిద్యాలయంలో మార్క్స్ లాకోర్సుతో పాటు చరిత్ర, కళలు, విదేశీ భాషలను అధ్యయనం చేశాడు. మార్క్స్ తత్వశాస్త్రం వైపు ఆకర్షించబడ్డాడు. సామాజిక జీవనంలో తత్వశాస్త్రం ఎలాంటి పాత్ర పోషిస్తుందనేది తెలుసుకోవడానికి మార్క్స్ తత్వశాస్త్రాన్ని అభ్యసించాడు. తత్వశాస్త్రంలో ప్రముఖ జర్మనీ తత్వవేత్త జార్జ్ విల్‌హెల్మ్ హెగెల్ రచించిన జర్మన్ తత్వశాస్త్రం పుస్తకాలను 1837లో మార్క్స్ అధ్యయనం చేశాడు.

ప్రభుత్వ అధికారి కుమారుడైన హెగెల్ 1770లో స్టట్‌గార్డ్‌లో జన్మించాడు. అతను 1818 వరకు జెనా విశ్వవిద్యాలయంలో, తర్వాత బెర్లిన్ యూనివర్శిటీలో తత్వశాస్త్రం బోధించాడు. అతను రాసిన ఆత్మ యొక్క దృగ్విషయం, సైన్స్ ఆఫ్ లాజిక్, ఎన్‌సైక్లోపీడియా ఆఫ్ ఫిలాసాఫికల్ సైన్స్ తదితర పుస్తకాలు జర్మనీలో చాలా ప్రాచుర్యం పొందాయి. అతను రాడికల్ స్వభావం గల తత్వవేత్త. భూస్వామ్య వ్యవస్థను వ్యతిరేకిస్తూ, ఫ్రెంచి విప్లవాన్ని స్వాగతించినవాడు. అతను భవిష్యత్ బూర్జువాతత్వవేత్తగా పరిగణించబడ్డాడు. బూర్జువా వర్గం ద్వంద్వ స్వభావం కల్గి ఉండి ఒక వైపు రాజరికానికి కీలక మద్దతుదారుగా ఉంటూ, రాజీపడుతూ, రెండవ వైపు రాచరికానికి, భూస్వామ్య పెత్తందార్లకి వ్యతిరేకంగా పోరాడారు. హెగెల్ తత్వశాస్త్ర రచనల్లో ఈ ద్వంద్వ స్వభావ ప్రభావం స్పష్టంగా కనపడుతుంది.

అతను తాత్విక పద్ధతులను, సూత్రాలను రూపొందించాడు. అతను రూపొందించిన సూత్రాలు, ఆలోచనలు, ఊహలు ప్రభుత్వాల అభివృద్ధికి తోడ్పడ్డాయి. అంతర్గత వైరుధ్యాలు అభివృద్ధికి దారితీస్తాయని చెప్పాడు. ప్రతి విషయంలోనూ ఉండే పరస్పర విరుద్ధమైన అంతర్గత వైరుధ్యాలు అంతర్లీనంగా అభివృద్ధికి, మార్పు వైపుకు దారితీస్తాయి. అభివృద్ధి రూపురేఖలు పూర్తిగా మూసుకుపోవు. అవి ఎప్పుడూ అభివృద్ధి వైపే ఉంటాయి. దిగువ స్థాయి నుండి ఉన్నతస్థాయికి మార్పు జరుగుతుంటుంది. గతితార్కిక సూత్రాలైన పరిమాణాత్మక మార్పులు, గుణాత్మక మార్పులకు దారితీస్తాయి. అయితే అంతర్గతంగా ఉండే వైరుధ్యాలు అభివృద్ధికి మూలం. తత్వశాస్త్ర సూత్రాలు ఒకదానికొకటి పరస్పర ఆధారితం, ప్రభావితం చేసేవిగా ఉంటాయని హెగెల్ చెప్పాడు.

బెర్లిన్ యూనివర్శిటీలో చేరడానికి ముందే మార్క్స్‌కి హెగెల్ గురించి కొన్ని ఆలోచనలు ఉన్నాయి. హెగెల్ రాసిన అన్ని పుస్తకాలు చదవడానికి మార్క్స్‌కి సమయం దొరకలేదు. అందుకే అతని పుస్తకాలన్నీ తీసుకెళ్ళి అధ్యయనం చేయాలని నిర్ణయించుకున్నాడు. హెగెల్ తర్కశాస్త్రం, అజ్ఞేయవాదం పట్ల వ్యతిరేకత, అతని చారిత్రక పద్ధతి, మనిషి పాత్రపై అతనికున్న విశ్వాసం, శాస్త్రీయంగా విశ్లేషించే పద్ధతి మార్క్స్‌ని బాగా ఆకర్షించింది. హెగెల్ రచనలన్నింటిలో కల్లా తర్కశాస్త్రం మార్క్స్‌ని బాగా ప్రభావితం చేసింది.

హెగెల్ రాజకీయ, సైద్ధాంతిక భావాలను అంగీకరించడానికి మార్క్స్ ఇష్టపడలేదు. మార్క్స్ సహజంగా భూస్వామ్య వ్యవస్థ, రాచరికాన్ని వ్యతిరేకించాడు. సాంఘీక అభివృద్ధికి అధిక ప్రాధాన్యతను ఇచ్చే ప్రష్యా రాచరికమే అత్యుత్తమమని చెబుతున్న హెగెల్ వాదనను మార్క్స్ అంగీకరించలేదు. ప్రష్యాలో ప్రజాస్వామ్యాన్ని అడ్డుకుంటున్న రాచరికం, భూస్వాములు, పెత్తందార్లు ప్రత్యామ్నాయం కాదు. హెగెల్ వాదనలపై మార్క్స్‌కి భిన్నాభిప్రాయాలు, సందేహాలున్నాయి.

దేవునిదే చివరి నిర్ణయం అనే హెగెల్ వాదనలు, అతను బోధించిన విభిన్న సిద్ధాంతాలు మార్క్స్ భావనలకు వ్యతిరేకం. కారల్ మార్క్స్ మతవిశ్వాసాలు, సిద్ధాంతాల నుండి బయటకు వచ్చి నాస్తికుడయ్యాడు. హెగెల్ అభిప్రాయాలతో మార్క్స్ అంగీకరించక పోయినప్పటికీ వాటిని ఎలా సరిచేయాలనేది మార్క్స్‌కి తెలియదు.

(ఎన్ ఔట్‌లైన్ హిస్టరీ ఆఫ్ ది కమ్యూనిస్టు మూవ్‌మెంట్ ఆఫ్ ది వరల్డ్ నుండి తీసుకోబడినది)

**(అనువాదం : కె.హరికిశోర్)**

# ఉద్యమకారిణికి వేధింపులు

**అనుపమ కటకం**

ఆగస్టు, 2016న ముంబైలో తీస్తా సెతల్వాద్, జావెద్ ఆనంద్‌లు ఒక ప్రదర్శనను ఉద్దేశ్చించి మాట్లాడుతూ దళితులు, ముస్లింలపై పెరుగుతున్న గో రక్ష దళాల దాడులను ఖండించారు.

ఫిబ్రవరి 27,2012న అహ్మదాబాదులోని గుల్‌బర్గ్ సొసైటి వద్ద జరిగిన సామూహిక మారణకాండ దశమ వార్షికోత్సవం సందర్భంగా గుజరాత్ సామూహిక హత్యాకాండ బాధితుల తరపున మానవహక్కుల కార్యకర్తలు తీస్తా సెతల్వాద్ తమ పోరాటాల ద్వారా అధికారులపై తెస్తున్న వత్తిడి కారణంగా వారికి వ్యతిరేకంగా బనాయిస్తున్న కేసులకు సుదూరం లో అంతం కనిపించడం లేదు. నీతి నిజాయితీలకు పేరుగాంచిన ఒక పత్రికా సంపాదకుడు సైతం ఆమె విశ్వసనీయతను ఒకసారి ప్రశ్నించాడు. తీస్తా సెతల్వాద్‌ను అపఖ్యాతిపాలు చేసే ప్రచారకాండ అంతగా విజయవంతమైంది.

తీస్తా సెతల్వాద్ ఒక పత్రికా ప్రతినిధి, మానవహక్కుల ఉద్యమకారిణి. ఆమె భర్త జావెద్‌ఆనంద్ అల్పసంఖ్యాకుల హక్కుల ఉద్యమ కార్యకర్త. 2015లో వారిపై మోపబడిన నిధుల దుర్వినియోగం వంటి ఆరోపణలపై అలుపెరగని పోరాటం చేస్తున్నారు. అప్పటి నుండి నిర్బంధపు హెచ్చరికల నీడలో జీవిస్తున్నారు. సుప్రీంకోర్టు నుండి ముందస్తు బెయిల్ పొంది జీవనం సాగిస్తున్నారు.

తీస్తా సెతల్వాద్‌ను నిర్బంధించటానికి అంత తొందర ఎందుకు? ఆమె నిర్బంధించబడితే 2002 గుజరాత్ అల్లర్ల కేసులపై విచారణకు పోరాడుతున్న శక్తి ధ్వంసమైందని అర్థం చేసుకోవాలా? ప్రధానమంత్రి నరేంద్ర మోడి, ఆయన రాజప్రతినిధి అమిత్‌షా వంటి అధికారంలోని శక్తివంతులను ఎదిరించడం, ప్రశ్నించడం చేసేవారికి ఆమెపై మోపిన కేసు ఒక హెచ్చరికగా ఉపయోగపడుతుందా? ఆమెపై మోపబడిన అభియోగాలు తప్పుడువని ఆమె పదే పదే చెప్తూనే ఉన్నారు.

గుజరాత్ అల్లర్ల బాధితులు న్యాయం పొందడానికి ఆమె చేస్తున్న పోరాటం నిర్భీతితో కూడిన అంకిత భావం, నిబద్ధత ఆ రాష్ట్ర ప్రభుత్వానికి, ప్రత్యేకంగా రాజకీయ నాయకులకు, న్యాయాధికారులకు హెచ్చరికగా నిలిచిందని పరిశీలకులు అంటున్నారు. జకియా జాఫ్రి / గుల్‌బర్గ్ సొసైటి కేసులో మోడీ పేరు ఉన్నది. ఆ కేసు ఇంకా ముగియలేదు. తీస్తా సెతల్వాద్ కనుక జైలుకు వెళితే ఆ కేసును నిర్వీర్యం చేసేందుకు దారితీసి అంతిమంగా అది ముగించబడుతుందా? తీస్తా సెతల్వాద్ గుజరాత్ సామూహిక మారణకాండ కేసులను తీసుకొని అందులో పాలుపంచుకున్న వందలాది మంది దోషులకు శిక్షలు పడేలా చేయడం దగ్గర నుండి బెదిరింపులు, ప్రచార మాధ్యమాల దుష్ప్రచారాన్ని ఆమె ఎదుర్కొంటున్నారు. ఆమె, ఆమె సంస్థ సబ్‌రంగ్ ట్రస్టు వెంటపడిన గుజరాత్‌లోని అగ్రగామి సాంఘీక ఆరాచక శక్తులు ఈనాడు ఉన్నతస్థాయిలో అధికారాన్ని చెలాయిస్తున్నారు. అప్పటి నుండి ఆమెపై ఎన్నో అసత్యమైన అభియోగాలు మోపారు. ఆమె పరిస్థితి విషమంగామారింది. మోసపూరితంగా డబ్బుకాజేశారన్న నేరారోపణపై నిర్బంధాన్ని ఎదుర్కొనే ప్రమాదం నుండి తీస్తా సెతల్వాద్, ఆనంద్‌లను 2015లో యాటిసిపేటరి బెయిల్ రక్షించింది. అప్పటి నుండి వారి బ్యాంకు ఖాతాలు స్తంభింపచేశారు. వారి కదలికలపై నిఘా పెట్టారు. వారి ప్రయాణాలు క్లిష్టతరం చేయబడినవి. వీటికంటే ఆమె వ్యక్తిత్వానికి తగిలిన దెబ్బ తీవ్రమైనది. ఆ విద్వేష ప్రచారం నుండి కోలుకోవడం కష్టమైనదని, అది ఆమెను ఆగౌరవపరిచే వారికి విజయమని చాలామంది అంటున్నారు.

తీస్తా సెతల్వాద్ కార్యదర్శిగా ఉన్న “సిటిజన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్ (సిజెపి) “తరపున ఆమె మాట్లాడుతు “గుజరాత్ రాజధాని గాంధీనగర్ మొదట దేనినైతే అజ్ఞాపించిందో దానినే నేడు న్యూఢిల్లీ అమలు పరుస్తున్నది. గుజరాత్ పోలీసులు, కేంద్ర హోంశాఖ, కేంద్ర నేర పరిశోధనాసంస్థవంటి వన్నీ మానవహక్కుల పరిరక్షకులకు వ్యతిరేకంగా మోహరించబడ్డాయి. రాజకీయంగా ప్రేరేపించబడిన ఈ వేట తనపై కొనసాగుతున్నప్పటికీ న్యాయంకోసం తమ పోరాటం ఆగదని ఆమె చెప్పారు.

ఈ దంపతులను ప్రభుత్వం పీడిస్తున్నది, బెదిరింపులకు గురిచేస్తున్నదనే అంశంపై ఎన్నో ప్రఖ్యాతి గాంచిన అంతర్జాతీయ ప్రచురణ సంస్థలు కథనాలను, వార్తలను ప్రచురిస్తూనే ఉన్నాయి. వాస్తవానికి, మానవహక్కుల కార్యకర్తలకు రక్షణగా నిలవడానికి ఉద్దేశించిన ప్రఖ్యాతమైన అంతర్జాతీయ సంస్థలు, ప్రథమశ్రేణి మద్దతుదారులు తరుచుగా తీస్తా సెతల్వాద్‌కు బాహాటంగా మద్దతు తెలుపుతున్నారు. ఐక్యరాజ్యసమితి ప్రత్యేక సౌహార్ద ప్రతినిధులు కూడా ఈవేధింపులపై తమ విచారాన్ని వ్యక్తపరిచారు. భారతీయ అల్పసంఖ్యాకుల సామూహిక మారణకాండను పర్యవేక్షించడానికి బాధ్యులుగా నిర్ధారించబడిన సంస్థలు విద్వేషపూరిత పరిపాలనలో ప్రజాఉద్యమ కార్యకర్తలు, వారి సంస్థను కూడా లక్ష్యంగా చేసుకున్న వాస్తవాన్ని గురించి చెప్పాయి. మోసపూరితంగా డబ్బు దొంగిలించారని, అక్రమంగా వినియోగించడం, సామాజికంగా రెచ్చగొట్టే అంశాలను ప్రచురించడం, సాక్షులను హింసించడం వంటి అంశాలన్నీ అసత్యం, నిరాధారమని ప్రకటిస్తున్నాం” అని భారతదేశంలోని ప్రధాన న్యాయస్థానాలు వ్యాఖ్యానించాయి. విద్యాసంబంధమైన అంశాలపై పనిచేసే ఖోజ్ అనే ప్రభుత్వేతర సంస్థ నిధులు దుర్వినియోగం జరిగాయనే అభియోగం చేయటం తీస్తా సెతల్వాద్‌ను నిర్బందంలోకి తీసుకోవడానికి దారితీసింది. ఈ సంస్థను ఆమె స్థాపించింది. మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ పరిధిలోని కేంద్రీయ విద్యా సలహామండలిలోని ఆమె పదవిని ఉపయోగించి, సర్వశిక్షాభియాన్ కార్యక్రమం నుండి తన సంస్థకు నిధులు పొందడానికి ఆమె ప్రయత్నం చేశారని ఆరోపించబడింది. 2010

(మిగతా 35వ పేజీలో)

# అమిత్‌సేన్ గుప్తా

(2వ పేజీ తరువాయి)

కారం లేకుండానే వేరే కంపెనీ ఉత్పత్తి చేసి, అమ్మటానికి కంపల్సరీ లైసెన్సింగ్ విధానం కింద ట్రిప్స్ ఒప్పందంలోని క్లాజ్ ప్రభుత్వానికి అవకాశం కల్పిస్తుంది. ఈ క్లాజ్‌ను సవాలు చేస్తే బేయర్ కంపెనీ తమ యాంటీ కాన్సర్ ఔషదం 'నెక్సావార్' విషయంలో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే వారు చెప్పిన విషయాలను సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. వారు నూతన అంశాలను కనిపెట్టారనటానికి ఎటువంటి ఆధారాలు చూపలేదని కోర్టు వ్యాఖ్యానించింది. నూతన ఆవిష్కరణలకు సంబంధించిన సెక్షన్ 3 డి ప్రభావం ఈ తీర్పుపై ఉంది. అనంతరం భారతీయ కంపెనీలే గ్లీవెక్, నెక్సావార్ ఔషదాలను తయారు చేసి, ప్రపంచ వ్యాప్తంగా తక్కువ రేటుకే అమ్ముతున్నాయి. పై రెండు సెక్షన్ల వలన ప్రముఖ బహుళజాతి ఔషధ కంపెనీలు భారతదేశంలో పేటెంట్ విధానాన్ని పూర్తిగా అమలు చేయలేకపోతున్నాయి.

అనంతరం 2014లో ప్రధాని నరేంద్ర మోడీ యుఎస్‌లో పర్యటించారు. ఈ సమయంలో డిఫెన్స్, అణుశక్తి ఒప్పందం, ఫార్మాస్యూటికల్స్ విషయంలో మూడు ఇండో-యుఎస్ వర్కింగ్ గ్రూపులను ఏర్పాటు చేశారు. రక్షణ ఒప్పందాలు చేసుకోవటానికి, అణు ప్రమాదం జరిగినపుడు సరఫరాదారుల బాధ్యతలను తప్పించటంలో ఈ గ్రూపుల ద్వారా అమెరికా సఫలమైంది. ఔషద పేటెంట్ చట్టంలో ఉన్న సెక్షన్ 3డిని తీసివేయించటం, తప్పనిసరి లైసెన్స్ నిబంధనను సడలించేందుకు ఈ గ్రూపు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నది. భారత్‌లో పేటెంట్ విధానాన్ని ప్రవేశపెట్టటానికి మోడి ప్రభుత్వం ఇప్పటికీ తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ప్రస్తుతం ఇందుకు గానూ బిజెపి ప్రభుత్వం పాలనాపరంగా అనేక చర్యలు తీసుకుటోంది.

**ప్రజాసైన్స్ ఉద్యమంలో కృషి**

ప్రజా సైన్స్ ఉద్యమాల్లో సేన్ ప్రధాన బాధ్యతలు తీసుకున్నాడు. 40 స్థంస్థలను కలిపి ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ (ఎఐపిఎస్ఎన్) ఏర్పాటులో ప్రముఖ పాత్ర పోషించాడు. పిఎస్ఎం ఆధ్వర్యంలో ఇండియా మొత్తం మీద సైన్స్ ఉద్యమాలు సాగుతున్నాయి. తన ఉద్యమ సహచరులతో కలిసి 1987లో భారత్ జనవిజ్ఞాన యాత్ర, 1990లో భారత్ జ్ఞాన్ విజ్ఞాన్ యాత్ర చేపట్టారు. 1990 దశాబ్దంలో ఢిల్లీ ప్రజల అక్షరాస్యతను పెంచేందుకు స్థానిక మహిళలు, యువకులు ఏర్పాటు చేసిన ఢిల్లీ సాక్షరతా సమితి(డిఎస్ఎస్) సంస్థ కార్యక్రమాల్లో కూడా పాలు పంచుకున్నాడు.

1999-2003సమయంలో ఎఐపిఎస్ఎన్ సంస్థకు కోశాధికారిగా, 2007 -11 వరకు ప్రధాన కార్యదర్శిగా సేన్ పనిచేశారు. ఈ సంస్థ ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టేందుకు, అందుకు వనరులు సమకూర్చడంలో అమిత్ సేన్ ఎంతో కృషి చేశారు. ఉద్యమ సహచరులతో కలిసి పెట్టుబడిదారీ ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా ప్రపంచ సామాజిక సంస్థలో సేన్ కీలకపాత్ర పోషించాడు. ఈ నేపథ్యంలో 2003న హైదరాబాద్‌లో దేశ స్థాయి, 2004న ముంబైలో ప్రపంచ స్థాయి సమావేశాలు నిర్వహించారు.

ఇండియాలో జరుగుతున్న ప్రజారోగ్య ఉద్యమాలపై ఇటీవల ఆయన దృష్టి సారించాడు. దీంతో పాటు 2000 నుంచి అతను సభ్యుడుగా, అనంతరం జాయింట్ కన్వీనర్‌గా ఉన్న ప్రపంచ ఆరోగ్య ఉద్యమంలో పాల్గొన్నాడు. అనేక ప్రపంచ దేశాలు పాల్గొనే ద్వైవార్షిక సమావేశాలైన నవంబర్ 2018లో ధాకాలో నిర్వహించిన ప్రపంచ ఆరోగ్య సమావేశాల జయప్రదానికి కృషిచేశారు. ముందుగా రాయ్‌పూర్‌లో ప్రజారోగ్య సమావేశాలు ఏర్పాటు చేశారు. ధాకాలో ఈ సమావేశాల నిర్వహణకు మూడు వారాల వరకూ కష్టపడిన అమిత్‌సేన్ ఆ తరవాత కొన్నిరోజులువిహారయాత్రకు వెళ్లాలనుకున్నాడు. సేద తీరేందుకు గోవా వెళ్లిన సేన్ తిరిగి రాలేదు. ప్రమాదవశాత్తూ జరిగిన ఘటనలో అయన మనకు దూరమయ్యాడు.

అమిత్‌సేన్ 1978 నుంచి సిపిఎంలో సభ్యునిగా ఉన్నారు. ఆయన పాల్గొన్న అన్ని ఉద్యమాల్లో రూపొందించిన విధానాలను అమలు చేశాడు. అయన ఆల్ ఇండియా పాపులర్ సైన్స్ కమిటీకి కన్వీనర్‌గా, పీపుల్స్ డెమొక్రసీలోని సైన్స్ అభివృద్ధిపై ఉండే వ్యాసాలకు బాధ్యునిగా ఉండేవారు. ఢిల్లీలో జరిగే వైద్య శిబిరాలు, ఉద్యమకారులు నిర్వహించే అనేక ర్యాలీల్లో అమిత్‌సేన్ పాల్గొంటూ వస్తున్నారు. పార్టీ సభ్యుల కోసం అనేక వైద్య శిబిరాలు నడిపారు. యుపిఎ-1 హయాంలో వచ్చిన ఇండియన్ పేటెంట్ హక్కుల చట్టం ఆమోదం కోసం అనుసరించాల్సిన విధానాలు, చేపట్టాల్సిన సవరణలపై పార్టీకి అనేక సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రముఖ ఫార్మసీ కంపెనీలకు వ్యతిరేకంగా, ప్రజలకు అనుకూలంగా ఉండే ఈ సవరణలతో పార్లమెంట్‌లో ఈ చట్టం ఆమోదంలో ఈ సూచనలు, సలహాలు ముఖ్య పాత్ర పోషించాయి.

ప్రస్తుతం క్లిష్టంగా మారుతున్న పరిస్థితుల్లో అమిత్‌సేన్ చేసిన కృషిని ముందుకు తీసుకుపోవటానికి ప్రయత్నం చేస్తున్నవారు మరింత అప్రమత్తంగా, మరింత కష్టమైన పోరాటాలకు సన్నద్ధం కావాలి. ఏదేమైనా మేథో సామర్థ్యం, కష్టించే తత్వం, పోరాట పటిమ కలిగిన అమిత్ సేన్ గుప్తాను కోల్పోవడం చాలా బాధాకరం. అయన మృతికి సిపిఎం సంతాపం తెలుపుతూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటిస్తు న్నది. అమిత్ సేన్ పనిచేసిన ఇతర సంస్థలకు కూడా సంఘీభావం తెలిపింది. (పీపుల్స్ డెమొక్రసి సౌజన్యంతో) **అనువాదం: పంకా వేణుగోపాల్**


# ఉద్యమకారిణికి వేధింపులు

(34వ పేజీ తరువాయి)

నుండి 2013 మధ్యలో విద్యా మంత్రిత్వశాఖ సబరంగ్ ట్రస్టుకు విడుదల చేసిన నిధులను వారి వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలకు అక్రమంగా వినియోగించారని నేరపరిశోధన విభాగం పేర్కొంది. "జాతీయ సమగ్రతకు" భంగకరంగా "సామాజిక విద్వేషాన్ని ప్రేరేపించే" కరపత్రాలను, సాహిత్యాన్ని ఆ దంపతులు ముద్రించారని కూడా గుజరాత్ నేరపరిశోధనా విభాగం చెప్పింది. ఖోజ్ ప్రాజెక్టులో భాగంగా ముద్రించిన సామాజిక వర్గాల సామరస్యతకు సంబందించిన పుస్తకాలు, వాస్తవంలో అది మతవైషమ్యాన్ని విద్వేషాన్ని వ్యాపింపజేస్తున్నాయని పోలీసులు తెలిపారు. తీస్తా సెతల్వాద్ ఇది అత్యంత మోసపూరితమైన నేరారోపణ అని పేర్కొన్నారు. వీరు సాక్ష్యాలను రూపుమాపుతారన్న ప్రాతిపదికపై పోలీసులు ఆమె, ఆనంద్ బెయిల్ దరఖాస్తును వ్యతిరేకించారని సిజెపి తన ప్రకటనలో తెలిపింది. ఖోజ్‌ప్రాజెక్టు 2010లో ప్రారంభమై 2014 జనవరికి ముందే ముగిసింది. ఆ సమయంలోనే మోసపూరితంగా డబ్బు దొంగిలించిన కేసుకు సంబంధించిన బ్యాంకు ఖాతాలు స్తంభింపచేశారు. మోసపూరితంగా డబ్బు దొంగిలించిన దానికి సాక్ష్యాలు బ్యాంకు ఖాతాలోనే ఉంటాయి. ఆ ఖాతాలు స్తంభింపజేసినప్పుడు ఆమె ఏ విధంగా సాక్ష్యాలను రూపుమాపగలదనే ప్రశ్న ఉదయిస్తుంది. ఆమెను ఆ నెపంపై నిర్బంధించి ప్రశ్నించడానికి వేసిన ఎత్తుగా చాలామంది ఆందోళన పడుతున్నారు. మోడి ప్రధానమంత్రి అయిన తర్వాత 2015 నుండి తీస్తా సెతల్వాద్‌పై వేట వేగం పుంజుకుంది. "ఫ్రంట్‌లైన్" పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో "ప్రభుత్వ మార్గానికి అడ్డువచ్చినవారిని ఎవరిని అది వదిలిపెట్టదు. వారిని వేటాడతారు. భయపెడతారు, కేసులలో ఇరికిస్తారు. విచారణలను ఎదుర్కొంటారు, అంతిమంగా నాశనం చేయబడతారు" అని ఆమె చెప్పిన మాటలు ముందుచూపుతో చెప్పినవిగా ఈ రోజు కనిపిస్తున్నాయి.

**అనువాదం: కందుల శశికుమార్**

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-01-2019 (36 pages) Postal Regd. No D/VJ/172/2018-20



# వర్గ పోరాటంతోనే మహిళా విముక్తి

**క్లారా జెట్కిన్**

"జర్మన్ సోషల్ డెమోక్రటిక్ పార్టీలో 1907లో 29,458 మంది మహిళలు సభ్యులుగా చేరారు. 1908 లో ఈ సంఖ్య 62,257కు పెరిగింది. గత 12 నెలల కాలంలో సోషలిజం కోసం జరిగిన ప్రచార ఫలితాలను ఈ అంకెలు ప్రతిబింబిస్తున్నాయి. మహిళలు రాజకీయ కార్యకలాపాలలో పాల్గొనటానికి, సభ్యులుగా చేరటానికి ప్రభుత్వం 1908లో అనుమతించింది. అప్పటి వరకు మహిళల రాజకీయ కార్యకలాపాలకు సంబంధించిన చట్టాలు ఫెడరేషన్‌లోని రాష్ట్రాలలో భిన్నంగా ఉన్నాయి. ఎక్కువ రాష్ట్రాలలో ఉన్న చట్టాలు మహిళలు రాజకీయ పార్టీలలో సభ్యులు కావటాన్ని నిషేధించాయి. అధికారులు ఈ చట్టాలకు తప్పుడు భాష్యాలు చెబుతూ వివిధ సంఘాలు, సంస్థలలో చేరిన మహిళలకు కఠినశిక్షలు విధించేవారు. కొన్ని రాష్ట్రాలలో మే నెల వరకు మహిళలు రాజకీయ సమావేశాలు, బహిరంగసభలు, సమావేశాలకు హాజరు కావటాన్ని నిషేధించారు. కాలం చెల్లిన, నిరంకుశమైన చట్టాలున్నప్పటికీ, అధికారులు వాటిని కఠినంగా అమలు జరుపుతున్నప్పటికీ 30,000 మంది మహిళలు పార్టీ సభ్యులుగా చేరటం, ఒక్క సంవత్సరంలోనే ఆ సంఖ్య రెట్టింపు కావటం వారిలో ఉన్న పట్టుదల, వర్గ చైతన్యంతో కూడిన కట్టుబాటును వెల్లడిస్తున్నది. సోషల్ డెమోక్రటిక్ పార్టీ 257 స్థానిక విభాగాలలో ఒక్కో మహిళ చొప్పున కమిటీలలోకి ఎన్నికయ్యారు. ఇంకా 50కి పైగా విభాగాలలో అటువంటి కమిటీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. మహిళా సభ్యులను సైద్ధాంతికంగా చైతన్యపరచటం, రోజువారీ పనిలో అభివృద్ధి చేయటం కోసం పార్టీ విభాగాలు 150కి పైగా ఉపన్యాసాలు, అధ్యయన సమావేశాలు నిర్వహించాయి. కార్మిక మహిళలు, కార్మికుల భార్యలలో సోషలిస్టు ప్రచారం నిర్వహించటం కోసం పార్టీ అనేక వందల బహిరంగ సభలు జరిపింది. ఈ సభలలో ఎక్కువగా మహిళా కామ్రేడ్స్ ప్రసంగించారు. వారిలో శ్రామిక మహిళలు గణనీయంగా ఉన్నారు.

"వారి ఇతర కార్యకలాపాలతో పాటు మహిళల పూర్తి రాజకీయ విముక్తి కోసం సోషలిస్టు మహిళా కామ్రేడ్స్ తమ ప్రచారాన్ని కొనసాగించాలి. శ్రామిక మహిళలను చైతన్యపరచటం, శిక్షణ ఇవ్వటం, వారిని నిర్మాణంలోకి ఇముడ్చుకోవటం కార్మికవర్గం నిర్వహిస్తున్న రాజకీయ పోరాటాలలోకి మహిళలను సమీకరించటం కోసం ఎస్‌డిపి చేస్తున్న కృషి కన్నా తక్కువ ప్రాధాన్యత కలది కాదు. రాజకీయ, కార్మికవర్గ సంస్థలు మహిళా కామ్రేడ్స్ చేస్తున్న కృషికి పూర్తి తోడ్పాటును ఇవ్వాలి. కాని వాటి అభివృద్ధి, విస్తరణ, పరిపక్వత మహిళా కామ్రేడ్స్ స్వయంకృషిపై ఆధారపడి ఉంటుందని నొక్కిచెప్పాలి.

"సోషలిస్టు సిద్ధాంతం, సూత్రాల గురించి పూర్తి అవగాహన, విప్లవ చైతన్యం కలిగి ఉండటం జర్మనీ సోషలిస్టు మహిళా ఉద్యమంలో ముఖ్యమైన అంశంగా ఉంది. మహిళల సామాజిక విముక్తి మొత్తం సామాజిక ఉద్యమాభివృద్ధితో ముడిపడి ఉందని, దానిని వేగవంతం చేసేది ఆర్థిక అంశాలపై పోరాటాలని ఈ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న మహిళలకు పూర్తి అవగాహన ఉంది. శ్రామికుల సామాజిక విముక్తి పైనే మహిళల సమగ్ర విముక్తి ఆధారపడి ఉంది. దోపిడీకి గురవుతున్న మెజారిటీ ప్రజలు సాగించే వర్గ పోరాటంతోనే దానిని సాధించటం సాధ్యమౌతుంది. కాబట్టి బూర్జువా మహిళా హక్కుల కార్యకర్తలు చెప్పే విధంగా వర్గాలతో నిమిత్తం లేకుండా మహిళలందరూ రాజకీయ రహితంగా, ఎవరితోనూ నిమిత్తం లేకుండా మహిళల హక్కుల కోసం మాత్రమే పోరాడాలనే వాదనను సోషలిస్టు మహిళలు గట్టిగా వ్యతిరేకించాలి. పురుషులు, మహిళల మధ్య ఉన్న వైరుధ్యాల కన్నా వర్గ వైరుధ్యాలు శక్తివంతమైనవి, నిర్ణయాత్మకమైనవని, అందువలన వర్గ వైరుధ్యాలతో నిమిత్తం లేకుండా మొత్తం మహిళలు కలిసి చేసే పోరాటాల ద్వారా తమ విముక్తి ఎప్పటికీ సాధ్యం కాదని, లింగ వివక్షతో నిమిత్తం లేకుండా దోపిడీకి గురవుతున్న వారందరూ కలిసి, దోపిడీ చేస్తున్నవారందరిపైనా పోరాటం చేయటం ద్వారానే శ్రామిక మహిళలు పూర్తి విముక్తి సాధించగలరనే దృక్పథానికి సిద్ధాంతం, ఆచరణలలో వారు కట్టుబడి ఉండాలి. అంటే ఇది మహిళల రాజకీయ విముక్తి ప్రాధాన్యతను తక్కువగా అంచనా వేయటం కాదు. అందుకు విరుద్ధంగా ఓటుహక్కు సాధన కోసం జర్మనీ బూర్జువా మహిళా హక్కుల కార్యకర్తలు చేస్తున్న పోరాటాల కన్నా ఎక్కువ శక్తివంతంగా వారు పోరాటాలు చేయాలి. తమ కోర్కెల సాధన కోసం చేసే పోరాటంలో ఓటు హక్కు సాధన చివరి అంశం కాదు. తమ విప్లవ లక్ష్యమైన సోషలిస్టు సమాజాన్ని సాధించటం కోసం జరిగే పోరాటంలో దానిని ఒక ఆయుధంగా వినియోగించుకోవాలి".

***(1909 అక్టోబరు 9వ తేదీన జర్మనీలో జరిగిన శ్రామిక మహిళల సమావేశంలో క్లారా జెట్కిన్ చేసిన ప్రసంగం నుండి ఈ వాక్యాలు గ్రహించబడ్డాయి)***

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt.
Ph: 9490098977. Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.13, No.9. Published on January 1, 2019